సంగీత సాహిత్య స్రవంతి

ACCNo.30999

★

పుట్టపర్తి నాగపద్మినీదేవి

SANGEETA SAHITYA SRAVANTHI - A Collection of Various essays authored by Smt. Puttaparthi Nagapadmini, Devi, All India Radio, Hyderabad, on topics dealing with Music & Literature.

Financial Assistance given by the Govt. of Andhra Pradesh for the Publication of this book.

మొదటి ముద్రణ : నవంబరు 1986

ప్రతులు : 1,000

ACC No. 30999

వెల : రూ. 12-00

894.813109
NAG

ప్రతులు దొరుకుచోటు :

ఆంధ్ర సారస్వత పరిషత్తు

తిలక్‌రోడ్, హైదరాబాదు-500 001

ముద్రణ :

శ్రీ లక్ష్మీవేంకటేశ్వర పవర్ ప్రెస్

హిమాయత్‌నగర్, హైదరాబాదు-500 029

అంతరంగ నివేదనం

ఆంధ్ర సారస్వత లోకానికి యీ నా 'సాహిత్య ప్రవంతి' ద్వితీయోపహారం. ఇందులో సంగీతంలోని రచనాగతమైన విలువలను నేను గుర్తించినంత వరకు పాఠకుల ముందుంచేందుకు చేసిన నా ప్రయత్నం యెంతవరకు విజయవంతమైనదో నిర్ణయించవలసినది-వారే.

'మాతృదేవోభవ', 'పితృదేవోభవ' అన్నట్లు నా ప్రథమ రచన 'సాహితీ మంజూష'ను మా అమ్మగారు కీ॥ శే॥ కుం సౌ. పుట్టపర్తికనకమ్మగారికి అంకితం చేశాను. ఈ ద్వితీయ సుమాన్ని మా ఆయ్యగారు శ్రీమాన్ పుట్టపర్తినారాయణాచార్యులవారి చరణారవిందాలకు భక్తి పురస్సరంగా సమర్పించుకుంటున్నాను. సాక్షాత్ సరస్వతీ పుత్రులుగా వాసికెక్కిన మహాకవి 'పుట్టపర్తి' వారిని గురించి చెప్పబూనుకోవటం ప్రచండభానునికి దివిటీ పట్టటం వంటిదే

ఒకనాటి సాహితీ సమరాంగణ సార్వభౌముని విజయనగర సామ్రాజ్య ప్రాభవ వైభవాలకు తార్కాణమైన 'పెనుగొండ' - పుట్టపర్తివారి జన్మస్థలం. కావటంవల్ల - కృష్ణరాయని గురువుగారైన తిరుమల తాతాచార్యుల వారి వంశస్థులవటం వల్లా సునిశిత సాహిత్య వారసత్వాన్ని గరిగిన మాతాపితరుల పెంపకంవల్లా - పుట్టపర్తి వారిలోని రచనా పిపాస - పదునాలగేండ్ల చిఱుత ప్రాయంలోనే కావ్యారంభానికి శ్రీకారం చుట్టింది. పెనుగొండ లక్ష్మితో సారస్వత ప్రాంగణంలోకి అడుగిడిన ఆచార్యులవారు అనతి కాలంలోనే అనేక రచనలతో సాటి మేటి రచయితల సరసన ఉన్నత పీఠాన్నలంకరించారు. కవిగా, విమర్శకునిగా, వ్యాస రచయితగా, ఉపన్యాసకునిగా; పండితునిగా వారి కీర్తి గంధం దశదిశలకూ వ్యాపించింది. కేవలం తెలుగులోనేకాక దేశ విదేశభాషలైన చతుర్దశ భాషా సాహిత్యాలను ఆపోశనం పట్టి పదుగురిని ఆశ్చర్యచకితులను చేసిన ఘనత వారిది. నూనూగుమీసాల నూత్న యవ్వనంలో తుదుకుతనం కలగలసిన పుట్టపర్తివారిని కవితా వేదికపైన చూసిన వారి హృదయాలు శ్రావణ మయూరాలలా పురివిప్పి నాట్యమాడేవట! ఇది నేను విన్న సత్యం. నడివయసులో, గంభీరత మూర్తీభవించి తీక్ష్ణ దృక్కులతో వేదికపై ఉపన్యసించే పుట్టపర్తివారి ప్రసంగవైఖరి శ్రోతలకు కర్ణరసాయనంగా వుండేది.

ఇది నేను చూసిన సత్యం. మరి ఈనాడు రచనా వ్యవసాయంలో అనుభవ సారాన్ని నెమరువేసుకుంటూ తలపడకించే నేటి పుట్టపర్తివారిని వేటికపైన చూస్తే బాలు, సాక్షాత్తూ పుంభావ సరస్వతిని చూసినట్లవుతుంది. ఆయన వెల్లిన ప్రతిచోటా అంతులేని సన్మానాలు ! లెక్కకు మించిన సత్కారాలు !! అట్టడుగు వర్గాల వారి నుంచి అమాత్య శేఖరుల వరకూ ఆయన అభిమానులు ఎందరో ! ఇంత వున్నా - ఆత్మీయుల ఆదర సత్కారాలను నిరవధికంగా వాడుకునే నేటి యుగధర్మానికి ఆయన యెంతోదూరం. అధికారుల కనుసన్నలలో మెలిగే నేటి సాహిత్య రీతులపట్ల ఆయనకు అనాసక్తి యెక్కువ డెబ్భై సంవత్సరాలు పైబడిన మలిమి వయసులో సైతం కావ్యరచనా నిమగ్నులైనవారు విశ్రాంతి నెరుగని నిరంతర క్రియాసక్తులు. అంతటి 'పుట్టపర్తి' వారు మా తండ్రిగారు కావటం కేవలం మా పురాకృత పుణ్యవిశేషం. వారి పాదధూళికి సైతం తగిన స్థాయిలో లేకపోయినా ఈనాడు 'సాహిత్య ప్రపంచ'తోవారి పాద ప్రక్షాళనం చేసి పునీతజన్మ నవుదామన్న తలంపు ఈనాటి సాహస చర్యకు కారణం. దయతో స్వీకరిస్తారనే ఆశిస్తాను.

ఈ పుస్తక ముద్రణకై వలసిన ఆర్థిక సహాయాన్నంద జేసిన రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారికి కృతజ్ఞతాభివందనలు. ప్రెస్సు గురించిన బాధ్యత లన్నీ స్వీకరించి అందదండగా నిలిచిన శ్రీ పాండురంగయ్యవారికి కృతజ్ఞత లనటం కంటే వారు మా తోబుట్టువు లాంటి వారనటం సమంజసంగా వుంటుం దేమో !

ఇక ఈ రచనకు డా॥ చల్లా రాధాకృష్ణశర్మ, డా॥ వేటూరి ఆనంద మూర్తి, డా॥ భీమ్‌సేన్ నిర్మల్, శ్రీ ముదిగొండ వీరభద్రమూర్తి వంటి పెద్దల అమూల్యాభిప్రాయాలు లభించటం నా అదృష్టం. వారికి నా నమోవాకములు.

నర్మగర్భితమైన ముఖపత్ర రచన చేసిన మిత్రులు 'సుధామ' గారికి నమస్సుమాంజలులు. సమర్థవంతంగా ముద్రించిన లక్ష్మీవేంకటేశ్వర ముద్రణా లయం వారికి కృతజ్ఞతలు.

నన్ను అన్నివేళలా ప్రోత్సహిస్తున్న శ్రీవారు శ్రీమాన్ నల్లాన్ చక్ర వర్తుల హర్షవర్ధన్ గారికి పాదాభివందనలు.

సీర్షీర న్యాయవిద్యా విశారదులైన పాఠక మహోదయులకు మరొక్క సారి నమస్కరిస్తూ,

పుట్టపర్తి నాగపద్మినీదేవి

Dr. V. Ananda Murthy
Professor of Telugu
Osmania University

Vijayanagar Colony,
Hyderabad

అభిప్రాయం

మన సాహిత్య సంపద ఆవిచ్ఛిన్నమైనదనీ, మన సారస్వత వారసత్వం అచ్చంగా భారతీయమేననీ నిరూపించే రీతిని శ్రీమతి పుట్టపర్తి నాగపద్మినిగారి "సాహిత్య ప్రవంతి" సాగినది.

ఆద్యుల పాటల్ని ఆధారంగా చేసికొని చవులు పుట్టేవిధంగా ఆమె కావించిన సమీక్ష ఇది, మనసుపెట్టి చదివించేదిగాను, ఎనభైయేడు పుటల్లోనే మన భారతీయ వాఙ్మయరంగాన్ని చుట్టి చూపించేదిగాను ఉన్నది.

నాలుగంటే నాలుగే విషయాలెన్నుకొని ఈనేల నాలుగు చెరగులనూ ముడివేస్తున్నట్లు; ఉత్తరదక్షిణ భారతాల్నీ, తూర్పు పడమరల్నీ, కూడగట్టుకొని విస్తరిల్లిన కేంద్రబిందువుగా ఆంధ్రపథాన్ని చిత్రిస్తున్నట్లు; ఈ రచయిత్రి ఇందులో చేసిన యత్నం మెచ్చుకోదగినది. ఇలా సూరదాసుని, త్యాగరాజును, అన్నమయ్యను, పురందరులను స్మరించి వారివారి రచనావిశేషాలను వ్యక్తంగానూ తులనాత్మకంగానూ సంగ్రహంగా వివరిస్తూ, జీవన రంగంలో స్త్రీత్వానికీ మాతృత్వానికీ గల ప్రాముఖ్యాన్ని సూచిస్తూ; సంప్రదాయాన్నీ, స్నేహవాత్సల్యాలనూ, భక్తి వైరాగ్యాలనూ సోదాహరణంగా ప్రకటించడం ఈ గ్రంథంలోని మరొక విశేషం.

ముందు ముందు ఇంకా ఇంకా ఎన్నో మంచి గ్రంథాలను ఈ రచయిత్రి మనకందించగలరని ఆశిస్తున్నాను.

22-7-1986
హైదరాబాదు.

—వేటూరి ఆనందమూర్తి

ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ
తెలుగు ఆచార్యులు
మధుర - కామరాజ్ విశ్వవిద్యాలయం, మధుర

అభిప్రాయం

ఈనాడు వ్యాస సంకలనాలు చురుగ్గా చూడలుగా వెలువడుతున్న విషయం సాహిత్య జిజ్ఞాసువులకు తెలిసిందే అయితే ప్రతి వ్యాస సంకలనమూ రస హృదయుల దృష్టిని ఆకర్షించదు. విషయ వైవిధ్యమూ, రచనా వైశద్యమూ, వ్యాస సంకలనానికి పెట్టని భూషణాలుగా ఉండాలి. అప్పుడే అది రస హృదయుణ్ణి బహుగా ఆలరిస్తుంది. ఈ రెండు లక్షణాలు సాహిత్య ప్రపంచంలో నాకు ప్రధానంగా గోచరించాయి. అంతేకాక తులనాత్మక పరిశీలనా సక్తి ప్రతి వ్యాసంలోనూ చోటు చేసుకోవడం వల్ల, ఈ వ్యాస సంకలనం మామూలు సంకలనంగా కాక ఒక ప్రత్యేకత సంతరించుకొన్న సంకలనంగా కనిపిస్తున్నది.

'తెలుగు జానపద సాహిత్యంలో స్త్రీలపాటలు" అనే వ్యాసం ఈ పుస్తకానికి శిరోరత్నం వంటిది. కల్పనా లోకంలో సాధారణంగా విహరించే రచయితలు జానపద సాహిత్యం జోలికి పోరు. ఇందులో సైకరణతో బాటు మరికొన్ని సమస్యలు కూడ ఉన్నాయి అయినా వీటిని అధిగమించి శ్రీమతి నాగపద్మిని గారు స్త్రీలపాటలలోని కమ్మదనాన్నే కాక వైశిష్ట్యాన్ని కూడ చక్కగా తెలియజేశారు. మాతృత్వాన్ని గురించి ముచ్చటిస్తూ తెలుగు, కన్నడం, మహారాష్ట్రం మొదలైన భాషలోంచే కాక ఆస్ట్రేలియాలోని ఆదిమవాసుల పాటలను కూడ రచయిత్రి ఉదాహరించడం ఎంతైనా ప్రశంసించదగిన విషయం. ఇందుకు, వివిన్న భాషల పరిచయంతో పాటు తులనాత్మక పరిశీలనా సక్తి కూడ పుష్కలంగా ఉండాలి. ఈ సందర్భంలో "సూరదాస్ - అన్నమయ్యల వాత్సల్య రసపోషణ", 'పురందరుని రచనా వైవిధ్యం' అనే వ్యాసాలు కూడా పేర్కొన దగినవి. ఈ వ్యాసాలు చదువుతుంటే సూరదాసు పురందర దాసుల సాహిత్యాలలో ఇంత గొప్పదనం ఉన్నదా అనిపిస్తుంది.

ప్రతిభా గరీయస్కులు, బహుభాషా కోవిదులు అయిన శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల వారి కుమార్తె కావడం వల్లనో మరేమో శ్రీమతి నాగపద్మిని గారు కూడ బహుభాషా పరిచయం కలిగి తులనాత్మక పరిశీలనా దృష్టిని సంతరించుకొని రచన సాగించడాన్ని మనసారా అభినందిస్తున్నాను. ఈ కోవకు చెందిన రచనలు మరి కొన్నిటిని రచయిత్రి వెలువరించి ఆధునిక ఆంధ్రసాహిత్యాన్ని పరిపుష్టం చేయగలరని నమ్ముతున్నాను.

—చల్లా రాధాకృష్ణ శర్మ

Dr. Bhimsen 'Nirmal'
Professor & Head, Dept. of Hindi
Osmania University, Hyd.

1-1-405/7/1, Gandhinagar,
Hyderabad-500 380

శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని తన తల్లిదండ్రుల పాండిత్య ప్రకర్షనూ, శైలీమాధుర్యాన్ని పుణికి పుచ్చుకున్నదన్న సత్యం 'సంగీత సాహిత్య ప్రసవంతి' చదివిన తరవాత తేటతెల్ల మవుతుంది.

ఈ పుస్తకంలో నాలుగు వ్యాసాలు - విభిన్న విషయాలు ఆధారంగా - సంకలితాలయి ఉన్నాయి. వివిధ విషయాల్లో రచయిత్రి అభినివేశానికి అద్దం పట్టేటట్లుగా ఉన్న ఈ వ్యాసాలు తెలుగు సాహిత్య సౌరభాలను వెదజల్లడంతో బాటు, తులనాత్మక వివేచనతో కూడుకొని ఉన్నాయి. ఇది తెలుగు సాహిత్య విమర్శారంగంలో ఒక కొత్త ఒరవడికి నాంది. ఇలా కేవలం తెలుగు సాహిత్యం గురించే కాకుండా, ఇరుగుపొరుగు భాషా సాహిత్యాలను గురించి, జాతీయ భాషా గరిమను గురించి తెలుసుకొని, వాటిని మన సాహిత్యంతో అన్వయించుకోగలిగిన రచయిత్రి ప్రయత్నం ప్రశంసనీయం. అనుకరణీయమయిన ఈ ప్రయత్నాన్ని అంతా చక్కగా మెరుగులుదిద్ది, పాఠకుల మన్ననలందగలుగుతుందని ఆశిస్తున్నాను.

మొదటి వ్యాసంలో 'తెలుగు జానపద సాహిత్యంలో స్త్రీల పాటల'ను గురించి చర్చిస్తూ, జానపద వాఙ్మయ వైశిష్ట్యాన్నీ, స్త్రీల పాటలలో ఉన్న మాధుర్యాన్నీ వివరిస్తూ, కన్నడ-మరాఠీ భాషలలో సమతుల్యంగా ఉన్న పంక్తులను ఉటంకిస్తూ, శ్రీమతి నాగపద్మిని గారు ఆ పాటల్లోని సామాజిక స్పృహను విడమరచి చెప్పారు. స్త్రీల పాటలతో సమగ్ర అవగాహన కల్పించే ఈ వ్యాసం మళ్ళీ-మళ్ళీ చదవాలనిపించేట్లుగా ఉంది.

రెండో వ్యాసంలో వాత్సల్య తత్త్వనిరూపణ చేస్తూ, సూరదాసు - అన్నమయ్య సంకీర్తనలలో కల వాత్సల్య ప్రధానమయిన అంశాలను తులనాత్మకంగా నిరూపించడానికి ప్రయత్నం జరిగింది. ఈ వ్యాసంలో తత్త్వ నిరూపణకూ, సిద్ధాంత విశ్లేషణకూ ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో తులనాత్మక నిరూపణాంశం కొంచెం పేలవంగా ఉంది. సూరదాసుపదాలలోని ప్రధానమయిన కీర్తనలను ఉటంకించలేదు. డా. ముట్నూరి సంగమేశం గారు విశిష్టమయిన

పరిశోధనచేసి, అన్నమాచార్య - సూరదాసుల వ్యక్తిత్వ-కృతిత్వాలను గురించి క్షుణ్ణంగా వివరించాడు

మూడో వ్యాసంలో త్యాగరాజు కృతుల్లోని సాహిత్యశిల్పాన్ని చక్కగా విపరించారు. ఈ వ్యాసంలో త్యాగరాజు గారి వ్యక్తిత్వాన్ని ప్రభావితంచేసిన పరిస్థితులను ఉటంకిస్తూ, ఆయన జీవిత క్రమ వికాసంతో, ఆయన కీర్తనలకు గల సాన్నిహిత్యాన్ని చక్కగా చెప్పారు.

నాలుగో వ్యాసంలో పురందరదాసుని రచనా వైవిధ్యం తెలియజేసారు. ఇందులో కూడా పురందరదాసు జీవితంలోని విశిష్ట సంఘటనతో ఆయన కీర్తనలను జోడించడానికి ప్రయత్నంచేశాడు. అయితే ఇందులో ఉటంకించబడిన కీరనలన్నీ - ఒకటో - రెండో సంస్కృత రచనలను మినహాయిస్తే - కన్నడ భాషలో వ్రాయబడ్డవే ప్రతికీర్తనకు సమగ్రమయిన అర్థం వ్రాస్తే తెలుగు పాఠకుడికి సులువుగా ఉండేది. ఆ కీర్తనలోని సారాంశాన్ని రేఖా మాత్రంగా స్పృశించడం సరిపోదు.

మొత్తంమీద రచయిత్రి విషయాన్ని చెప్పిన తీరు, శైలీసౌలభ్యం పాఠకుల మనస్సును ఆకట్టుకునేట్లుగా ఉన్నాయి. తరు చెప్పే విషయంతో ఇతర భాషలలోని పద్యాలను, కీర్తనలను ఉటంకించిన పద్ధతి రచయిత్రి వైదుష్యానికి తార్కాణం.

రచయిత్రి ముందు ముందు ఇతోధికంగా సాహిత్యసేవచేసి, కృతులు వెలయిస్తుందని ఆశిస్తున్నాను.

ఇతి శమ్

భీంసేన్ నిర్మల్

వ్యాసాలు కావు వ్యాసకవిత్వం

శ్రీమతి పుట్టపర్తి నాగపద్మినిగారు రచించిన 'సాహిత్య ప్రసంతి' - ని చూచే అవకాశము కలిగినందులకు చాలా సంతోషిస్తున్నాను. ఈ పుస్తకం చిన్న సైజ్ - మిన్న సైజ్. ఈమె గారికి జానపద సాహిత్యంతో వున్న కూలంకషమైన పరిచయం - యిందులో ప్రతిబింబించింది. ఆంధ్రంలోనే కాక. కన్నడ, మరాఠీ ఆంగ్లాది భాషలలోని జానపద సాహిత్యంతో పీరి పరిచయం పరిగాఢం. నిజానికి యే దేశంలోని మహాకవిత్వానికైనా, ఆ దేశంలోని పల్లెటూళ్లలోని సామెతలు, పాటలు, ఆ భావిల్పం, హృదయంలోనికి చొచ్చుకునిపోయే పలుకుబడులు- అవే ప్రాణము పోసేవి. ఈమెగారు మానవ జీవితాన్ని సమగ్రంగా అన్ని కోణాలనుండి చూచి, యిందు వివిధంగా ప్రదర్శించటం- యీ వ్యాసరచనా శైలిలోని విశిష్టత. ప్రత్యేకంగా వక్తవ్య విశేషాలు - ఈమెగారు వాడిన కన్నె దొంగ' - అన్న శబ్దం. శ్రీ అన్నమాచార్యులవారి 'దొరదొంగ' - శబ్దం వలె బాగున్నది. ఈ గ్రంథం చదవటం అయిపోయినపుడు- 'మరికొంత వుంటే బాగుండేదే' అనిపించింది. సూరదాసు, అన్నమయ్య, త్యాగరాజు - వారల జీవితాలలోనికి లోతుగా పోయి, యీమె యెన్నో రహస్యాలను వెల్లడించింది. వీరింకా యెన్నో వ్యాసాలను వెలువరించాలని కోరుతున్నాను. పద్యకవిత్వానికి వస్తే పద్యాలను వుదహరించటం ఆలవాటు. ఈ వ్యాసకవిత్వం చదువుతూ వుండే కొన్ని యీ వ్యాసపంక్తులను కూడా వుదహరించవలెనని అనిపించింది.

ముదిగొండ వీరభద్రమూర్తి

"తెలుగు జానపద సాహిత్యంలో స్త్రీల పాటలు"

పల్లె సీమలు అనగానే పచ్చగా కళకళలాడే పైరులు, చిరుగాలికి అలవోకగా వూగే మొక్కజొన్న చేలు, రసాలతో నిండి నోరూరించే చెఱుకు తోటలు, పొలాలగట్ల వెంట విరగబూసిన పేరు తెలియని పూల పలకరింపులు, పంటకాలువల గట్ల వెంబడి పరుగులు తీసే పల్లెటూరి అల్లరిపిల్లల ఆకతాయితనాలు, చేలలో వయ్యారంగా వంగి కలుపులు తీసే పల్లెపడుచుల స్నిగ్ధ సౌందర్యాలు, పిటన్నింటికీ తోడు యెక్కడో లీలగా వినిపించే పల్లెపదాలలోని ఆత్మీయతయివన్నీ మన కన్నులముందు నిలిచే అచ్చమయిన అందాలు. ఈ పల్లెపదాలు యే జాతి సంస్కృతికయినా తరతరాల చరిత్రను తెలిపే సజీవ ఉదాహరణలు.

ఈ పల్లెపదాలకు జానపద గేయాలన్న పేరు కూడా వుంది. అసలు యీ 'జనపదం' అన్న పదానికి అర్థమేమిటో ముందుగా తెలుసుకోవాలి. 'జనపదం' అంటే కేవలం పల్లెటూరు అన్న అర్థం చెప్పుకోవటం సరయినదిగా కనిపించదు. 19 వ శతాబ్దంలో జనపదం (Folk) అన్న పదాన్ని నిర్వచించిన విద్వాంసుల ప్రకారం "విద్యావిహీనులయిన కర్షక జనులు-గ్రామీణులు" అనే అర్థమయినాయిటివలికాలంలో 'జనపదం' అన్న యీ పదానికి అర్థం కొంత మారిందనవచ్చు. జానపద విద్వాంసుడయిన అలన్ డండెన్ ప్రకారం - ఒకే భాషకు లేదా ఒకే ప్రాంతానికి చెందిన లేదా ఒకే భావాలు గలిగిన జన సముదాయాన్ని 'జనపదం' అన్న పేరుతో పిలువవచ్చునన్నమాట! వీరికి కొన్ని ప్రత్యేక సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలూ వుంటాయి 'జన సముదాయం' అన్నపదం వాడినపుడు కనీసం నలుగురైదుగురికి మించి వుండాలన్న అర్థం తోస్తుంది. కేవలం ఒక యింటిలోనే కనీసం ఆయిదారుమంది సభ్యులు వున్నప్పుడు జానపద సముదాయాలలో అంత కంటే యెక్కువ మందే కలిసికట్టుగా వుండటం ఆసహజమేమికాదు. ఈ విధంగా జానపదుల్ని నిర్వచించటంవల్ల "ఫోక్"అన్న పదానికి అర్థం ఒక కుటుంబం ఒక గుంపు, ఒక ప్రాంతం లేదా ఒకదేశం...యిలా చెప్పవచ్చు. ఆ దృష్ట్యా చూస్తే,

ఒక యింటిలో ఆచార వ్యవహారాలకూ, అలవాట్లకూ, మరో యింటి ఆచార వ్యవహారాలకూ తేడా వుండవచ్చు. అందుకే ఒక యింటికి సంబంధించినంతవరకు వారి పద్ధతులు, నమ్మకాలు, అలవాట్లు, యింటి పేరు వంటి వాటిని గురించిన వివరాలు ఆ యింటి జానపద విజ్ఞానమయితే అదే దేశపరంగా ఆ దేశ 'జానపద విజ్ఞానమూ' అవుతుంది.

జానపదులు- అన్న పదానికి పైన వివరించిన ఆధునిక నిర్వచనం ప్రకారం ఒకే విధమైన సంప్రదాయాలు, ఆచారాలు కలిగిన ఆటవిక జనులయినా, గిరిజనులయినా, గ్రామీణులయినా, నగరవాసులయినా జానపదులే అవుతారు. అటువంటపుడు వారివారికి సంబంధించిన ప్రత్యేకమైన జానపద విజ్ఞానాలూ వుంటాయి. ఉదాహరణకు భారతదేశంలో వివిధ రాష్ట్ర ప్రజలకు ప్రత్యేక జానపద విజ్ఞానాలు వున్నాయి. అంతేకాదు. ప్రధానంగా మనకు తెలిసిన జాతుల వారేకాక ఆనేక వుపజాతులకూ, తెగలకూ సంబంధించిన జానపదవిజ్ఞానాలూ వున్నాయి. కేవలం ఆంధ్ర రాష్ట్రంలోనే వివిధ తెగలవారూ, వారికి ప్రత్యేకమైన సంప్రదాయాలూ వున్నాయి.

చెప్పొచ్చేదేమిటంటే 'జానపద విజ్ఞాన'మన్నది ఒక సువిశాలమైన సాగరం వంటిది. అందులో ప్రత్యేక విలువలున్న ముత్యాలెన్నో వున్నాయి. వాటిని వెలికి తీయటానికి యెంతో కృషి చేయవలసి వుంది.

జానపద విజ్ఞానంలో ఒక జనసముదాయానికి సంబంధించిన ఆచార వ్యవహారాలూ, నమ్మకాలూ, సాంఘిక నియమాలూ, సాంస్కృతిక విలువలూ మొదలైనవి వుంటాయన్నాం. మరి వీటన్నింటితో పాటూ, జానపద సాహిత్యమూ ఒక ప్రత్యేక విభాగంగా పరిగణింపబడుతుంది. యిక జానపదసాహిత్యాన్ని యిం క్రింది విధంగా విభజింపవచ్చు.

(1) జానపద కవిత్వం { జానపద గేయం, జానపద కథాగేయం }

(2) గద్య కథనాలు { కథలు, ఐతిహ్యాలు, పురాణాలు }

(3) సామెతలు

(4) పొడుపు కథలు

(5) జానపద భాష

ప్రకృతం మనం తెలుసుకోవలసింది - జానపదగేయాన్ని గురించి సాహిత్యంలో పద్యంకన్నా ముందు పదం (పాట-గేయం-గీతం) పుట్టిందని ప్రాచీన సాహిత్య మీమాంసకుల అభిప్రాయం. సంతోషం కలిగినపుడు మానవుడు కూనిరాగాలాపనతో తనకు తోచిన పాట పాడతాడు కానీ-వ్యాకరణ బద్ధమైన పద్యాన్ని చెప్పడు. అందుకే పద్యంకంటే ముందు పాటే ఆవిర్భవించిందని పలువురు పెద్దల యేకాభిప్రాయం.

ఈ జానపదగేయం పదిమందీ ఒకచోట కలిసి పనిచేసేటపుడు, ఉల్లాసంగా కాలం గడిపేటప్పుడు, సంతోషం వ్యక్తీకరించుకోవడం కోసమో లేదా - శ్రమ తెలియకుండా వుండేందుకో - ఒకరు కూనిరాగాన్నందుకుంటే మరొకరు తమకు తోచిన పదాలలో దాన్ని ముందుకు నడుపుతారు. పదిమందీ కలసి రూపొందించేదే అయినా యిందులో తాళనిబద్ధత వుండటం విశేషం. జానపదగేయ రచనాకారులకు తమపేరు వెలువరించుకోవాలన్న తపన వుండదు. అందుకే జానపదగేయకర్తలెవరో ప్రత్యేకంగా తెలిసే అవకాశంలేదు. అది సమష్టి కృషి. జానపదగేయానికి మరో ముఖ్య లక్షణం - నియమిత రూపం లేకపోవటం. పైగా దానికో సరిహద్దుకూడా లేదు. ఒక ప్రాంతంతో పాడబడే పాట - మరో ప్రాంతంలో వుండదని ఖచ్చితంగా చెప్పలేము. కాకపోతే - ఒక జన సముదాయంలో నుంచి మరోచోటికి ప్రవేశించినపుడు దానిలో కొన్ని కొత్త చరణాలు చేరవచ్చు. ఆలాగే పాడే తీరు కూడా ఆయా ప్రాంత ప్రజల ముఖ యంత్రాంగాన్ని బట్టి కొంతవరకూ మారే అవకాశం కూడా వుంది. "English and Scottish Ballads" అనే గ్రంథపు రచయిత F. J. Child యీ విషయమై ప్రస్తావిస్తూ యిలా అన్నారు. — "It follows a genuinely popular ballad can have no fixed and final form, no sole authentic version, There are texts but there is no Text

జానపద గేయానికి మరో ముఖ్యలక్షణం - రచనాకాలం యిదమిత్థమని తెలియక పోవడం.

"A folk sang is neither new or old, because it is continually taking on new life. It is an individual flowering on a common stem"

—*The Encyclopaedia Britannica (R.V.W)*

జానపద గేయ ప్రాచీనతను గురించిన యీ నిర్వచనం యెంతో సహజంగా వుంది. నిజానికి జానపద గేయంలోని యితర ఆకర్షణలు, విశేషతలకంటే అందులోని భావ వైశిష్ట్యానికే యెక్కువ విలువ అనఁచ్చునేమో !

పై చెప్పిన ముఖ్యలక్షణాలే కాకుండా జానపద గేయంలో సామూహిక ప్రచారం, మౌఖిక సంప్రదాయం, సారళ్యం, జాతీయత వంటి యితర లక్షణాలూ వున్నాయి. వీటన్నింటికి తోడుగా అపార జీవితానుభవం పెట్టని ఆభరణంలా వెన్నంటే వుంటుంది.

మానవుడు తన మనోభావాన్ని యితరులతో చెప్పుకోవడం నేర్చుకున్న ప్పుడే - కవిత్వం ఆవిర్భవించిందని చెప్పవచ్చు. నేదునూరి గంగాధరంగారన్నట్లు - మలమలమాడ్చే యెండలు, హోరున కురిసే వర్షాలు, మండుటెండ పోయే చలి, ఆనందంతో హృదయాన్ని పుట్టుూతలూగించే పంటపొలాలు, శరీరాన్నంతటినీ కదిలించివేసే కష్టమయిన పనులు, చావులు, పుట్టుకలు, పేరంటాలు, పండుగలూ,, పబ్బాలూ యిలా ప్రతి సంఘటనా పల్లెటూరివారి కవితావేశానికి మూలకందాలే.

జానపద గేయం పుట్టుక గురించి ఆలోచిస్తూ వెళ్తే చాలా వెనక్కు వెళ్ళవలసి వస్తుంది. హాలుడు సేకరించి భద్రపరచిన 'గాథా సప్తశతి'లో వివిధ రచయితల రచనలున్నాయి. అతడు ఆంధ్రరాజు. అందుకే అతడు సేకరించిన యీ ప్రాకృత రచనలలో ముఖ్యంగా ఆంధ్రులే రచయితలు. నాడు అతడు పాలించిన కుంతలదేశం-రాయలసీమ ప్రాంతానికి సంబంధించినదే గనుక ఆంధ్ర భాషా ప్రసక్తి కూడా వుండక తప్పదు. గాథాసప్తశతిలో అప్పుడప్పుడు వినిపించే గేయ ప్రసక్తి తెలుగు వారికి సంబంధించినదే అయి వుంటుందని విజ్ఞుల అభిప్రాయం. దీనిని బట్టి తెలుగుభాషలో గేయాలు చాలా పూర్వకాలం నుంచీ వున్నాయనవచ్చు. అంతేకాదు తెలుగు భాషలో యిప్పటివరకూ లభ్యమైన అతి ప్రాచీన శాసనాలలో ఒకటైన అద్దంకి శాసనంలోని 'తరువోజ' తొమ్మిదవ శతాబ్దంలో రోకటి పాటలవంటి పాటలు ప్రచారంలో వుండేవని చెబుతూంది. నన్నెచోడుడు, పాల్కురికి సోమనాథుడు వంటి ప్రాచీన కవులు నాడు ఆచారంలో వున్న కొన్ని జానపద గేయ ప్రక్రియలను తమ రచనల్లో ఉదహరించి వాటి కొక చారిత్రక ప్రాశస్త్యాన్ని చేకూర్చిపెట్టారు. సోమనాథుడు పేర్కొన్న కొన్ని ప్రక్రియలు యిలా వున్నాయి:

పదములు తుమ్మెద పదమల్ ప్రభాత
పదములు పర్వత పదము లానంద
పదములు శంకర పదములు నివాళి
పదములు వాలేశ పదములు గొబ్బి
పదములు వెన్నెల పదములు సంజ
వర్ణన మరి గణ వర్ణన పదము
లర్ణవ ఘోష ఘూర్ణిల్లుచునుండ
బాడుచు నాడుచు బరమహర్షమున
గూడి సద్భక్త సంకులమేగుదేర—

కృష్ణరాయలు, శ్రీనాథుడు వంటి మహాకవులే కాక, పదకవితా పితామహు డైన తాళ్ళపాక అన్నమాచార్యుడు కూడా నాడు ప్రచారంలో వున్న జానపద సాహిత్యప్రక్రియలను తమ రచనలలో వాడుకున్నారంటారు. ముఖ్యంగా అన్నమయ్య పదాలలో గొబ్బిళ్ళ పాటలు, ఏల పాటలు, చందమామ పదాలు వంటి వెన్నో వున్నాయి. ఈ విధంగా తెలుగులో జానపదగేయ ప్రపత్తి ప్రాచీన కవుల రచనల్లో కనబడి వాటి ప్రశస్తిని గురించి తెలియజెప్పుతూ వుంది.

జానపద సాహిత్య విస్తృతి గురించి ముచ్చటించాలంటే అదే గొప్ప ఉద్గ్రంథమవుతుంది. యిదివరకే చెప్పినట్లు మానవ జీవితంలోని ప్రతి సంఘటనా జానపదగేయావిర్భావానికి అనుకూలమైనదే. అందుకే విధ సందర్భాలలో పాడు కొనే పాటలు వేలకొద్దీ వున్నాయి. వాటిలో "స్త్రీల పాటలు"ఒక విశిష్టతను కలిగి వున్నాయి.

సంసారయాత్రలో స్త్రీకి గల ప్రాధాన్యము పురుషునికి లేదు. అందుకే ఆమెను 'గృహలక్ష్మి' అన్నారు. కేవలం సాంసారిక జీవనానికే కాక, జగత్తుకే స్త్రీశక్తి 'ప్రచోదక శక్తి' వంటిదని అంటారు. ఆఖరికి స్త్రీసాంగత్యం లేనిదే పురుషుని జీవితం నిరర్థకం అనేంతవరకూ వెళ్ళింది. అందుకే జానపద సాహిత్యంలోనూ స్త్రీజీవితానుభవాలకు యెక్కువ ప్రాధాన్యము యిచ్చారు.

స్త్రీల పాటల సంపుటాలలో తెన్నేటి తిరుమలదాసుగారి 'వేడుక పెండ్లి పాటలు' బేకుమళ్ళ కామేశ్వరరావుగారి 'పాత పాటలు' నేదునూరి గంగాధరంగారి 'సెలయేరు' సుప్రసిద్ధాలు.

గృహజీవితంలో వివిధ వ్యక్తుల మధ్య సంబంధ బాంధవ్యాలకు అనేక గేయాలు అద్దం పడతాయి. అమ్మ-కూతురు, అత్త-కోడలు, వదిన-మరదులు అన్నా చెల్లెళ్ళు - వీరికి సంబంధించిన గేయాలలో ఆయా ప్రాంతాల అలవాట్లు ఆచారాలు, నమ్మకాలు మొదలైనవి చక్కగా తెలుస్తాయి.

ముఖ్యంగా స్త్రీ జీవితంలోని వివిధ ఘట్టాలను వర్ణించే పాటలు 'స్త్రీల పాటలు'గా ప్రసిద్ధి చెందాయి. ఉదాహరణకు వివాహ సందర్భాలలో పాడేపాటలు. అత్తగారింటిలో రకరకాల మనస్తత్వాల మధ్య జీవితం, మాతృత్వంకోసం తహ తహ, యిలాంటి సమయాలలో స్త్రీ మనసులో మెదిలే భావాలన్నింటికీ జానపద సాహిత్యంలో స్థానం లభించింది. వీటన్నింటి వెనుకా స్త్రీ మనస్తత్వం ఎంతో అందంగా తొంగి చూస్తూ వుంటుంది.

ఇప్పుడు ఒక్కొక్క విభాగానికీ చెందిన పాటలను గురించి ముచ్చటించుకుందాం

1) వివాహ సందర్భాలలో పాడుకునే పాటలు

స్త్రీ జీవితంలో వివాహం అత్యంత ప్రధానమయిన ఘట్టం.

ప్రతి తల్లీ-తనకుమార్తె మంచికుటుంబంలో కాలు పెట్టాలని అనుకుంటుంది. తమ అమ్మాయి అత్యంత సుకుమారి అనీ దానికి తగ్గట్టు కాలు కిందపెట్టకుండా దర్జాగా మసలే లక్షాధికారుల యింటిలో పడితే ఆ తల్లికి యింకేంకావాలి! అందుకే అమ్మాయికి తగిన సంబంధాలు చూడాలనుకుంటుంది.

"అల్లవూరివారు పిల్ల నడిగేరు
పిల్లవానికి రూపు రేఖలున్నాయి
ఏచేట పండేటి భూములున్నాయి
వూరి పొలిమేరలో తోటలున్నాయి

చుట్టు కొల్లారంపు మిద్దెలున్నాయి
కుఱ్ఱవానికి మంచి నేద్యమున్నాది
మన పిల్లకూ తగ్గ యీడు జోడేను
కన్నెనిస్తామని కబురంపుదాము"—

యిక వరునివైపు వారి ఆకాంక్ష లిలావుంటాయి.

"శ్రీరామ చింతల్ల పండు బండింది
చూచి రావే సీత కోసుకుందామే
బీరెల్లి వారింట్ల కన్య పుట్టింది
చూచి రావే లక్ష్మి చేసుకుందామే
ఎన్నిల గాయంగ ఏరుపారంగ
ఏరు దాటొచ్చేది ఎవురాడుబిడ్డ
పచ్చని కుచ్చుల్ల పాలకీ నెక్కి-
బల్గంబు చూడొచ్చె దుర్గయ్య లక్ష్మి
అన్నతో వియ్యంబు అందవచ్చింది
వదినెతో వరవొసుకు ఆడవచ్చింది
బిడ్డ పుట్టిందని చెప్పంపు అననా
బిడ్డకూ నూనెయ్యి బుడ్లు పంపెదము"—

తెలుగు వారిలో మేనరికాలకు యెక్కువ ప్రాధాన్యము యిస్తారు. మేనరికపు కొట్లాటలలో "శశిరేఖా పరిణయగాథ" ప్రసిద్ధికెక్కింది. మేనరికం వుండగా వేరేవాళ్ళు సంబంధం చేసుకునేందుకు సందేహిస్తారు. ఆలాగే బావా మరదళ్ళ మధ్య చనువు యెంత చక్కగా తెలుస్తోందో యీ పాటలో!

తోటక్కు- కాచారు దొంగలిద్దారు
తొలకరి స్తే పూలు కోనేద్దామని
అబ్బాయి కాచేడు మామయ్య యిల్లు
కానకుండా పు స్తె కట్టెద్దమని
తెలియకుండా తలంబ్రాలు పోనేద్దమని
దూరాన పులిజంపి దారులే కాసి
దండిగా మేన త్త కొడుకు వచ్చాడు
పుట్ట చాటున పులి జంపి వసంత మాడి
వాసిగల మేన త్త కొడుకు వచ్చాడు
చెఱువు కట్టల మీది కొంగల్ని జూచి

చెఱువు చేపలన్ని చెల్లాటలాడె
మంద కట్టలమీద బావల్ని జూచి
మచ్చికలు చేసేరే మామకూతుళ్లు
యేనుగను యెక్కేవు యెల చిన్నవాడ
ఏ యత్త కడిగింది ముద్దు పాదాలు
వరసకు అవుతాడు మేన త్త కొడుకు
వరసకు వేసేడు వరహాల పేరు''—

యిక పెండ్లికి సంబంధించిన పాటలు కోకొల్లలు. కల్యాణం పాటలు, గంధం పాటలు, సువ్వి పాటలు, తలుపుదగ్గర పాటలు, బంతులాట పాటలు, బువ్వం బంతి, ఆలక పాటలు, ముఖముకడిగే పాటలు యిలాంటి పాటలు చాలా వున్నాయి. వివాహంలో ప్రతి సంఘటనా చాలా ప్రధానమైనది. పసుపు కుంకుమలకు, తలంటులకు, వూయెలకు, వసంతాలు చల్లుకునేందుకు, పానుపుకూ – యిలా అన్ని సందర్భాలలోనూ పాటల సంరంభా లెక్కువ. ఇవిగాక పెళ్ళికూతురు తరపు ఆడవాళ్ళు, పెళ్ళికొడుకు తరపు ఆడవారూ ఒకరినొకరు పరాచికా లాడుకుంటూ పాడే పాటలు – ప్రత్యేకించి చెప్పుకోదగ్గవి.

వివాహ సమయంలో 'నాందీ ప్రస్తావన' చేయటం ప్రథమ కార్యం ఆ సందర్భంలో పాడుకునే పాట యీ క్రిందిది.

''సువ్వి సువ్వి రామచంద్ర
సువ్వి సువ్వి కీర్తి సాంద్ర
సువ్వి సీతమ్మ మాకు
శుభము లిమ్మా''

''మోదమునను పెండ్లి పీట
మీద శ్రీరాము సరస
ఆదిలక్ష్మియైన సీతమ్మ నునిచిరీ''

''వాటమైన కుందనంపు
మేటి కుందెయందు నిల్చి
గాటమైన పసిడి రోకళ్లు పట్టుకా''

"రాజనములు యిప్ప పువ్వు
రాజనములు మంచి పునుగు
రాజనము సన్న జిలుగు
రాజనములునూ"

"కుందెనందు నిండ నించి
కొట్నమూలు దంచిరపుడు
కుందరదన లెంతవింత కులుకుచుండగా"

శ్రీవైష్ణవ సంప్రదాయంలో శ్రీశ్రీకృష్ణ పరబ్రహ్మ తంత్ర పరకాలస్వామి వారు తమ పూర్వాశ్రమంలో విరచించిన కల్యాణగీత మంజరి అన్న సంస్కృత రచనలలో వివాహ సందర్భాలలో పాడుకోవటానికి వీలుగా అనేక గేయాలు వున్నాయి. "నాంది ప్రస్తావన!" గురించి ముచ్చటించుకునే యీ సందర్భంలో వారి యీ గీతాన్ని యిక్కడ పొందుపరుస్తున్నాను.

"సువ్వి సువ్వి నిఖిల జగతి - భవ్యమస్తు సతతమితి సు
నవ్య రత్నములలోని । శాం వ్యఘట్టయన్"

రంగవల్లి కాభిరధిక - మంగణాన్యలంకృత్య
మంగళాదులూఖలంచ - తుంగవైభవమ్" ॥సువ్వి॥

"కాంచనీఘసృణ పట్ట । సంచితం సమారచయ్య
పంచ యోషితోథములల । మంచయంతితమ్"

"యదుకులేంద్ర పరిణయాయ । ముదిత చేత సస్త్రియోధ
విదిత గీతమాల వంత్య । ఉదిత మంగళమ్"

"మంజు కింకిణీ విలసిత । శింజితేన కమలకాంతి
రంజితేన వాణినాతి । మంజులా స్తదా"

"మంద హసిత లలితవిమల । సుందరస్మేర గండ
మిందు ముఖ్య ఉచితమా । నందమేదురమ్

"జయనవీన దుర్గ కృష్ణ । నియత వినుత యాదవేతి
పయసిజాభిలో చనాళ్ళ । నయవితోఒనిశమ్ ॥సువ్వి॥

తరువాత నలుగుకు పిలవడం

నలుగూకు లేచి రారా । రాజగోపాలుడూ
యశోద బాలుడా । అంత చలమేలరా''

''గంజాయి దూదిలో కనక మెత్తవేసి
పట్టు తలగడలు రెండు దిట్టపరచి నానురా''

''శయ్యాగృహంలోనే వుయ్యాల వేసినాను
నిలువూటద్దము దెచ్చి నీడ నిలిపినాను రా ॥నలుగు॥

''చిల్కాల పానుపే చిత్రమూగా వేసినాను
హంసాల పానుపే అమర్చినానురా''

''నలుగీడ కోరితి నలినాక్ష నీకు
వెలలేని రత్నాలు వేగ రావయ్యా''

''వినవయ్యా రఘురామా విభవాద్రిసోమా
జగతి భూకన్య చక్కని సీత''

''ఆగురు చిత్తర బొమ్మ ఆహా మాయమ్మ
మరువంపు మొలకా మన్మథు ముద్దుచిలకా
కుసుమాబాణ కఠారి కులుకు మిఠారి
వెలలేని రత్నాల పతకమే మెరయనా''

నలుగు పాటలలో 'నలుగు' వర్ణన వుంటుంది. ఆత్తరులోన మేలి మత్తరులయిన అంబరు గురించీ, కొత్త సంపంగితో గోవిందునకు నలుగు పూయటం - తెలంగాణా నలుగు పాటలలో కనిపిస్తే - పాదాలకు పసుపు, ఆగరుగంధం మేన అలదుకోవటం, మల్లెలు మొల్లల హారాలు వేసుకొని - ఆత్తరు నూనె - పునుగు జవ్వాదులను ఒంటికి పూసుకోవటం వంటి వర్ణనలు - 'రాయల సీమ' నలుగు పాటలలోని ప్రత్యేకత.

పెళ్ళి కొడుకు - పెళ్ళి కూతుర్లతో బంతులాట ఆడించటం ఒక చక్కటి కనుల విందైన సంప్రదాయం. ఆ సందర్భంగా పాడే పాట యీ క్రిందిది:

"బంతులాడిరీ బాలకృష్ణులు - మరివింతగ చేమంతి పూలబంతి చేపట్టి

ఆణిముత్యంబు ముక్కెర అందమై మెరయా
గేదంగి రేకుల జడ రుక్మిణి కూడి యాడగ॥
తీరుగా మామంచి తిలకమే అద్ది
అడియోరకం చూపువా వయ్యారమే మెరయా"

ఆడపెళ్ళివారు మగపెళ్ళివారు కలిసి కూర్చునే భోజనాలను 'బువ్వంబంతి' అంటారు. ఆ సందర్భంగా పాడుకొనే యీ పాట చూడండి.

రామచంద్రుల బువ్వము రమణిరో ఎంతో సుందరమే
ప్రేమ మీరంగ జూతము స్వామి భద్రాచల రాములను

"వజ్రాల పీటలే వేసి - అపరంజి అరిటాకులే బరచీ
బంగారు చెంబులలో - వెండి పంచ పాత్రలతో
మంగళాకారుడయిన శ్రీ రఘు బృందముల కృప చేతను"

"ఆంగనామణులెల్ల గూడి - చెలంగుతు నుండె
పంచ భక్ష్య పాయసాన్నములు - పరగంగ శోకసములు
పంచకజ్యాయములతోను - పరగంగ వడ్డించిరంత
నెయ్యిమీగడ పెరుగు - నెమ్మదిగా బహుతృప్తి పొంద
వియ్యాల వారకుడి ఒప్పుతో భుజింపుమనిరి"

వియ్యాలవారు ఒకరినొకరు ఆట పట్టించుకుండే పాటలూ కొన్ని వున్నాయి. ఉదాహరణకి యీ పాట.

వెలదిరో మన వియ్యాలవారిది - ఎఱుకలి కులమమ్మ వీరిది
యానాదికులమమ్మ - ఎరిగీ ఎరుగక వీరితో మేము
వియ్యమందితిమి॥
గాంభీర్యమున పేర్వెలసినవాడు ఘనుడు మా తండ్రి
గజ్జెల గుర్రంబు నెక్కి - కదిలి వచ్చితిమి"

"తట్టాబుట్టలల్లునమ్మ - తాను పెద్ద వదినె
వెలదిరో రెండవ వదినె - వెల గూర్చునమ్మా"

"నరహావతారుని - కాల భైరపుని వెంట బెట్టుకొని
వూరువూరూ తిరిగేవారని - తెలియకపోతిమి"

వియ్యాల వారిది ఎరుకుల యానాది కులమట! పెద్ద వదినె తట్టలు, బుట్టలూ చేస్తే చిన్న వదినె అమ్ముకొని వస్తుందట! అంతేకాదు. వియ్యాలవారు పందులు, కుక్కలను వెంటబెట్టుకు తిరిగేవారని యింతవరకూ తమకు తెలియనే తెలియదట! మరి యిటువంటి మాటలకు తగిన సమాధానం వియ్యాలవారు చెప్పకుండా ఎలా వుంటారు?

మనకెక్కడ దొరికినారే బల్ టక్కరు లబ్బబ్బా తగనీ
వియ్యాలవారు

మాటలు బహుతేట మన్ననలూ రూట
బైటడంబరమే గానీ పైసాలేదు
యెన్నో ఆభరణములు కన్య కిడుదుమని
సున్నాజుట్టిరి గద చోద్య మొందగ!"—

తలుపుదగ్గర పాడే పాటలు కూడా చాలా సరదాగా వుంటాయి. మంగళ స్నాతధారణ మొదలైనవాటి తరువాత వధూవరులను లోనికి పిలుచుకొని వెళ్తారు. అప్పుడు తలుపు దగ్గర యిద్దరినీ నిలవేసి - ఒకరి పేరు మరొకరిని చెప్పమంటారు. పదిమందిలోనూ పేరు చెప్పేందుకు సిగ్గుపడే వధూవరులను నేల నంటిపెట్టుకొని యివతలకు రాననే అవనతవదన - పెళ్ళికూతురి మూపులలోని సంకోచాన్ని పెద్దలు ముచ్చటగా చూస్తూ ఆనందించే ముచ్చటకు సంబంధించిన దీ సంప్రదాయం.

"గుర్రాన్నెక్కి పెండ్లి కొడుకు వచ్చి వాకిట నిలిచినాడు
తలుపు తీయవే వదినా మాకు తడవాయె నేడు

"గుర్రాన్నెక్కి వస్తే నేమి - కుక్క నెక్కివస్తే నేమి
పేరు చెప్పిన దనుక తలుపు తీయము"

"ఏనుగునెక్కి పెండ్లికొడుకు వచ్చివాకిట నిలిచినాడు
తలుపు తీయవే వదినా తడవాయె నేడు"

"ఏనుగు నెక్కివస్తేనేమి - ఎలకానెక్కివస్తే నేమి
పేరు చెప్పిన దనుక తలుపు తీయము"

"రైల్ బండి యెక్కి పెండ్లికొడుకు వచ్చి వాకిట నిలిచినాడు
తలుపు తీయవే వదినా తడవాయె మాకు"

"రైల్‌బండి యెక్కి వస్తేనేమి - గాడిద నెక్కివస్తేనేమి
పేరు చెప్పిన దనుక తలుపు తీయము"

పెళ్ళికుమారుని యిలాంటి పాటలతో ఆట పట్టించినా దాన్ని సరదాగా తీసుకునేవారే గానీ - కోపతాపాలకు తావు వుండేది కాదు. మరోపాట చూడండి.

"పెండ్లికొడుకు ప్రతాపం చెప్పేను వినండి
కూర్చుంటే గుడ్లగూబ - నిలబడితే తాడిమాను
పరిగెత్తితే జనకంబొట్లు
యిన్ని గల్గిన మా బావగారికి యిదే సభలో ఆభస తాంబూలం"

భోజనాల సమయంలో కూడా పెండ్లికొడుకు పక్షంవారు తామేమి అడిగినా పెళ్ళికూతురు పక్షం వారు పెట్టటం లేదని - వారు చాలా బీదవారనీ దెప్పిపొడిస్తే యివతలివారు, విమ్యాలవారికి ఎంతపెట్టినా చాలటం లేదనీ యింతటి శుద్ధ తిండిపోతులని తెలియదనీ అంటూ "యిదేమి తిండి? యెద్దుల మేత?" అని దెప్పిపొడుస్తారు. యిటువంటి పాటలెన్నో పాడేవారా కాలంలో.

పెండ్లిలో చివరి ఘట్టం అప్పగింతలు. తొమ్మిది నెలలూ మోసి, తమకు తగినంతలో ముద్దు ముచ్చటా చేసి పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పించిన ఆడపిల్లను యితరుల యింటికి పంపాలంటే యే తల్లిదండ్రుల కది గుండెకోతగా వుండదు? ఎంతటి కఠినాత్ములకయినా కన్నులలో నీరు తెప్పించే - అతి కరుణాత్మకమయిన ఘట్టమది. అమ్మాయి వివాహంవల్ల ఆయా తల్లిదండ్రులకు కొంత వరకు బాధ్యత తగ్గినా తమ కన్నకూతురిని యితరుల యింటికి శాశ్వతంగా అప్పగించాల్సిన యీ సమయంలో మాత్రం యిన్ని దినాలూ బరువుగా భావించిన ఆడపిల్ల అత్యంత ప్రీతి పాత్రంగా తోస్తుంది. హృదయాలు భారంతో

క్రుంగిపోతాయి. ఈ సందర్భంగా ఆశ్రమవాసి అయిన కణ్వమహాముని గుర్తు తెచ్చుకోక తప్పదు. కన్నబిడ్డ కాకపోయినా పెంచిన మమకారం - శకుంతలను దుష్యంతుని చెంతకు పంపించే సమయంలో-యెంతటి చిత్తక్షోభను కలిగించింపో శాకుంతలంలోని ఆ ఘట్టంలో విదితమవుతుంది. కన్నబిడ్డను పరుల యింటికి తమకు తామై పంపే తల్లిదండ్రుల కడుపుకోత యెటువంటిదో ఆర్థమవుతుంది. ఆలాంటి సందర్భంలో స్త్రీలు పాడే యీ ఆప్పగింతల పాటలో అత్తింట మెలగ వలసిన విధానాన్ని పూసగుచ్చినట్లు వివరించటం - ఎంతో హృదయంగమంగా వుంది.

పోయిరా మా యమ్మ పోయిరా వమ్మా
పోయి నీ అత్తింట బుద్ధి గలిగుండు
ఎవ్వరేమన్నాను ఎదురాడకమ్మ

పీఠిలో నిలుచుండి కురులిప్పకమ్మా
పరమాత్మ నెల్లపుడు ధ్యానింపవమ్మ
పెద్దలా గుర్తించి ప్రేమతో మెలగు
ఆకలిగ నున్నదని ఆడుగవద్దమ్మ
నీ తోడిదే నమ్మ వంశగౌరవము
నన్ను రచ్చకు తేకు నా కన్నతల్లీ"

కురువేరు మనతోట చాల గలిగుంది
కోరితే కురువేరు నేనంపగలను
పన్నీటి బిందెలు పెట్టి పంపేను
పాడియావుల మంద పాల కంపేను
వాకిట నుండేటి గొల్ల నంపేను
అత్తవారి మంచి వేములో తీపి
కత్తిమీద సాము కద్దపే చెలియ
ఎన్నియాడిన మనసు చిన్నబోరాదు.

కుమార్తె యే విషయంలో నయినా చిన్నబుచ్చుకోవటం తల్లికి యిష్టం లేదు. అందుకే తన బిడ్డకు యిష్టమయిన వస్తువులన్నీ అవసరమయితే పుట్టింటి

నుంచే పంపిస్తానంటూంది. పెద్దలను గౌరవించవలసిన విధిమొదలు దైనందిన జీవితంలో కుమార్తె అనుసరించవలసిన పద్ధతుల వరకూ వివరంగా చెప్పిన ఆ తల్లి చిట్టచివరకు యిన్ని చేసినా అత్తవారి నుంచి మంచిమాటను ఆశించటం అత్యాశ అవుతుందని వాపోతూంది. అందుకే వారెన్ని సూటి పోటి మాటలనన్నా మనసు చిన్నబుచ్చుకోవద్దని కూతురికి ముందే నచ్చజెప్పుతూంది. ఈ పాటలో అత్తింటి కాపురం శ్రీకి అగ్నిప్రవేశ సహనంగా తోస్తూంది. ఈ వ్యవస్థలో ఆ విషయంలో మాత్రం నాటికీ-నేటికీ పెద్దమార్పేమీ వున్నట్లు తోచటంలేదు-ఒకటి రెండు ఆపప్రథలు తప్ప.

వియ్యపురాలి చేతిలో తన బిడ్డ చేయివుంచి అప్పగిస్తూ చెప్పే యీ మాట లలో తల్లి మనసు సుస్పష్టంగా కనిపిస్తుంది.

బొమ్మరిండ్లను యాడు బుద్ధెరుగదమ్మా
మెల్లగా నేర్పుతో పని నేర్పవమ్మా
ఆకలెరిగి అన్నంబు పెట్టినదాక
అడుగనేరదు నీవు అడిగి పెట్టమ్మా
కోడలూ మీసొమ్ము కొడుకు మీసొమ్ము

సీతాదేవిని కౌసల్యకు అప్పగించే సన్నివేశం కూడా యిలాంటిదే! ఈ పాటలను ఆయాసందర్భాలలో పాడుతుండగా - ప్రతి తల్లిదండ్రులకూ- తమ కుమార్తెలను అత్తవారింటికి పంపేనాటి దుఃఖభారం గుర్తు రాక మానదు ఈ పాటలన్నింటిలోనూ యీ వేడుకలన్నీ సీతారాముల వివాహమహోత్సవ రూపకం గానో రుక్మిణీ కృష్ణుల పెళ్ళివేడుకలుగానో వర్ణించబడ్డాయి. అమ్మాయి రుక్మిణి, అబ్బాయి కృష్ణుడు. అంటే యీ నిత్యజీవితంపై యీ పురాణ పాత్రల ప్రభావం యింత చక్కటి ముద్రవేసిందన్నమాట.

తెలుగువారిలో లాగే రాష్ట్రేతర విదేశీ సంప్రదాయాలలోను పెళ్ళివేడుకలు కొన్ని యిలాగే వున్నాయనే చెప్పవచ్చు. ఉదాహరణకు - ఆంధ్రరాష్ట్రానికి యిరుగు పొరుగునవున్న కర్ణాటక, తమిళ, మహారాష్ట్ర ప్రాంతాలలో వివాహ సందర్భాలలో పాడే పాటలలో చాలా వరకు సామ్యాలు కనిపిస్తాయి.

ముఖ్యంగా ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు యీ విషయంలో అనేక పోలికలు గుర్తించవచ్చు. రెండు రాష్ట్రాల వివాహ సంప్రదాయాలకు అతిసన్నిహిత సంబంధాలు వున్నట్టు స్త్రీలపాటలద్వారా తెలుస్తుంది. పెళ్ళిచూపులు, పెళ్ళికూతురిని చేయటం, పెళ్లికొడుకును చేయటం మొదలయిన వేడుకలన్నీ ఒకలాగే వున్నాయి.

ముందురోజుల్లో మగపెళ్లివారే- అమ్మాయిని అడిగేందుకు వచ్చేవారట! వచ్చిన వారికి మర్యాద చేసిన తరువాత వారి రాకకు కారణమేమిటని ప్రశ్నించే యీపాట చూడండి.

'హెణ్ణిగోగువాగ, హణ్ణినందల బందొ
హన్నెరడు కుదురె బిగనూరు నైవాని
బందరు బీగార, అరమనెగె
బంద బీగరిగె, జంబుకానె వాసి
గంధవీళ్యద సడువింసి కేళారల్లె
నీవు బంద కారణద బగెయేను'—

నలుగు పాటలు కన్నడంలోనూ వున్నాయి. అలాంటి పాట ఒకటి యిప్పుడు ఉదహరిస్తున్నాను.

"హత్తు కొంబరసిన కుట్టి బట్టల్తుంచి
మాళిగిముందె మణె హకి మీద నీరు
అందల దాటి హేశెదాట
సముద్రద బాశె ఓలాది బెశెదావొ
ఆరుకొంబరిసిన తేదు బట్టల్తుంచి
మాళిగె ముందె మణెహాళి మీదనీరు
ఒత్తెణ్ణెపురికె హరిదావు
చప్పరదట్టేలి ఒప్పకొలెయ నూడి
కప్పురదనేదె దిలెగిక్కి-కాదానీరు
భూమండల నాళొమగనిగె"—

తెలుగులో లాగే బువ్వంబంతి పాటలు కర్ణాటకలోనూ యెక్కువే. పెళ్ళి సందర్భాలలో అందరి విమర్శలకూ గురయ్యేది వియ్యపురాలే. ఆమె తినే తిండి చూస్తే తాటకి, శూర్పణఖలు గుర్తుకు వస్తారట!

తాటక్కి శూర్పన క్కి యంథ వళు
హత్తుకై మరిగ్యన్న ఒట్టాగి ఉండళు
ఊట క్కెబీగ త్తి ఒందవళు'—

పెళ్ళికొడుకును యెగతాళి చేసే పాటలలో సున్నిత హాస్యం నుంచి మోటు హాస్యం వైపుకి మళ్ళే పాటలు కొన్ని వున్నాయి. పెళ్ళికొడుకును ఏమీ తెలియని మూర్ఖునిలా చిత్రించే యీ పాటలు కేవలం యిరుపక్షాల వారి మధ్యా ఒక విధమైన సన్నిహితత్వాన్ని కల్పించేందుకు వుద్దేశింపబడినవే కానీ – యీ పాటలను అపార్థం చేసుకొని యెవరికి వారు భీష్మించుకుని కూర్చునేలా వుండేందుకు కాదు.

ఇక మహారాష్ట్రలోని కొన్ని పెళ్ళిపాటలను పరికిద్దాం. వరకట్న రూపంగా పెద్ద యెత్తున మొత్తం చెల్లించటమే కాక, సంప్రదాయ రీతిలో అందివ్వవలసిన అనేక వస్తువులను అబ్బాయికి ముట్ట జెప్పుతారు – అమ్మాయి తరపువాళ్ళు. కానీ యింకా తృప్తిలేదు వియ్యంకులకు. యీ క్రింది పాటలో ఒక వృద్ధ స్త్రీ మంచిబట్టలు, గోవులు, భూమి, వంటి వాటిని కూడా అడగవల సిందిగా పెళ్ళి కుమారునితో చెబుతూంది.

కోన్ గావ్ పరతాల్ జాసీరే మన్హా మానిక్‌లాల్
కాయ్ కా ఆందన్ మాంగ్ సీ రే మాన్హా మానిక్‌లాల్
హండా ఏక్ గుండా ఏక్ పరాత్ జమీన్ మాంగ్‌సిరే
మన్హా మానిక్‌లాల్
పలంగ్ ఏక్, పాసోడా యేక్ గాయ్ ఆందన్‌మాంగ్ సీరే
మన్హా మానిక్‌లాల్

శ్రమ లేకుండా అందే యీ వస్తువులను పెళ్ళికొడుకు యెలా కాదంటాడు. దానికై ఒక్కమారు పెళ్ళిలో అలిగితే చాలు మరి! అందుకే తప్పక అడుగుతా నంటాడు.

ఇలా అన్ని చోట్లా వివాహసందర్భంగా పాడుకునే పాటలు కోకొల్లలు.

2) మాతృత్వం ఒక వరం

వివాహం తరువాత స్త్రీ తల్లి అయ్యే అదృష్టంకోసం యెదురు చూస్తుంది. ఏ దేశపు స్త్రీ కయినా మాతృత్వ మనేది ఒక తియ్యని అనుభూతి. సంతానం లేకపోతే - ఆ స్త్రీకి సంఘంలో గౌరవముండదు. ఆమె జీవించటమే నిరర్థకంగా భావించబడుతుంది.

"కొత్త చింతపండు గోనెల్ల చీకు
గొడ్రాలి వస్త్రాలు పెట్టెల్ల చీకు
పాత చింతాపండు వస్త్రాల చివుకు
బాలెంత వస్త్రాలు పసుపుల్ల చివుకు
కొడుకుల్ల గననివాళ్ళ కడుపేమి కడుపు!
కులముద్ధరించని కొడుకేమి కొడుకు
పిడికెడు వి త్తనాలు మడికెల్ల జాలు
వక్కడే కొడుకైన వంశాన జాలు'—

గొడ్రాలు పిల్లలను తాకితే వారికి ఆయుర్దాయం క్షీణిస్తుందట. అందుకని ఆమె పసిపిల్లలవంక కన్నెత్తి చూస్తేనే పాపమన్నట్టు ప్రవర్తిస్తారు - యిరుగు పొరుగు వాళ్లు. అటువంటి స్త్రీ మానసిక వ్యథ యెలా వుంటుందో వర్ణించటం - ఒక్క జానపదులకే సాధ్యమేమో!

"పసుపు కుంకుమలకు పోలేను నేను
పసిబిడ్డలను నేను యెత్తుకోలేను
యిల్లు కలకలాడ చూడంగలేను
ఒక్క బిడ్డనైన ముద్దాడలేను
గొడ్రాలి బతుకయ్యె గౌరవం లేదయ్యె'—

కన్నడంలో యీ గొడ్రాలి జీవితాన్ని యింకా దయనీయంగా వర్ణించారు. బాడుగకు తీసుకొన్న యెద్దులాంటిదట, ఆమె జీవితం-తినిపారవే సే అరటి ఆకుతో సంతానం లేని స్త్రీని పోలుస్తారు. అందుకే తల్లి కావటానికి ప్రతి స్త్రీ తపించి పోతుంది. యీ ఆవేదన దేశకాలాతీతమయింది.

పిగ్మీజాతికి చెందిన ఒక స్త్రీ తనకు మాతృత్వానుభూతిని ప్రసాదించమని వనదేవతను ప్రార్థిస్తూంది.

Give me pregnancy, O, Mbato
Give me pregnancy, that, I way bear a child-

తనకేకాక తనవంటి యితర స్త్రీలకు సంతానాన్ని ప్రసాదించమని కోరే సహృదయం జానపదులది. యీక్రింది కన్నడ గేయంలో ఒకస్త్రీ తన నెచ్చెలి సంతానం కోసం పడే బాధ చూడలేక ఆమెకు మాతృత్వాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తూంది.

కూడల సంగయ్య నీదు మక్కళ ననగ
ననగల్ల నన్న గెళతీగ కొట్టారె
బాగిలక హోన్న బడినేన

(కూడల సంగయ్య యివ్వు బిడ్డల నాకు
నాకొద్దు నాదు సఖికివ్వు : యి స్తేను
వాకిలికి హోన్ను వేనేను)

ఆస్ట్రేలియాలో ఆదిమ వాసుల జాతికి చెందిన యీ అవ్వ మరింత ముందుకువెళ్ళి ప్రపంచంలోని వంధ్యస్త్రీలందరికీ మాతృత్వ సౌభాగ్యాన్ని ప్రసాదించమని భగవంతుని ప్రార్థిస్తోంది చూడండి.

Give to my baby, and give to her baby
Give to him baby, and give to one, baby
Give to all baby.

సంతానం పొందేందుకై స్త్రీలు పడరాని పాట్లు పడతారు. వ్రతాలూ, నోములూ, తీర్థయాత్రలూ ఒకటేమిటి ఆన్నీనూ.

సింహాద్రి అప్పన్న గుళ్లముందార
పట్టారు గొడ్రాళ్లు ప్రాణాచారాలు
ఎందుకు పట్టారు ఏల పట్టారు
కొడుకుల యియ్యమని కోరి పట్టారు
సంతు లియ్యమని చాల పట్టారు
బిడ్డల నియ్యమని పట్టుపట్టారు

ఇంత కష్టపడీ సింహాద్రి అప్పన్న దగ్గర ప్రాణాచారం పడినవారికి కేవలం నోము నోచితే చాలదు, దానికి తగ్గట్టు భగవంతుడికి లంచమూ సమర్పించు కోవాలట!

సింహాద్రి అప్పనకు లంచాలు యేమి
గుడి తిరుగు వస్త్రాలు గుమ్మడీ పండ్లు
దాగళ్ళ వడపప్పు దండి బెల్లాలు

యింత కష్టపడీ వ్రతం చేస్తున్న యిల్లాలికి, ఆమె కోరిన ఫలాన్ని సింహాద్రి అప్పన్న యివ్వక పోతాడా?

సంతానం లేనివారిని చూచి పాపం జానపదులకు జాలివేసింది కాబోలు పిల్లల్ని పొందేందుకై కొన్ని ఉపాయాలను కూడా తెలియబరుస్తున్నారు చూడండి.

బిడ్డలులేరంటే గొడ్రాలనీకు ఆడితివి అంతరేజు గంగ తానాలు
ఆడిన లేరమ్మ అన్నెకారులకు - పాడినా లేరమ్మ పాపకారులకు
బిడ్డలు లేరంటే గొడ్రాల నీకు - యీశ్వరుని గుళ్ళకు యిటుకలా మోనేవు
రామయ్య గుళ్ళకు రాళ్ళు మోనేవు రావియ్య చెట్టుకు ప్రదక్షిణాలు చేనేవు.

— సంతానం కలగనందుకు జానపదులు చెప్పిన కారణాలు గమనిస్తే- వారి పాపభీతి, స్వచ్ఛమైన జీవన విధానము పట్ల ప్రేమలు విస్పష్టమవుతాయి. పూర్వజన్మలో పాపం చేసిన వారికి, పిల్లలు పుట్టే భాగ్యం లేదట! ఆ పాపం యెంతటిదంటే అంతర్వేదిలో మునకలు వేసినా - ఫలితం లేనంతటిది! అంటే స్త్రీ జీవితానికి పరమార్థమయిన మాతృత్వానుభూతి - పాపరహితులయిన వారికే ప్రాప్తిస్తుందన్నమాట! 'గొడ్రాలు' అని పదిమంది చేత వేలెత్తి చూపించుకొనే దురదృష్టాన్ని కొనితెచ్చుకోవడం అంటే - పాపాలు చేయకుండా చూచుకోవటం సులభం గదా! అలాంటి గొడ్రాలి జీవితాన్ననుభవిస్తున్న ఒకానొక యిల్లాలు - యీశ్వరుని గుళ్ళకు యిటుకలు మోస్తూందట! రామని దేవాలయానికి రాళ్ళు మోస్తూందట! యింకా రావిచెట్టుకు ప్రదక్షిణలు సరేసరి! యింత చేసినా ఫలితం వుంటుందా అంటే మరి అది వారి వారి వ్యక్తిగత సామర్థ్యము. అంతే! ఆమెనుచూచి జానపదులు జాలిపడుతున్నారు. అసలు

పాపమన్నదే చేయకుంటే యీ పాట్లు తప్పవి గదా! అన్నది అంతర్లీనమైన తాత్పర్యం.

సంతానం పొందాలంటే - ఎంతో పవిత్రంగా జీవితం గడపాలన్నది జానపదుల గట్టి నమ్మకంగా యీ పాటద్వారా తెలుస్తోంది. కానీ అటువంటి నియమనిష్ఠలేమీ పాటించని ఒక స్త్రీ సంతానం కోసం భగవంతుని ప్రార్థిస్తే - బిడ్డలు కలగటానికి నీకు గల ఆర్హతలేమిటని అతడు ప్రశ్నించాడు. ఆమె సమాధానా లిలా వున్నాయి.

సామి నాకు సంతానం దయ నేయరాదా "సామి"

పాడుండే పదిమంది కో స్తరంట జనులు
ఓసి నువు పోసినవ లేదే?

పాడుండే పదిమంది కోయలేదుసామి
తలుపేసికొని యింట్ల దాగున్నసామి "సామి"

ఓసి నీకు సంతాన మిక యాడ గలదే
గూట్లో దీపం బెట్టి మొక్కేరు జనులు
ఓసి నీవు మొక్కినవ లేదే?

గూట్లో దీపంబెట్టి మొక్కలేదు సామి
నేతులు నొ త్తాయని వూకున్న సామి ॥సామి॥

ఓసి నీకు సంతాన మిక యాడ గలదే
వాడలో బాలలు ఆడుచుండంగ
ఎలవెట్టి పండ్లుగొని యిచ్చేరు జనులు
ఓసి నువు యిచ్చినవలేదే

ఎలవెట్టి పండ్లుగొని యియ్యలేదు సామి
కోలకట్టెలతోటి కొట్టినా సామి
ఓసి నీకు సంతాన మిక యాడ గలదే ॥సామి॥

భగవంతు డడిగిన ప్రశ్నలన్నింటికీ 'లేదు లేదనే' సమాధానం చెప్పిన యిటువంటి యిల్లాలికి యీ సంతాన భాగ్యం యెలా కలుగుతుంది! మనసు గల్గిన యే

మనిషయినా చేసే సామాన్యమయిన పనులను సైతం చేయని యీవిడ సంతానాన్ని కోరి భగవంతుని ఆశ్రయించటం. అత్యాశకాక మరేమిటి? యింతకూ పాటలో చెప్పినటువంటి యిల్లాళ్ళు వుంటారో వుండరో అన్నది అనవసరం. ఆమెలా వుండకూడదన్నది మాత్రమే యీ పాటలోని సారాంశం.

ఎదురు చూచిన శుభఘడియ రానేవచ్చింది. ఆడజన్మను సార్థకం చేసే మాతృత్వపు తియ్యని అనుభవాన్ని పొందబోతున్నానన్న ఆనందం ఒకవైపు, ఒకచోట నిలువనీయక వుక్కిరి బిక్కిరి చేస్తుండగా; దినదినానికీ మారుతున్న దేహపరిస్థితికి తోడు వింతవింత కోరికలూ, రుచులూ, స్త్రీసహజమయిన సిగ్గును విడనాడేలా చేసి పదిమందికీ యీ రహస్యం తెలిసి దొరికి పోయేలా బయటపడుతున్నయ్. నవమాసాలూ బిడ్డని మోసే తల్లికి యే నెలలో యెటువంటి రుచులపట్ల కోరిక యేర్పడుతుందో యీ పాటలో చెప్పబడింది.

ఒక్కోమాసం నెలతన గర్భిణి
ఓనగాయగోరే
చెలియా ఓనగాయగోరే

రెండోమాసం నెలతన గర్భిణి
రేగుబండ్లు కోరే
చెలియా రేగుబండ్లు కోరే

మూడోమాసం నెలతన గర్భిణి
ములకపండ్లుగోరే
చెలియా ములకపండ్లుగోరే

నాల్గోమాసం నెలతన గర్భిణి
నారికేళ గోరే
చెలియా నారికేళ గోరే

అయిదో మాసం నెలతన గర్భిణి
అరటిపండ్లు గోరే
చెలియా అరటిపండ్లు గోరే

ఆరో మాసం నెలతన గర్భిణి
ఆవుపాలు గోరే
చెలియా ఆవుపాలు గోరే

ఏడోమాసం నెలతన గర్భిణి
యెన్న ముద్ద గోరే
చెలియా యెన్నముద్ద గోరే

ఎనిమిదో మాసం నెలతన గర్భిణి
వెలగపండ్లు గోరే
చెలియా వెలగపండ్లు గోరే

తొమ్మిదోమాసం నెలతన గర్భిణి
వెలగపండ్లు గోరే
చెలియా వెలగపండ్లు గోరే

పదియవ మాసం నెలతన గర్భిణి
పాపడు జన్మించే
చెలియా పాపడు జన్మించే

పాపడు జన్మించాలంటే ఆది అంత సులభమా? 'కాన్పు' అన్నది యితరుల దృష్టిలో అతి సామాన్యమయినదే అయినా అది పరిత్యేకించి స్త్రీకి మరుజన్మ అనే చెప్పవచ్చు. అంతటి గండాన్ని గడిచి బయటపడిన ఆ తల్లి పొత్తిళ్లలో పడుకున్న కన్నబిడ్డను చూడగానే తాను ముందు అనుభవించిన బాధనంతా ఒక్కమారు మరిచిపోతుంది. పాపడిని ఆప్యాయంగా కంటి చూపులోనే ఒళ్లంతా తడిమి తడిమి చూచుకున్న ఆ మొట్టమొదటి క్షణాన్ని జీవితకాలమంతా పదిలంగా జ్ఞాపకం వుంచుకుంటుంది పరితి తల్లీ. స్త్రీకి కాన్పు సులభంగా అవటం అటు ఆ గృహిణికీ యిటు యింటివారికీ కూడా ఆనందదాయకమే. అందుకే ఆ 'పురుటి వార్తను' ఆహ్లాదకరంగా యింటింటికీ చాటుతారట! జానపదుల ఆనందం అవధులు దాటి పాటగా రూపొందింది.

పుణ్యశాలి చెల్లెలు తుమ్మితీలో
పురుడని చాటండి తుమ్మితీలో

యింటికీ కడివెడు తుమ్మితీలో
నీళ్లనీ చాటండి తుమ్మితీలో
గడపకీ కడివెడు తుమ్మితీలో
పసుపనీ చాటండి తుమ్మితీలో
ఉల్లితోటలు దాటి తుమ్మితీలో
ఊళ్లన్నీ దాటేరు తుమ్మితీలో
కాకులు దూరని తుమ్మితీలో
కారడవి దాటేరు తుమ్మితీలో
అరటి తోటలు దాటి తుమ్మితీలో
అందరీ పట్నాలు తుమ్మితీలో
పెద్దలూ కోరని తుమ్మితీలో
పెద్దడవి దాటారు తుమ్మితీలో
గుజ్జుగా పెరిగిన తుమ్మితీలో
గురివెందలు దాటిరీ తుమ్మితీలో
పక్కనే తురుమేసి తుమ్మితీలో
పట్నమే చాటిరీ తుమ్మితీలో

పట్టుమని పది యిండ్లయినా లేని పల్లెటూళ్ళు వుంటయి. కొంచెం పెద్ద పల్లెలనుకుంటే దాదాపు యాభై నుంచి నూరు కుటుంబాలదాకా వుంటాయను కోవచ్చు. మరి అటువంటి చోట యెవరియింట్లో యే విశేషం జరిగినా అది అందరికీ తెలిసిపోతుంది. ఒకరి యింట్లో పండగయితే అది అందరి పండగా అవుతుంది. యిక ఒకయింట్లో పురుడయితే మరోయింటికి తెలియకపోవటం అంటూ వుండదు. తమకే అవసరంవచ్చినా యిరుగు పొరుగులవారి సహాయాన్ని అర్థించడం పల్లెలలోని ఆనవాయితీ. బాలింతవున్న యింటిలో పనికి కొదవుండదు. అటు తల్లినూ యిటు పిల్లనూ ఆతి జాగ్రత్తగా చూచుకోవాలి. అందుకే ప్రత్యేకంగా బాలింతతనం చేయటానికి అనుభవజ్ఞులయిన పెద్దవారి సహాయం అత్యంత అవసరం. మరి బాలింత కోసం తీసుకోవలసిన జాగ్రత్త లేవి?

మా యింటి పురిటాలూ
ఏమీ కోరిందీ
కుక్కీ మంచమూ
గూనా కుంపాటీ ॥మా॥

తొలుచూలు కొడుకూనీ
కానా గోరింది ॥మా॥

ఎర్రని తాంబూలం
కాటుక కోరిందీ ॥మా॥

చక్కానీ పిప్పాలీ
ఖారం కోరిందీ ॥మా॥

ఉల్లీ ఖారమ్మూ
శొంఠీ కోరిందీ ॥మా॥

చక్కనీ సలువాలూ
కట్టా కోరిందీ ॥మా॥

ఏటా చూలింతా
బాలింత కోరిందీ ॥మా॥

స్త్రీకి తాను గర్భవతి నన్న విషయం తెలిసినప్పటి నుంచీ ఒకటే ఆతృత. తన గర్భంలో వున్నది మగశిశువా ! ఆడశిశువా అన్నదే ఆ ఆతృతకు కారణం. ఒక్కొనెల గడుస్తున్నకొద్దీ. శరీరంలో వస్తున్న మార్పులు, వాటికితోడు బిడ్డ కదలికలు తెలిసేనాటి అనుభూతులు - స్త్రీకి ఎంతో అపురూపంగా తోస్తాయి. చాలా వరకు మనదేశంలో గర్భవతిగా వున్న ప్రతిస్త్రీ తాను మగబిడ్డ తల్లిని కావాలనే కోరుకుంటుంది. కారణం ఆడపిల్ల పుడితే ఆ అమ్మాయిని పెంచటం మొదలు వివాహం చేసి అత్తవారింటికి పంపేంతవరకూ ఆ తల్లిదండ్రులు యెంతో జాగ్రత్తగా మెలగవలసి వస్తుంది.

ఆడపిల్లంటే మాటలా ! పుట్టిన క్షణం నుంచి పెరిగి పెద్దయ్యేంత వరకూ యెంత బాధ్యత ? యెంత బరువు ? అమ్మాయి గొన్న స్థాయినుంచి పరికిణీ కట్టేంత

దయ్యాలోగా యెన్ని మచ్చటలు! పరికిణీనుంచి వోణీల స్థాయికి యెదిగే నాటికి యెన్ని జాగ్రత్తలు! వోణీల నుంచి చీరల్లోకి మారేవేళకు పెళ్లిసంబంధాల వేట ప్రారంభం! సరైన సంబంధం గుదిరి పెళ్లి ముగిసే నాటికయ్యే ఖర్చులు తలకు కుంచె గుండె చెరువవుతుంది. యింత చేసినా యెంతో ప్రేమతో పెంచి పెద్దచేసిన అమ్మాయి యెవరింటికో వెళ్లవలసిందేగదా! చివరికి కడుపుకోత మిగులుతుంది తల్లిదండ్రులకు! ఆబ్బాయే పుడితే యిక కష్టాల మాటెక్కడిది! ఎలా పెరిగినా యేంచేసినా ఆడిగేవారేవుండరు. అందుకే మన దేశ ఆర్థిక పరిస్థితిని, ఆచార వ్యవహారాలనూ బట్టి స్త్రీ సంతానం కంటే పురుష సంతానాన్ని పొందడమే గొప్ప అదృష్టంగా భావిస్తారు. యీపాట చూడండి.

"ఆముదాలు పండిన చేను చూడండి
ఆడవార్ని గన్న తల్లి నరసి చూడండి
మోదుగు పూసిన బీడు చూడండి
మొగవార్ని గన్నతల్లి మోజు చూడండి
ఆడవార్ని కన్నావు అమ్ముకున్నావు
మొగవార్ని కన్నావు మొక్కుకున్నావు" -

కానీ ఒక విధంగా ఆలోచిస్తే నవమాసాలూ మోసి కనే తల్లికి ఆడపిల్ల యినా, మగబిడ్డయినా ఆప్యాయతా అనురాగాలలో తేడా వుండదు. పుట్టేది యెవరయినా వారిలో తన రక్తమే ప్రవహిస్తోందన్న నగ్న సత్యాన్ని కాదనలేరు గదా! అందుకే ఆ తల్లి తన సంతానాన్ని ఒకే దృష్టితో చూస్తుంది గానీ, ఆ దృష్టిలో తారతమ్యం వుండదు.

ఏది ఏమయినా - పుట్టబోయేది యెవరయినా వాళ్ళు తన కందించే మాతృత్వపు తీయని అనుభూతిని యే స్త్రీ అయినా వద్దనలేదు. తనను తల్లిని చేసి, గొడ్రాలు అనే అపప్రథ నుంచి తప్పించే తన సంతానాన్ని యెటువంటి క్లిష్ట పరిస్థితులనయినా యెదుర్కొని పెంచుకుంటుంది - ఆ తల్లి. తల్లీ బిడ్డల ఆనుబంధం యుగయుగాలకూ వన్నెచెదరు. వాసి వీడదు. అందుకే ఆ అనుభూతి ప్రతి స్త్రీ కావాలనుకుంటుంది. ఆ మాతృత్వపు అనుభవం తల్లికొక వరం.

లాలిపాటలు :-

స్త్రీ సంతానవతి అయిన మరుక్షణం నుంచే తన బిడ్డడి లాలనలో, వారిని గురించిన శ్రద్ధలో లోకాన్నే మరిచిపోతుంది. నవమాసాలూ మోసి కన్నతల్లికి -

తన సంతానమే సర్వస్వంగా కనిపిస్తుంది. పాపాయికి స్నానం చేయించడం, బట్టలు వేయటం, కడుపునిండా పాలుపట్టి నిదుర బుచ్చడం, యీ పనులలోని ఆనం దాన్ని మహద్భాగ్యంగా భావించడం - ఒక్క తల్లికే సాధ్యం. తన పాపని కళ్ళలో కన్నీటి చుక్క కనిపిస్తే చాలు, విలవిలలాడిపోతుంది - ఆ తల్లి మనసు. మరుక్షణం - కమ్మటి పాట పాడి - పాపాయి కన్నీళ్ళు తుడుచి నవ్విస్తుంది.

"హాయి హాయీ హాయి ఆపదలు గాయీ
చిన్నవాళ్ళను గాయి శ్రీరంగశాయీ
ఏడువకు ఏడువకు చిన్న నా తండ్రి
యేడిస్తె నీ కళ్ళ నీలాలు గారూ
నీలాలు గారితే నే చూడలేనూ
పాలైన గారవే బంగారుకండ్లు"

ఆ యేడుపు మాన్పించేందుకు యెన్ని లంచాలివ్వటానికయినా ఆ తల్లి సిద్ధపడుతుంది.

"హాయీకి పెట్టరే వెదరరటిపండ్లు
పాపడికి పెట్టరే పాలమీగడలు
ఏడ్చేటి వారికీ యెర్రావు పాలూ
ఊరుకున్న వారికీ వుట్టిమీది వెన్నా" -

యింత చెప్పినా యేడుపుమానని పాపాయిని పూరడించేందుకు కొత్త వుపాయం కనిపెట్టిందా తల్లి ! పిల్లడిని "యింద్రుడు-చంద్రుడ"ని పొగిడితే నయినా శాంతిస్తాడేమో ! ఆందులోనూ ఆ తల్లికి ఆత్మతృప్తి వుంది మరి ! నిజమే తన సంతానం తన కంటికి యింపుగా కనిపించదూ !

"పాపాయి కన్నుల్లు కలువరేకుల్లు
పాపాయి జులపాలు పట్టుకుచ్చుల్లు
పాపాయి దంతాలు మంచి ముత్యాలూ
పాపాయి పలుకుల్లు పంచదార చిలుకుల్లూ
పాపాయి చిన్నెలు బాలకృష్ణ వన్నె" -

అబ్బాయిని కన్నతల్లుల సంగతిలా వుందా ! మరి ఆడపిల్లను కన్నతల్లి తక్కువ తిన్నదా ! తన కుమార్తెను అనేక విధాల వర్ణించి మురిసిపోనిదే ఆమెకు నిద్ర పట్టదాయె !

"చిక్కుడూ పూవెరుపు చిలుక ముక్కెరుపూ
చిగురెరుపు చింతల్ల దోర పండెరుపు
రక్కస పండెరుపు రాగి చెంబెరుపు
రాచవారిళ్లలో మాణిక్య మెరుపు
తా యెరుపు అమ్మాయి తన వారిలోన"

ఈపాటలో ఉదహరించిన వాటిలో చిక్కుడు పువ్వు తప్ప తక్కిన వస్తు యెర్రనయినవే. కానీ అమ్మాయికి జోలపాడి హడావిడిలో వున్న ఆ ఆ తల్లికి పాటలో ప్రాసకుదుర్చుకోవాలన్న ఆరాటం వ్యక్తమవుతూనే వుంది. అందుకే చిక్కుడుపువ్వు రంగును గూడా మార్చివేసిందామె ! నిజమే ! మాతృ హృదయానికి అసాధ్యమయిన విషయమేముంటుంది గనుక !

ఆటువంటి అపురూపమయిన అమ్మాయి యేడిస్తే యిక ఆ తల్లి మనసు ఆగుతుందా ! అమ్మాయిని సముదాయించాలంటే పాటను ఆశ్రయించక తప్పదు గదా ! నిజము మరి ! తన కన్నబిడ్డ నవ్వినా పాటే, ఏడ్చినా పాటే కన్నతల్లికి.

"అమ్మణ్ణి కన్నుల్లు తమ్మి పువ్వుల్లు
తమ్మి పువ్వులలోన కమ్మతేనియలు
చిన్నారి కళ్లలో కన్నీటిజల్లు
కన్నీరు చూపకే కరుగు నెడదల్లు
చక్కటీ నా తల్లి గుక్కపట్టిందీ
చెక్కుటద్దాలలో చెదిరెనే సంజ
చల్లనీ గాలి మా చంటి పాపాయి
వొళ్ళార్చి శ్రమదీర్చవోయి రవ్వంత
కిలకిలా నవ్వితే కలువల్లు పూసె
కలువ పువ్వులేము కలికి చూపుల్లు"-

మరికొన్ని లాలిపాటల్లో స్త్రీకి తన కన్నవారి యింటిపట్ల వుండే ఆప్యాయ తానుబంధాలు వ్యక్తమవుతాయి. సోదరుడంటే ఆమెకు వల్లమాలిన అభిమానం. అన్నతో చెల్లెలు మనసు విప్పి తన బాధలన్నీ చెప్పుకుంటుంది. ఆమె దృష్టిలో అబ్బాయి మేనమామలు "కందికాయలవంటి కనుబొమలవారు, మిరపకాయల వంటి మీసాలవారు"-ఆటువంటి గంభీరవిగ్రహం గలిగిన వారయినా ఆ మేనమా మలు వెన్నవంటి మనసుగలవారు. దానికి తోడు ఆ అన్నలకు తనపై కొండంత అభిమానమూ వుంది. అందుకే తన చిన్ని కుమారుడు వారి భుజాలపై యెక్కి-కూర్చునే అధికారాన్ని కలిగి వున్నాడని చెప్పి మురిసిపోతుందామె.

"చిలుకల్లు చెలరేగి జీడి కొమ్మెగురూ
హంసల్లు చెలరేగి అరటి చెట్టెగురూ
మా బాబు చెలరేగి మామభుజ మెగురూ"-

తన సంతానానికి కొండంత అండగా తన పుట్టింటి వారున్నారన్న వూహే. ఆమెకు అమృతంతో సమానం.

భారత, భాగవత, రామాయణాది గ్రంథాలు భారత సంస్కృతికి పట్టు గొమ్మలు. ఒక విధంగా చెప్పాలంటే, అవే భారతీయ సంస్కృతీ సంప్రదాయా లకు ఆధారాలనవచ్చు. రామాయణం యింటింటి గాథ. మరి కృష్ణ కథ ప్రతి మనసునూ స్పందింప జేసే కథ. భారతం సరేసరి. ఈ రెండు కథలూ తెలియని భారతీయులు వుండరంటే, అది అతిశయోక్తి కాదు. మహిళల విషయమూ అంతే. అందుకే యీదేశంలో పిల్లలబాల్యం భారత భాగవత రామాయణాదుల్లోని పిట్ట కథలకు వూకొట్టడం లోనే ప్రారంభమవుతుంది. ఆ అమాయక హృదయ దర్ప ణాల్లో శ్రీరాముడు, చిన్నికృష్ణుడు, వీరి ముగ్ధమనోహర రూపాలు హత్తుకొని పోతాయి. అంతేకాదు. ప్రతి తల్లీ తన కుమారుని శ్రీరామచంద్రునిగానో, చిన్ని కృష్ణుని చిలిపి రూపంగానో వూహించుకొని మురిసిపోతుంది. తన కుమారుడంతటి వాడు కావాలని ఆరాటపడుతుంది. తన యీకోరికకు అబ్బాయి చిన్నతనంనుంచే ప్రాతిపదిక వేస్తుంది. ప్రతిఫలం అబ్బాయి జోలపాటలకాలం నుంచే శ్రీరాముని రూపం దాలుస్తాడు.

జో అచ్యుతానంత జోజో ముకుందా
రార పరమానంద రామ గోవింద

ఆని పాడటంలోని ఆనందానుభూతి తల్లికే తెలియాలి.

రామ నుగుణధామ శ్రీరామ లాలి నిర్జీత శ్యామా
నా తనయా నా ముద్దులతండ్రి నా నోముపంట
జాతర నేయక నిదురపోరా జయజయ సుకుమారా ॥
నా తనయ జయజయ సుకుమారా ॥

చూడుము వృక్షాగ్రముపై కోయిల ఆడుచు వున్నదిరా
నా తనయ పాడుచు వున్నదిరా
అదిగో చూడుము ఆకాశములో ఎగురుచు వున్నదిరా
ఏడ్చుచుండిన బూచివాడు నిన్నెత్తుకపోవును నా తనయ
ఎత్తుకుని పోవునుగా జాతర నేయక నిదుర పోరా ॥

భగవదవతారమయిన శ్రీ రామచంద్రునితో తన బిడ్డను పోలుస్తున్నా-అబ్బాయి మొండి పట్టును సడలించేందుకు బూచివాని భయంపెట్టి పడుకో బెట్టేందుకు చూచే ఈ తల్లి మనసులో స్త్రీ సహజమయిన భావాలు కనిపిస్తాయి.

"లాలనుచు పాడరమ్మా యీ బిడ్డ
లక్ష్మీవిలాసుడమ్మా
పాదమున చక్రమమ్మ యీబిడ్డ
వేదాంత వేద్యుడమ్మా"-

అంటూ తన బిడ్డడిలో భగవంతుని రూపం చూచుకొని మురిసిపోతుంది. శ్రీకృష్ణుని బాలక్రీడలను వర్ణిస్తూ పాడే లాలిపాటల్లో ఒక విధమైన తాదాత్మ్యత కనిపిస్తుంది.

"శ్రీపతి కృష్ణమ్మ రేపల్లెలోనా
పాపడై పెరుగుచూ బహు విధంబుగనూ
అంతకంతకు ముద్దు ఆ యశోదకునూ
వింతవింతలు జూపువేడ్క- ఒకనాడూ
నీలవర్ణుడు పసిడి కోల చేబూని
నీళ్ల కడవాలోన నీళ్లమర జూచె
తన నీడ చూసుకొని తనలోమ నవ్వి
దనుజాంతకుడు బెదరి తల్లి కిట్లనెనూ

ఆమ్మ అదిగో బూచివాడొచ్చెనమ్మా
దిగివచ్చి మన నీళ్ల కడవలో నిలిచె
కొట్టవచ్చిన వెరచి కొని వస్తినమ్మ
కొట్టు బైటికి వెళ్లగొట్టు యశోదా
ముదముతో ముత్యాల తలుపులేమాయ
పదిలముగ బంగారు గడియలే పెట్టు
బూచి ధరియించినా భూషణాలన్నీ
దాచక చెప్పెనూ దామోదరుడూ''

ఎంత తియ్యటి కథ! తన చేతుల్లో పెరుగుతున్న యీ బిడ్డ భగవత్స్వరూపుడని కొన్ని కొన్ని చర్యల వల్ల బయటపడుతున్నా దానిని గుర్తించలేని అమాయకపు తల్లిగా-యశోద - శ్రీకృష్ణుని భగవంతునిగా గుర్తించిన వారికంటే యెక్కువ సన్నిహితత్వాన్ని మాతృత్వానుభూతిని పొందిన ధన్యచరిత!

ఆబ్బాయిలను కన్న తల్లుల విషయమిలా వుంటే ఆడపిల్లను కన్నతల్లి తన కుమార్తె సీతమ్మ అంతటి పరమసాధ్వి కావాలని కోరుకుంటుంది. 'లాలి బంగారుబొమ్మ లాలి సీతమ్మ' అని పాడుతూ నిద్రబుచ్చుకుంది.

భగవత్పరమయిన పాటలేకాక యితర వర్ణనలూ మానవ మనస్తత్వ చిత్రణలూ, పుణ్యక్షేత్రాల వర్ణనలూ వున్న లాలిపాటలు అనేకం వున్నాయి.

''హాయి హాయీ హాయి ఆపదలు గాయీ
చిన్నివాండ్లను గాయి శ్రీరంగశాయీ
వూరి ముందర చేను విత్తకుర అన్నా
వూళ్లోని వియ్యమ్ము చేయకుర అన్నా
వూరి ముందరి చేను ఎలుకల్ల పాలు
వూళ్ళోని వియ్యమ్ము మాటల్ల చేటు''-

యిటువంటి సందేశాత్మక గేయాలూ వున్నాయి.

యిరుగు పొరుగు భాషా సాహిత్యాలలోనూ మాతృమూర్తికి యెంతో ప్రాముఖ్యం వుంది. మరాఠి జానపదగేయాలలో

"నకో కరూ బాల్ మాతా చే హేల్లా
నయనాంచా దివా తలహాతాచా పాల్లా"-

ఈ గేయంలో తల్లిపిల్లల అనుబంధం యెంతో చక్కగా వర్ణింపబడింది. పిల్లలు పెరిగి పెద్దై తమ కాళ్ళపై తాము నిలబడగలిగేంతవరకూ తల్లి యెంతో జాగ్రత్తగా పెంచుతుంది. "రాత్రింబవళ్ళూ నిద్రకాచి, చేతులే పూయలలుగా చేసుకొని - లాలిపాటలు పాడుతూ నీ ఆవసరాలు గమనిస్తూ పెంచిన కన్నతల్లి ఋణం యే నాటికీ తీరేది కాదు. అందుకే ఆమెను ద్వేషించకు. దూషించకు అని హితవు చెప్పబడింది. నిజమే తల్లి ఋణం యేనాటికీ తీర్చుకోలేనిది గదా !

"బాప్పజీ చందన్ ఫీసలీయా వాస్త
ఆయీచా సువాస్త ఆహో ఆహ్
మావుసీ అసాలీ రానీచ్యా పాఖరాన్
చోచీనే ప్యాన్ చారా చరవి తే" -

తండ్రి ప్రేమ చందనమయితే తల్లిప్రేమ స్వచ్ఛందమయిన సువాసనా పూరితమయిన మలయమారుత మట ! ఈ పోలికలోనూ వైవిధ్యముంది. చందనానికి మరొక వస్తువు రాపిడి తాకనినే సువాసన రాదు. మరి మలయమారుత మలా కాదు. వద్దనుకున్నా మనల్ని ఆప్యాయంగా తాకి పలుకరించి వెళుతుంది. ఎంత చక్కటి వుపమానం ! తల్లి అండదండలు సృష్టిలో అన్ని ప్రాణులకూ అవసరమే. ఆడవిలో పెరిగే పక్షిపిల్లకయినా తల్లి ఆహారం తెచ్చి నోటిలో వుంచనిదే పొట్టనిండదు గదా !

యిలా స్త్రీల పాటల్లో తల్లిగా స్త్రీ ప్రాధాన్యతను చాటే పాటలు ప్రముఖంగా వున్నాయి.

వైవాహిక జీవితం :

వివాహం తరువాత స్త్రీకి అత్తవారిల్లే నెలవు. అప్పటినుంచి అప్పగింత లప్పుడు తల్లిదండ్రులు చెప్పిన జాగరూకతలన్నీ అతి జాగ్రత్తగా ఆనుసరించ వలసి వుంటుంది.

ఉదాహరణకు సీతగడియ అన్న యీ పాటలో అత్తింటి కోడలు. అందులోనూ బాధ్యత కలిగిన పెద్ద కోడలి పాత్రను సీత యెంత సమర్థవంతంగా

నిర్వహించింది. అతివాస్తవికంగా వర్ణించబడింది. యింటిపనులన్నీ సరిచూచుకునే టప్పటికి బాగా పొద్దుపోయింది. ఆ తరువాత "అత్త కౌసల్యకు అడుగులువత్తి- మామ దశరథునికి మడతలందించి, సుమిత్ర, కైకకు సురటీలువేసి"- యిన్ని పనుల తరువాత, తన్నుతాను అలంకరించుకొని, పండ్లు, ఫలహారాలు పళ్ళెరంలో వుంచుకుని శయ్యాగృహం చేరేవేళకు యింకా పొద్దుపోయింది. పాపం యివతల రాముడు సీతకై వేచివేచి విసుగుజెంది, కోపం ముంచుకురాగా తలుపు గడియ బిగించి ముసుగుతన్నాడు. యింతలో సీతమ్మ రానే వచ్చింది గడియపడ్డ తలుపును చూడగానే భర్తకోపం అర్థమయ్యింది. కానీ యేం చేయగలదు? గడియ తీమ్మంటూ యిలా ప్రతిమాలుతూంది చూడండి.

"నిలుచుండ పాదాలు చేతులూ నొచ్చె
దంతంపు తలుపులూ తీయవోయి నాథ
వొంటొంటి చినుకుకే వొక చెంగు దడినే
కాముడా తీయవోయి కనకంపు గడియా
పటపటా చినుకుకూ పై కొంగు దడినే
పచ్చలా బాలుడా తీయవోయి గడియా
నాయగో జామాయె ఓ ప్రాణనాథ
రత్నహారం బిస్తు తీయవోయి గడియా"-

సీత యిలా ప్రతిమాలుతూ వుంటే రాముడేమని సమాధానమిస్తున్నాడో చూడండి.

"నిద్ర నీకు లేకుంటె నాకేమి సీత
గంటవలె దీపమ్ము ఆది నాకు తోడు
నీవు నిల్చుంటేను నాకేమి సీత
పువ్వులూ బుక్కా-య- అవి నాకు తోడు
నీవు నిల్చుంటేను నాకేమి సీత
పట్టెమంచము పరుపు ఆది నాకు తోడు"-

సీత యెంత నెమ్మదిగా ప్రతిమాలుతున్నా, వీరిద్దరి ఈ సంవాదం అత్త కౌసల్య చెవిన పడనే పడింది. ఆవిడే లేచివచ్చి, సీత పక్షం వహించి రాముణ్ణి

మందలించి తలుపు తీయించింది. కొత్త కాపురం రోజుల్లో నూతన దంపతుల ప్ర
స్థితి యిలాగే వుంటుంది దాదాపు. దీన్నే సీతారాములకూ ఆపాదించి కొత్త
జంటల బాధలకు శాశ్వతరూపాన్నిచ్చారు గేయాల్లో మనవాళ్లు.

అలాగే సీత 'వామనగుంటలాట' అనే గేయంలో. లోకానుభవము దా
చక్కమూ గల కోడలుగా సీత వర్ణింపబడింది.

కుటుంబంలో ఒడుదుడుకులు లేనిచోట, కొత్తదంపతుల సంసార రథం
నల్లేరుపైన నడకలా సాగిపోతుంది. పెత్తనం చెలాయించే అత్తమామలూ, ఆడపడు
చులూ, తోడికోడండ్ల గడసరితనం ముందు బెదిరిపోయే కొత్తకోడలి పాట్లు
యివన్నీ కళ్లకు కట్టినట్టు వర్ణింపబడ్డాయి 'సుభద్రసారె' అనే పాటలో. భారత
పరంగా వున్న ఈ గేయంలో సుభద్రార్జునులమధ్య చిలిపికలహం చిలికి చిలికి
గాలివానలాగా మారిపోవటం సుభద్ర యేడుస్తూ పుట్టింటికి చేరడం శ్రీకృష్ణుడు
తన వుపశమన వాక్యాలతో ఆమెను శాంతింపజేసి కోరిన వస్తువాహనాలు ఆభర
ణాలు యివ్వటం, సత్యభామ మొ॥ వదినెగారల పుల్లవిరుపు మాటలు విని బాధ
పడుతూ సుభద్ర అన్నయ్యకు చెప్పడం శ్రీకృష్ణుడు ఆమెను కొన్న మానిస
లతో నీకేమిట'ని నచ్చజెప్పి ఓదార్చటం యిలా ఈ పాటలో ప్రజాజీవితంలోని
సాధారణ సంఘటనలను సుభద్రార్జునులకు ఆపాదించి చర్చించటం జరిగింది.
యిక్కడ సుభద్ర, కృష్ణుడు, సత్యభామ మొ॥ పాత్రలన్నీ యింటింటావున్న
ఆన్నా చెల్లెళ్ళ ప్రేమానురాగాలకు, ఈర్ష్యపడి ఆడబిడ్డలను మాటలతో నొప్పించే
వదినెగారల స్వరూప స్వభావాదులకు ప్రతిరూపాలుగా నిలుస్తాయి.

సుభద్రసారె లాంటి పాటే రాయలసీమ ప్రాంతంలో మరోటి వుంది.
సామాన్యవధువు అత్తవారింటి జీవితాన్ని తెలిపే ఈ పాటలవల్ల, కట్నాలు కాన
కలు తేలేదని కొత్తకోడలిని అత్తింటివారు ఆరడి పెట్టటం ఈనాటి సమస్యకాదని
తెలుస్తూంది.

అమావాస్యనాడు అట్లుబోసి
అల్లుడా రమ్మని తినబెట్టలేదు
పున్నమీనాడు పులగమేవండి
పుత్రుడా రమ్మని తినబెట్టలేదు
అల్లెంబుకు ఆవుదూడను తోలియంలేదు

పాటిమీద చేను పండింది మొదలు
పట్టు చీరలు పెట్టిరా వాళ్లు
పసుపు కుంకుమలకని ఆస్తి యీలేదు మీవాళ్లు
తొలికొన్ను కాముడు కలిగింది మొదలు
కాళ్లకూ కడియాలు పెట్టలేదు మీవాళ్లు
మలికొన్ను చంటోడు కలిగింది మొదలు
రచ్చరాయబారము చేయలేదు మీవాళ్లు—

యిలా నీ 'పుట్టింటి వారేమీ యివ్వలేద'ని సాధిస్తున్న భర్తతో 'మావాళ్లు పేదవారు, మనకేమి యివ్వగలరు'-అని భార్య అనగానే. మాటమాటకు యెదురు మాట్లాడుతావా- అని ముప్పరి పగ్గం చేతబట్టి మూడు దెబ్బలు వేసినాడట! దాంతో కళ్లనీళ్ళ పర్యంతమయిన ఆ భార్య, సంతానాన్ని వెంటబెట్టుకొని, పుట్టింటికి పరుగుపరుగున వచ్చి చేరింది. తన బాధను అన్నయ్యకు వెళ్ళబోసుకుంది. దాంతో అన్నయ్య మనసు కరిగిపోయింది. కోరిన సొమ్ములు చేయించాడు. ఆవును తెచ్చియిచ్చాడు. నసుపు కుంకుమలకు పదియెకరాలు వ్రాసి యిచ్చాడు. చెల్లెలికి యిన్నీ అర్పితం చేస్తూన్న భర్తను చూస్తుంటే ఆయింటి కోడలికి ఆక్కసుగా వుంది. పోయివస్తానన్న ఆడబిడ్డతో యేమంటూందో చూడండి.

"పట్నమాసమంత పంచుకోరాదా
పొయ్యిలో బూడిద కొండబోరాదా"—

వదినె యెకసెక్కం మాటలతో ఆడబిడ్డమనసు చిన్నబోయింది. అన్నయ్యకీమాట చెప్పుకొని బాధపడింది. "కొనుక్కొచ్చినదాంతో కొట్లాటెందుకమ్మా" అన్న అన్నయ్య వూరడింపు కొండంత అండగా నిలువగా, సారెతో ఆత్త వారింటికి తిరిగి పయనమైంది చెల్లెలు. సాధారణంగా గ్రామీణ ప్రాంతాలలో వదినె మరదళ్ళ మధ్య ఆప్యాయతలు అంతంత మాత్రంగానే వుంటాయి. తానూ ఓయింటి ఆడపడుచునన్న విషయమే గుర్తుండదు వారికి. యింటిలోని సంపదా సౌభాగ్యాలన్నీ భర్త ఆడబిడ్డల పరం చేస్తున్నాడన్న కోపంతో 'యిల్లు బోచుకు పోతున్నా'వన్న ఆర్థంలో "నీవన్నీ మీసుకు వెళ్ళిన తరువాత యీయింట్లో మాకేం మిగిలింది బూడిదతప్ప. ఆదీ తీసుకెళ్ళరాదా!" అని వదినె సూటిపోటి మాటలంటుంది.

ఇలాంటి పాటలన్నింటిలోనూ పెండ్లయిన ఆడపిల్లకు అటు అత్తింటిలోనూ, యిటు పుట్టింటిలోనూ మనస్తాపాలు తప్పవు అని తెలుస్తూంది. మరి ఆడజన్మకు మోక్షమేమిటో యేపాటల్లో వ్రాసిఉందో యేదేవునికెరుక ?

మరికొన్ని యిళ్ళలో అత్త-కోడళ్ళ మధ్య సయోధ్య వుండదు. అత్త గారు కోడలిని నిష్కారణంగా సాధించటం, జరుగుతూనే వుంటుంది. అలాంటి సంఘటనలు కొన్ని స్త్రీల పాటల్లో వినిపిస్తాయి.

కోడలా కోడలా కొడుకు పెళ్ళామా
పచ్చిపాల మీద మీగడ లేవీ ?
వేడి పాలామీద వెన్నల్లు యేవీ ?
నూనె ముంతలమీద నురగల్లు యేవీ ?'

యీ ప్రశ్నలు యెంత సమంజసంగా వున్నాయో మనకు తెలుస్తూనే వున్నాయి మరి ఆ కోడలు యేమని జవాబిచ్చిందో చూడండి.

''అత్తరో ఓ యత్త ఆరళ్ళ అత్త !
పచ్చి పాలామీద మీగడుంటుందా ?
వేడి పాలామీద వెన్నలుంటాయా ?
నూనె ముంతల మీద నురగలుంటాయా ?
యిరుగు పొరుగూ లార ఓ చెలియలారా !
అత్తగారి ఆరళ్ళు చిత్తగించారా
పెత్తనం లాగేస్తే పేచీలు పోను
ఆరళ్ళ అత్తయైన సవతిపోరైన
తల్లిల్లు దూరమైన భరియింపలేము'' -

పండుగ వచ్చింది. యింటి పెత్తనం చెలాయించే అత్తగారున్న పుడు ప్రతి వానికీ ఆమె ఆజ్ఞ అత్యంతావశ్యకం మరి !

''పండుగ వచ్చింది ఓ అత్తగారు
పిండికీ బియ్యమూ యెన్నిపోసేది ?
వెయ్యవే విచ్చెనా - తియ్యవే గాదే

పొయ్యవే తలగీచి తవ్వేడే వడ్లు
ఆ వడ్లు నానేసి పిండంత దంచి
పిండి, పోకలు చెయ్యి చక్రాలచుట్టు
యిరుగు పొరుగూవారి కింతింత పెట్టు
మాపటికి మామకూ మారు మూతెట్టూ
మరునాటి చల్దులకు మరుదులకు పెట్టూ
మన యింటి పాలేర్లు మురియగా బెట్టు
మన యింటి మరదలికి మనసొప్ప బెట్టు

ఈ పాటలో అత్తగారి దర్పం ఆతి చక్కగా ప్రదర్శితమవుతూంది. యింతమందినీ తృప్తిపరచిన యింటి కోడలికి ఆఖరికి కాసంతయినా మిగులు తుందా అంటే అదీ సందేహమే! అందుకే ఓ అత్తింటికోడలు యెలా తన బాధను వెలువరిస్తూంటో చూడండి.

"మానన్న గానైతి మంచెవేతూరు
చెట్టన్న గానైతి చెలగివేతూరు
ఆకన్న గానైతి మేకలారగించు
కాయన్నగానైతి కాకులారగించు
పండన్నగానైతి పక్షులారగించు
బలుడు మాతండ్రి పాలు పిండంగ
బంగారు చెంబులో ధారగానైతి
సిరిదేవి మాయమ్మ చల్లచేయంగ
చిల్లిపోయి కన్నాన చిదుపగానైతి"-

యిన్నీ కాక ననో్న అత్తింటి కోడల్ని చేసి పదరాని పాట్లు పడేలా యెందుకు చేశావయ్యా! అని తన గోడు వెళ్లబోసుకుంటూంది. యిటువంటి పరిస్థితుల్లో ఆడదానికి వేరే కోరికలేముంటాయి. తన కీ బాధలనుంచి విముక్తి కలిగించమనితప్ప! వేదనల వల్ల కలిగే వైరాగ్యాని కిది పరాకాష్ఠ.

అందుకే పుట్టింటి జ్ఞాపకాలతోనే వూపిరి పోసుకుంటూంటుంది ఆ అత్తింటి కోడలు. తల్లిజ్ఞాపకం అంత తియ్యనిది కాబోలు. అక్కడ తన జీవితానికి సంబం

ధించిన యెన్నో తీయని జ్ఞాపకాల తాలూకు తీపి గుర్తులున్నాయి. తల్లితండ్రి తోడబుట్టిన వారందరినీ పదేపదే తలచుకుని తృప్తి పడుతూంటుంది. ఆలాంటి పుట్టింటికి వెళ్లాలంటే అతివలకాళ్లు రథాలైనడుస్తాయి, చేతులు వుయ్యాల చేరులై వూగుతాయి!

"కాశి కెడదామంచె కదలవే కాళ్లు
ఢిల్లి కెడదామంచె తిరగదే మనసు
నా రాచ పుట్టింటి కెళదాము అంచె
నా కాళ్లు పన్నిన రథములై నడుచు
నాచేతులుయ్యాల చేరులై వూగు"-

మరాఠీ జానపదగీతాలలోనూ యిటువంటి గేయం ఒకటుంది యక్షుడు మేఘం ద్వారా యిల్లాలికి సందేశాన్ని పంపిన వైనం గుర్తుకువచ్చింది కాబోలు. ఈ అత్తింటి కోడలు తనకు కనిపించిన పక్షితో పుట్టింటికి కబురు పంపుతోంది. అక్కడికి వెళ్ళి దీపావళి పండుగకు తననక్కడికి తీసుకెళ్లమని చెప్పమంటూ ఆ పక్షిని బతిమాలుతోంది.

రుణ్‌ఝుణ్ పాంఖరా	వూ....హూ....
జా మాధ్యా మాహేరా	వూ....హూ....
మాహ్యా మాహేరేచా	వూ....హూ....
కమానీ దర్‌వాజా	వూ....హూ....
త్యావర్ బైస్‌జా	వూ....హూ....
సాంగ్ మాధ్యా ఆయివాలా	వూ....హూ....
నే మలాస్ మాహరాలా	వూ....హూ....

ధాన్యం దంచేటప్పుడూ, శరీరానికి కలుగుతున్న శ్రమను ఆలసటను మరిచిపోయి వుత్సాహాన్ని తెచ్చుకునేందుకు స్త్రీలు పాటలు పాడుతుంటారు. ఆ పాటలు వారి సంతోషమూ, దుఃఖమూ అన్నీ వ్యక్తమవుతుంటయ్. ధాన్యం విసుర్రాయిలో వేసి విసురుతున్న సమయంలో కింది తిరుగలిపై పైతిరగలి తిరుగుతూ వుండగా పుట్టే శబ్దాన్ని లయగా చేసుకొని, శ్రుతి కలిపి ఈ పాటలను పాడుతూ వుంటారు. దంపుళ్లపాటలూ ఆలాంటివే. ఈ క్రింద పేర్కొన్న దంపుళ్ల పాటలో అత్తింటి బాధలను యెంత హృద్యంగా చెబుతోందో చూడండి.

"కాకరు పూసింది గంపకొరిగింది - నన్నుగని మాయమ్మ మందికిచ్చింది
యారాడ్ల కిందన్న నన్ని స్తివన్న - యాపకాయెట్లుందొ కొరికి సూడన్న
సాతుల్ల కిందన్న నన్ని స్తివన్న - సముద్రమెట్లుందొ మునిగి సూడన్న
బావల్ల కిందన్న నన్ని స్తివన్న - బులుసుకొమ్మెట్లుందో తొక్కి సూడన్న

యిలా సాగిపోతుంది పాట. అల్లారు ముద్దుగా పెరిగిన నన్ను సభ్య లెక్కవున్న యింటికిచ్చి, నా కన్యాయం చేశారు. పదిమంది తోడి కోడండ్లువున్న యింటిలో అందరికీ అనుకూలంగా వుండటం వారిని అనుసరించి నడవటం - వేపకాయను రుచి చూచినప్పటి చేదు అనుభవం లా వుండట! పోనీ భర్త ప్రేమయినా ఈ బాధలను మరిపించేలా వుందా అంటే ఆదీలేదు. సవతుల మధ్య సంసారం పీరితో వేగడం సముద్రపు లోతును కొలిచినట్టుగా వుండట! యిక బావగారలలో మెలగడం - ముల్లుకొమ్మను తొక్కినట్టే వుంటుంది. మరి యిలాంటి యింటికి తన నివ్వడం - అన్యాయం కాక మరేమిటి! సమష్టి కుటుంబంలోని కోడలిపాట్ల గురించి 'కలికి కామాషి' - పాటలో యెంతో చక్కగా వర్ణింపబడింది.

"కలవారి కోడలు కలికి కామాషి - కడుగుచున్నది పప్పు కడవలో పోసి
అప్పుడే వచ్చెను ఆమె పెద్దన్న - కాళ్ళకు నీళ్ళిచ్చి కన్నీళ్ళు నింపె
ఎందుకూ కన్నీళ్ళు యేమికష్టాలు-తుడుచుకో చెల్లెలా ముడుచుకో కురులు
ఎత్తుకో బిడ్డను ఎక్కు అందలము - పెట్టుకో సొమ్ములు కట్టుకో చీర
చేరి మీ యత్తలకు చెప్పి రావమ్మ" -

అన్నయ్య ఈ మాట అనగానే చెల్లెలికి కొండంత సంతోషమయింది. అయినా అత్తగారి అనుమతి లేనిదే యెలా! అందుకే పైట నిండుగా కప్పుకొని, కుర్చీపీట మీద కూర్చున్న అత్తగారిని అడిగింది.

"కుర్చీపీట మీద కూర్చున్న అత్త - మా అన్నలొచ్చారు మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ మీ మామనడుగు
పట్టెమంచంమీద పడుకున్న మామ - మాయన్నలొచ్చారు మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ మీ బావనడుగు

భారతం చదివేటి బావ పెదబావ - మాయన్న లొచ్చారు మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ మీ అక్క-నడుగు

వంటలు చేసేటి ఓ అక్క-గారు - మా అన్న లొచ్చారు మమ్మంపుతార
నేనెరుగ నేనెరుగ నీ భ ర్తనడుగు

రచ్చలో కూర్చున్న రాజేంద్రభోగి-మా యన్న లొచ్చారు మమ్మంపుతార
పెట్టుకో సొమ్ములు కట్టుకో చీర - పోయిరా సుఖముగా పుట్టినింటికిని

యిరుగుపొరుగూలార ఓ అమ్మలార - చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు నేవించబోయి
మరుదుల పెళ్ళికి మరలివచ్చేను-యిరుగుకూపొరుగుకూ యిదె పోయివత్తు"

యిలాంటి సమష్టి కుటుంబాలలో - సర్దుకుని పోయే స్వభావంగల కోడలే తట్టుకుని వుండగలదు. కొందరు స్త్రీలకు పదిమంది సభ్యులున్న యిలాంటి యింట్లో, ప్రతి విషయానికి, అధికార, అనధికార సభ్యుల అనుమతుల కోసం ఆలమటించటం నచ్చకపోవచ్చు. అందుకే అలాంటి గడసరి కోడళ్ళు వేరు కాపురం పెడదామని భ ర్తలకు నూరిపోయనూవచ్చు.

"ఏరుబడితేనె మేలు మగడా - మనము
పొ త్తులుంచేనే పోరు మగడా"
"ఏరుబడ్డ తెల్లారి యేకమై మనముండి
ఏకించి పీకించి నెలకొక్క పోగాడికి
మోట దండెడ దొడ్డు మొలతాడు చేయింతు ॥ఏరు॥

"మక్క-జన్నచేను మనపాలికే వ స్తె
నక్క-బెదురూ బెట్టి నా ప్రజ్ఞ చూపించి
యిద్దూము పండేది పుట్టేడు పండిస్తు ॥ఏరు॥

"రంగు రంగొంకాయలు గొంగెడన్నీ దెంపి
హంగుగా నే నిన్నుకొండంగడికి పోయి
పొంగుబొంగే కల్లు బుంగెడంతా తెస్తు ॥ఏరు॥

వేరుబడితే, మన కన్నీ మంచిరోజులే అని చెప్పే భార్య మాటకారి తనానికి పొంగి, లొంగిపోని మగడుంటాడా!

మరికొన్ని కుటుంబాలలో, తన భర్తదే యింటి పెత్తనం అయినపుడు యిక ఆ కోడలి ఆభిజాత్యం యిలా ప్రకటిత మవుతుంది.

మా యత్త మా మామ వూరేగుతుంటే
చుట్టపీకలు రెండు చూడొచ్చినాయి
మట్ట గడపలు రెండు మాట్లాడినాయి
కందిరీగలు వచ్చి కత నడిపినాయి

యిలా పరిశీలించుకుంటూ పోతే, స్త్రీల వైవాహిక జీవితానికి సంబంధించిన పాటలలో వారి మనోధర్మాలు, ప్రవృత్తులూ ఆద్దం పట్టినట్టు కనిపిస్తాయి. యింకా చాలా పాటలు అజ్ఞాతంలోనే వున్నాయి. వాటికి వెలుగుచూచే అదృష్టం వుంటో లేదో!

వ్రతాలు - నోములు :

వ్రతాలు అనగానే యేదో 'దీక్ష బూనిన' అనే అర్థం ధ్వనిస్తుంది. కుటుంబ సంక్షేమం కోసం కర్మప్రధానంగా ఆచరించే వ్రతంలో పూజా విధానానికే యెక్కువ ప్రాధాన్యత. చరిత్ర నో మారు పరికిస్తే, కర్మప్రధానంగా జరిగే పూజలలో మొదటినుంచి పురుషులకే అగ్రస్థానం వున్నట్టు తెలుస్తూంది. కొన్ని ఆదివాస ప్రాంతాలలో యిలాంటి కర్మకాండలలో స్త్రీలు పాల్గొననేరాదట! ఆలా పాల్గొన్నట్టు తెలిస్తే - వాళ్ళను చంపివేస్తారట కూడా! అంతెందుకు! యిప్పటికీ స్త్రీలు వేదమంత్రాలను పఠించకూడదన్న నమ్మకం మనవారిలో వుందన్న మాట వాస్తవమే గదా! యిలాంటి కఠిన నియమ నిబంధనలున్నందువల్లే కేవలం స్త్రీల సౌలభ్యం కోసమే యీ వ్రతాలూ-నోములూ ప్రభవస్తిలోకి వచ్చాయేమోనన వచ్చు. పురుషులు కర్మనిష్ఠలలో ఆచరించే యజ్ఞయాగాదులను సాత్వికం చేసి స్త్రీల వ్రతాలు నోములూ రూపొందించబడ్డాయి. వరలక్ష్మీవ్రతం, చిలుక ద్వాదశీ వ్రతం, ఏకాదశీ వ్రతం, మంగళగౌరి, కామేశ్వరి, చిక్కుళ్ళ గౌరి, పసుపుగౌరి, చిట్టిబొట్లు నోము, కృత్తిక దీపాల నోము, వాయనాలనోము, లక్షవత్తుల నోము, శ్రావణ శుక్రవారం నోము-మొదలైన వెన్నో స్త్రీలు - అత్యంత భక్తి శ్రద్ధలతో నోచుకునే వ్రతాలూ-నోములూ. వీటికి ప్రత్యేకించి పాటలూ వున్నాయి.

శ్రావణ శుక్రవారం పాటలో, యే వ్రతంవల్ల స్త్రీలు ధనధాన్యాదులతో భోగ భాగ్యాలతో తుల తూగుతారని పార్వతీదేవి అడిగిన ప్రశ్నకు సమాధాన మిస్తూ పరమేశ్వరుడు ఈ శుక్రవారం నోము గురించి వివరించటం జరుగుతుంది. ఆ కథ యిలా వుంది - "మగధ దేశంలో కుండినపురానే పట్టణం. అక్కడ 'చారు మతి' అనే పతివ్రత వుంది. ఆమెకు కలలో లక్ష్మీదేవి కనిపించి - "నేను వర లక్ష్మిని, శ్రావణ శుక్రవారం నాడు నన్ను పూజిస్తే సకలైశ్వర్యాలనూ ప్రసా దిస్తా'నని చెప్పి మాయమైందట! చారుమతి యీ వ్రతాన్ని ఆచరించి ఆష్టైశ్వ ర్యాలను పొందింది. ఈ కథను పాట రూపంలో పాడుకుంటూ రానాడు!

అలాగే శ్రావణ మంగళవారం నోముకు కూడా చాలా ప్రాధాన్యత వుంది. సంతానం లేక బాధపడే ఓ మహారాజుకు శివుని మహిమవల్ల నారాయణు డనే కుమారుడు కలిగాడు కానీ వాడు అల్పాయుష్కుడు. అతనికి సత్యవతి అనే రాకుమార్తెతో వివాహమైంది. వారి శోభనంనాడు నియమం ప్రకారం రాకుమారుణ్ణి కాటువేయటానికి గదిలోకి వస్తుందో మహాసర్పం. యిది గమనిం చిన సత్యవతి ఆ సర్పాన్ని కలశంలోపెట్టి వాసెనకట్టు కట్టేసింది. దీనితో గండం తప్పి రాజకుమారుడు బ్రతికిపోయాడు. తమ కుమారునికి మరణ గండాన్ని తప్పించినవైనం చెప్పమని అత్తమామలు సత్యవతిని అడిగినప్పుడు- "తాను మంగళవారం గౌరీ వ్రతాన్ని ఆచరించినట్టూ, ఆ పుణ్యఫలితం వల్లనే తానీనాడు భూంగల్యాన్ని రక్షించుకున్నట్టూ తెలియ జెప్పిం దా రాకుమార్తె" యిదీ ఆ కథ. దీన్ని పాటరూపంలో పాడుకుంటారు. అయిదు సంవత్సరా లీ వ్రతాన్ని ఆచరించాలట!

ఇవికాక పళ్ళ నోములున్నాయి. పదహైదుపళ్ల నోములో యేడాది పొడు గునా కథ చదువుకుని, చివరి రోజు ఒక పెద్దముత్తయిదువకు పదహైదుపళ్లు- వీరె-రవికతో తాంబూలం యివ్వాలి. పదహారు పళ్ళనోము, పెద్ద గుమ్మడినోము, యిలా రకరకాల నోములు స్త్రీలకోసం ప్రత్యేకంగా వున్నాయి ఆ నోములకోసం ప్రత్యేకించి పాటలూ వున్నాయి. స్థలాభావంవల్ల వాటిని యిక్కడ యివ్వటం సాధ్యం కావటం లేదు.

కానీ ఒక్కటి మాత్రం నిజం. ప్రత్యేకించి స్త్రీలకోసం సృష్టించబడ్డ ఈ వ్రతాల నోములకు వుద్దేశించిన ఫలితం మాట అటుంచి యింటిలో శుచి, శుభ్రత,

వుంటుందన్నది వాస్తవం. ఆపై యింటి సభ్యులలో ఐకమత్యం యిరుగుపొరుగు వారితో కలిసిమెలసి వుండటం వంటివి, యింటికి మూలస్తంభంగా పేర్కొనబడే యిల్లాలికి అవసరం గదా! ఆ సౌలభ్యం గూడా ఈ వ్రతాలూనోముల ఆచరణ వల్ల చేకూరుతుంది. అంతకంటే ముఖ్యమైనది. మనసులో యెన్ని బాధలున్నా కనీసం ఈ నోములు వ్రతాలూ ఆచరించినంత సేపయినా కాస్త ఆ బాధను మరిచి పోయి భగవదారాధనలో మనసు శాంతిని పొందవచ్చునన్నదే ప్రధానోద్దేశంగా కనిపిస్తుంది. సహజంగా స్త్రీలందరికీ ఈ వ్రతాలపట్ల శ్రద్ధ ఓపిక వుండటం అవసరమవటంవల్ల ఆ కారణంగానయినా అత్తాకోడళ్ళు ఆడబిడ్డలూ కలిసిమెలసి వుండవచ్చునన్న అంతరార్థం వుండవచ్చు. ఎటుదిరిగీ స్త్రీ తన భర్త, సంతానం పుట్టింటివారూ సుఖసంతోషాలతో వుండేలా చూడమని భగవంతుని ప్రార్థించటమే ఈ వ్రతకథల ప్రధానాంశంగా గమనించగలం.

ఉపసంహారం;

ఈ విధంగా స్త్రీల పాటలకు జానపద సాహిత్యంలో ప్రత్యేకత వున్నది. గృహజీవనానికి సంబంధించిన ప్రతి ఘట్టానికీ జానపద జీవనంలో ప్రత్యేక స్థానం యివ్వబడింది కుటుంబ జీవనమన్నది. మనమేర్పరచుకున్న వ్యవస్థ. దీనిలో కష్టాలున్నాయి, సుఖాలూవున్నయ్. అవన్నీ ఈ పాటలలో ప్రతిఫలించాయి. స్త్రీ హృదయం బహుసున్నితం కాబట్టి వారికి సంబంధించిన ఈ పాటలలో యింత వాస్తవికత, సున్నితత్వం వున్నాయేమో! అన్నట్టు ఈ గేయాలలో సాధారణీకరణం కూడా యెక్కువే! అంటే పాటలలో వుదహరించిన పేర్లు తప్ప తక్కిన వాతావరణమంతా మన చుట్టుప్రక్కల వుండేదే! ఆపాటలలో వర్ణించబడిన రాజభవనాలూ, పూరిగుడిసెలూ, శ్రీరాముడు, కృష్ణుడు, సీతమ్మ, రుక్మిణి, సత్యభామా మొ॥ పాత్రలూ అవన్నీ మనమూ మనచుట్టుపట్లవున్న పూరిళ్ళు తాటాకు గుడిసెలూ, మేడలూ మిద్దెలే. ఆ పాటలలో వర్ణింపబడిన సంసార జీవనమంతా మనదే. అందుకే వీటిలో కల్పన కన్నా వాస్తవికతే యెక్కువకావటం చేత, గుండె గుండెనూ పలుకరిస్తా యీ పాటలు.

ఏది ఏమయినా స్త్రీల జీవితాలకు భాష్యాలుగా, వాస్తవిక జీవన దర్పణాలుగా, మహిళాసౌభాగ్య తోరణాలుగా, స్త్రీల పాటలు జానపదసాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని కలిగి వున్నాయనటంలో సందేహం లేదు.

సూరదాస్-అన్నమయ్యల వాత్సల్య రసపోషణ

ఉపోద్ఘాతం :

సువిశాలమయిన ఈ సకల చరాచర ప్రపంచమూ, సర్వశక్తి యుతుడ లీలామానుష వేషధారీ, అఘటన ఘటనా సమర్థుడూ అయిన సర్వేశ్వరు ఆద్భుతసృష్టి ఈ సృష్టికార్యానికి ముఖ్య ఆలంబనలు ప్రకృతీ పురుషులు. వీరి వురి పరస్పర సామీప్యం ప్రేమోద్వేగానికి నాంది. 'ప్రణయ భావన' అనగా ఓడలంతా ఒక విద్యుత్తు ప్రవహించే అనుభూతి అంతరంగ తరంగాలలో ఉవె త్తున యెగసిపడే వుద్వేగపు వెల్లువ ఈ వెల్లువలో మనసులు తడిసి, ఒకరిలో యింకొకరు ఒదిగిపోవాలన్న తపన-ఆవేశం, ఫలితం-మానవసృష్టి శుభారంభాని మనసైన స్వాగతం.

తా నడుగిడిన ప్రపంచాన్ని గురించి యిప్పుడే యిప్పుడంటే తెలుస కోవాలన్న కుతూహలంతో చుట్టూ పరికించి చూచే చూపులు. ఆ చూపుల్లో తెల్ల వెన్నెలలు, అమృత సుధాధారల వొలికించే చిన్ని నోరు, ఈ ప్రపంచాన్ని జయించే ప్రయత్నం యిదుగో యిప్పటినుంచే ప్రారంభిస్తున్నానంటున్న చిన్ని చిన్ని పిడికిళ్ళు, భగవదస్తిత్వాన్ని బలపరచే మరో సందేశమీ చిన్న జీవి, ఆ బోసి నవ్వుల్లో ఆ చిన్ని చిన్ని కళ్లలోని ఆకర్షణ నుండి యెవరు తప్పించుకోగలరు ముఖ్యంగా మాతృహృదయ మీ స్పందనకు ఆలవాలమవుతుంది తన చిన్ని బిడ్డడి బాల్య చేష్టలు కనగానే ప్రపంచంలోని ఆనందానికంతటికీ తానే నెలవవుతుంది తల్లి. ఆ బిడ్డడే నోరు తెరచి అమ్మా ! అని పిలవగానే ఒడలంతా పులకరించి శరత్సాగరపు ఉత్తుంగ తరంగాలలో మనస్సు వూయలే అవుతుంది. ప్రపంచాన్నే జయించగలిగిన గర్వభావంతో పొంగిపోతుంది ఆ మాతృ హృదయం. తన సంతానం చేసే చిలిపి పనులకు కించిత్ కోపం తొంగి చూడబోయినా, వాత్సల్యం దాన్ని తొక్కిపట్టి, "ఎంత బాగా అల్లరి చేయగలడమ్మా నా బిడ్డడు" - అని మురిపిస్తుంది, కోపాన్ని మరిపిస్తుంది.

అంతటి శక్తిగల ఈ వాత్సల్య రసమే. సృష్టికర్తను సైతం మాతృ మూర్తిగా చూడమని ప్రేరేపించింది. ఈ సకల సృష్టికి తల్లే ప్రథమదైవమనీ, తల్లిని మించిన వేదశాస్త్రాలూ, పవిత్ర గ్రంథాలూ లేవని ధృవీకరించేలా చేసింది. మాతృత్వం ఒక మధుర భావనగా, తల్లి మమతల పాలవెల్లిగా వెలిసింది.

బిడ్డడు తెలిసీ తెలియక తప్పు చేసినా, కరుణించి క్షమించే విశాల హృదయం కలిగిన తల్లిరూపంలో భగవంతుని దర్శించుకుని, ఆ అనుభూతిని మనస్సులో పదిలపరచేలా చేసింది-ఈ వాత్సల్యరసం. అందుకే ఆది శంకరులు ఆ జగజ్జననిని ప్రార్థిస్తూ "కుపుత్రోజాయేత, క్వచిదపి కుమాతానభవతి"-అన్నారు. "కామ క్రోధ లోభమోహమద మాత్సర్యములనబడే ఆరు శత్రువుల చేత కీలు బొమ్మనై, విచక్షణా జ్ఞానరహితుడనై నేను చేసిన తప్పులను క్షమించి, నాపై దయావృష్టిని కురిపించవా తల్లీ!" అంటూ తాను పసిపాపడిగా ఆ జగజ్జననిని ప్రాధేయపడ్డారాయన.

ఈ వాత్సల్యాన్ని నవరసాలలో ఒకటిగా పరిగణించే విషయమై సంస్కృత సాహిత్యశాస్త్రాలలో మూడు రకాల అభిప్రాయలున్నాయ్. కొంతమంది దీనికి రసపరమయిన గుర్తింపు నివ్వలేదు; మరికొంతమంది యితర రసాలలోని అంత ర్భాగంగా వాత్సల్యానికి స్థానమిచ్చారు; యితరులు వాత్సల్యానికి 'రస' గౌర వాన్ని ప్రసాదించారు.

ముఖ్యంగా రుద్రటుడు 'ప్రేయాన్' అన్న దశమ రసాన్ని ప్రవేశ పెట్టాడు. ఈ రసాన్ని వాత్సల్యానికి పర్యాయరూపంలో స్వీకరించవచ్చు. "హరి భక్తి రసామృత సింధువు" అన్న గ్రంథంలో ఈ ప్రేయస్ అన్న పదం అదే అర్థంలో వాడబడింది. ఉద్భటుడు 'రసవదలంకారం'లోనే ప్రేయన్ రసాన్ని కూడా వుట్టంకించాడు. ప్రేయన్ యొక్క స్థాయీభావం 'ప్రీతి' అని భామహుని అభిప్రాయం. దంపతి ప్రేమకూ దీనికీ సంబంధం లేదు. దండికూడా ఈ అభిప్రాయంతో యేకీభవించాడు. దశరూపకకారుడు ప్రేమ భక్తి భావాలు క్రమంగా హర్షోల్లాసాలలో అంతర్లీనమవుతాయన్నాడు.

హేమచంద్రుని కథనం ప్రకారం వాత్సల్య, స్నేహ, భక్తిభావాలు రత్యానుభూతిలో విలీనమవుతాయి.

మొత్తం మీద వాత్సల్యం ఒక హృదయగత భావమేగానీ, దాన్ని స్వతంత్ర రసంగా పరిగణించటానికి వీలులేదని వీరందరి అభిప్రాయమన్నమాట!

అంటే వాత్సల్యానికి రసపరమయిన గుర్తింపు నిచ్చిన శాస్త్రకారులు లేనేలేరని కాదు. కవికర్ణపూర గోస్వామి వారిలో ముఖ్యుడు. విశ్వనాథుడూ వాత్సల్యానికి రసంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగించాడు. అంతేకాదు దీనికి అంగ, ఉపాంగాలను కూడా వ్యాఖ్యానించాడు. దాదాపు భక్త కవులందరూ వాత్సల్య రసాన్ని అంగీకరించారనే చెప్పవచ్చు. వారు తమ కావ్యాలలో వాత్సల్య రస స్వరూపాన్ని సంపూర్ణంగా ఆవిష్కరించారు.

వాత్సల్య రసతత్వ నిరూపణం :

కవికర్ణ పూర గోస్వామి సిద్ధాంత ప్రకారం, 'మమత' వాత్సల్య రసానికి స్థాయీభావం. మందార చంపూకారుడు 'కరుణ'ను దీనికి స్థాయీభావంగా గుర్తించాడు. కానీ అది ఆంత ఉపయుక్తంగా తోచదు వాత్సల్య రసానికి స్థాయీభావం వత్సలత గానే పరిగణించవచ్చు. తల్లిదండ్రులు, గురువు, పరివారము మొదలైనవారు దీనికి ఆశ్రయాలు. సంతానము, శిశువులు, శిష్యులు ఈ రసానికి ఆలంబనలు. పసిపిల్లల పట్ల ప్రేమభావం పెంపొందే ప్రతి సన్నివేశమూ, అన్ని వాతావరణాలూ, ఈరసానికి వుద్దీపనలే. స్పర్శాలింగన, చుంబన, దర్శన, పులక, ఆనందాశ్రువు లీ రసానుభవాలు. ఈ యెనిమిది సాత్విక భావాలతో పాటు స్తన స్రావం గూడా మరో సాత్విక భావం. శంక, హర్షావేగ, గర్వ, పులక, స్మృతి, విస్మయాదులు సంచారీ భావాలు. ఈ వాత్సల్య రసంలో ముఖ్యంగా రెండు భేదాలున్నాయి. అవి వాత్సల్య భక్తి రసము, సామాన్య వాత్సల్య రసము. శృంగార రసంలోనూ దీన్ని చేర్చిన వారున్నారు. భక్తి రసంలో వాత్సల్య రస ప్రాధాన్యత అనివార్యం; ప్రేమ, కారుణ్యము, వీర హాస్య రసాల సంయోగం గూడా యిందులో కానవస్తుంది.

ముఖ్యంగా వాత్సల్య రసంలో స్వార్థ చింతన లేదా, పగ తీర్చుకోవడం వంటి భావాలకు అవకాశం లేదు కాబట్టి యిది మనకొక అలౌకికానందాన్ని ప్రసాదిస్తుంది. సంతానంలోని తన రూపాన్ని చూచుకోవటం- దీనికి ముఖ్యకారణం. ఇందుకే 'ఆత్మావై జాయతే పుత్రః'- అన్నారు. తన మరణం తరువాత కూడా తన అస్తిత్వాన్ని ప్రపంచంలో శాశ్వతం చేసే సాధనంగా సంతానాన్ని చూడటం సహజమేగదా ! దీని ద్వారా తన అమరత్వాన్ని తానే దర్శించినట్టవుతుంది. తన పిల్లల ప్రగతితో తన ముందంజను వూహించుకోవడం, తనలోని అత్యుపమయిన

కోరికలను పిల్లలద్వారా తీర్చుకునే ప్రయత్నం చేయడం సర్వమానవ సహజం. వారి ఆమాయకత్వం సున్నితత్వం మనకు తెలియకుండానే వారికి దగ్గరయ్యేలా చేస్తాయి యిది కేవలం షన పిల్లల విషయంలోనే కాదు యితరుల విషయంలోనూ వర్తిస్తుంది. అదే ఈ వాత్సల్య రసంలోని రహస్య విశేషం.

ముఖ్యంగా స్త్రీలలో యీ రసాధిక్యం యెక్కువనవచ్చు. వారికి మాతృత్వం గొప్ప వరం. ఈ మృణ్మయ శరీరంలో హూనవులు చూడలేని యెన్నెన్నో ఆనంద లోకాలను మాతృమూర్తులుగా వారు చూడగలరు. యీ మాతృత్వ మన్నది- స్త్రీకి భగవంతు డిచ్చిన అతి గౌరవమయిన అధికార మనవచ్చు. అలా అని తండ్రిగా పురుషునిలో యీ వాత్సల్య రసానుభూతికి చోటులేదని కాదు. తల్లిదండ్రు లిరువురిలోనూ మొలకెత్తే యీ వాత్సల్యభావన ప్రకృతి భావనకి అత్యంత సమీపానికి వస్తుంది. ప్రారంభంలో చెప్పుకున్నట్లు- సృష్టికార్యమే యీ వాత్సల్య రసావిష్కరణకు నాంది పలుకుతుంది. ఆలా యీ రసం- కుటుంబ జీవనం నుంచి విస్తృతమవుతూ సామాజిక జీవనం వరకూ వ్యాపిస్తుంది దేశాన్ని పాలించే రాజులోసూ యీ వాత్సల్య భావన అవసరమంటారు. తన దేశ ప్రజలను కన్నబిడ్డలవలె చూచుకున్నపుడే సుఖసంతోషా లా చోట వెల్లివిరుస్తా యన్నది చరిత్ర చెప్పిన సత్యమే గదా!

వివిధ భక్తి సాహిత్యాలలో వాత్సల్య రసపోషణ :-

దాదాపు అన్ని దేశీ సాహిత్యాలలోనూ వాత్సల్య రసపోషణ బాగానే జరిగిందని చెప్పవచ్చు.

సంస్కృత సాహిత్యంలో వివిధ కావ్యాలలో వాత్సల్య రసవర్ణన వున్నది. ముఖ్యంగా నారాయణతీర్థుల 'కృష్ణలీలా తరంగిణి' శ్రీకృష్ణుని బాల్యక్రీడావర్ణన లకు పెన్నిధి వంటిది. భాగవతంలోని దశమస్కంధం శ్రీకృష్ణుని బాల్యచేష్టలకు- ఆద్దం పట్టిన రీతి అత్యద్భుతం.

దాదాపు అన్ని భారతీయ సాహిత్యాలలోనూ వాత్సల్య రసపోషణ జరగ బడింది. వ్యాస ప్రణీతమయిన శ్రీమద్భాగవతంలోని దశమ స్కంధం శ్రీ కృష్ణుని బాల్య క్రీడలకే సుప్రసిద్ధం. నిజానికి వాత్సల్య రసపోషణ అన గానే చిన్నికృష్ణుని లీలా విలాస వర్ణనవైపే దృష్టి మళ్ళుతుంది తప్ప-యితరత్రా జరిగిన. వర్ణనలపై అంతగా పోదు. శ్రీరామచంద్రుని చిన్ననాటి ముచ్చటలను

యెందరెందరో కవులు వర్ణించినా ఆయన "మర్యాదా పురుషో త్తముడు" "ఆనంత గంభీరమూ ర్తి" "దానవ సంహారి" 'ప్రీతజన పావన శ్రీరామచంద్రమూ ర్తి'గా దర్శనమిస్తాడే తప్ప చిన్ని కృష్ణునిలా 'కన్నయ్య "గోపీజన మనోవిహారి" "వెన్న దొంగ"వంటి వర్ణనలతో సామాన్య మానవాళికి అతి సమీపంగా వచ్చి మనసులలో తిష్ఠవేయలేదు. శ్రీరామావతారం దుష్టదమన క్రియకే రూపొందించబడిందన్న భావన ప్రధానంగా కనిపిస్తుంది. కృష్ణావతారంలో పిన్న పెద్దల నలరింపజేస్తూ సామాన్య బాలురకంటే చాలా భిన్నమైన సాహస కృత్యాలను బాల్యక్రీడల రూపంలో చేస్తూ భగవదవతార రహస్యాన్ని యెప్పటికప్పుడు తెలియబరుస్తూ కూడా వెనువెంటనే మానవ సహజమయిన మాయా యవనికను వేసి చూపరుల దృష్టి కందనీయక ఆటలాడి ఆనందాన్ననుభవించిన వైనం కడు అందమైనది.

సంస్కృత సాహిత్యంలో వాత్సల్య రసపోషణ విషయానికి వస్తే మహా కవులుగా పేరుపడిన కవులందరూ యీ రసపోషణ చేసినా కేవల వాత్సల్య వర్ణనకే తమ రచనా పాండిత్యాన్ని కేటాయించిన కవులలో లీలాశుకుడు ముందుగా గుర్తుకు వస్తాడు. శుక యోగీంద్రుని పరమావతారంగా ప్రసిద్ధి నొందిన 'లీలాశుకు'ని కీర్తిని ఆచంద్రతారార్కంగా నిలిపి - దశదిశలా వ్యాపింప జేసిన సుప్రసిద్ధ గ్రంథం శ్రీకృష్ణ కర్ణామృతం - పేరుకు తగ్గట్టు నిజంగా వినే వారి చెవులలో అమృతపు సోనలను కురిపిస్తుంది. అతి సహజంగా - శోభాయ మానంగా-వర్ణింపబడే శ్రీకృష్ణుని వివిధ లీలా గాథలను యెన్నిరీతుల ప్రాసినా తనివితీర దీ రచయితకు.

కస్తూరీ తిలకం లలాట ఫలకే వక్షఃస్థలే కౌస్తుభం
నాసాగ్రే నవ మౌక్తికం కరతలే వేణుం కరే కంకణమ్
సర్వాంగే హరిచందనం చ కలయన్ కంఠేచ ముక్తావలీ
గోపస్త్రీ పరివేష్టితో విజయతే గోపాల చూడామణీ.

చాలామంది తల్లిదండ్రులు మాటలు నేర్చే తమ సంతానానికి ముసు ముందుగా నేర్పేది యీ శ్లోకమే. వారికి నేర్పుతూ ఆందులోని శ్రీకృష్ణవర్ణనకు పదేపదే మురిసిపోయే పెద్దవారికి కూడా యీ శ్లోకం యెవరి రచనో తెలియదు. సాహిత్యంతో అంతగా పరిచయం లేని వారి మనసులను కూడా ఆలరించే యీ శ్లోకం శ్రీకృష్ణ కర్ణామృతం లోనిదే.

మూడు ఆళ్వాసాలను గలిగిన యీ గ్రంథం కేవలం కృష్ణ లీలావర్ణనకే రచియింపబడింది. ముఖ్యంగా రెండవ ఆళ్వాసంలో బాలకృష్ణుని వర్ణన మనసును వుద్భూత లూగిస్తుంది.

"బాలం నీల మణి వయం మధురిమ స్వారాజ్య మారాద్ధ్మహ"

యిత్యాది శ్లోకాలలో నెమిలిపురి తలలో ధరించి, తేనెలొలికే చిఱు నవ్వుతో నిండారు చందురుని మించు మోముతో ప్రకాశించే చిన్ని కృష్ణుని పదే పదే వర్ణించిన లీలాశుకునికి ఆ రూపంలో కృష్ణుణ్ణి చూచుకోవటం యెంతో ప్రీతికరమైన విషయం.

"గోధూళి ధూసరిత కోమల గోపవేషం
గోపాల బాలక శతై రనుగమ్యమానం
సాయన్తనే ప్రతిగృహం పశుబన్ధనార్థం
గచ్ఛన్త మచ్యుత శిశుం ప్రణతోస్మి నిత్యం"—

దినమంతా గోవులనుమేపి, సాయంసమయం కాగానే వాటి వాటి యిండ్లకు చేర్చే గోపబాలుని బూడిద బుస్సల్లో నిండిన వేషాన్ని యెంత రమ్యంగా వర్ణించాడో పై శ్లోకంలో!

"సోయం మునీన్ద్ర జన మానసతాపహారీ
సోయం మదవ్రజ వధూవసనాపహారీ
సోయం తృతీయ భువనేశ్వర దర్పహారీ
సోయం మదీయ హృదయామ్బురుహాపహారీ—

మహామునుల మనసులలో చెలరేగే తాపాన్ని హరింపగల పరతత్వమేత్త, యవ్వన గర్వితులయిన గోపికాజనుల వసనాలను అపహరించిన కన్నెదొంగ, ముల్లోకములకూ అధినేత అయిన యింద్రునికి గర్వభంగము చేసిన శక్తిశాలి, నా హృదయ కమలాన్ని ఆకర్షింపగలిగిన సమర్థుడూ అయిన మహానుభావునికి మనసారా నమస్కరిస్తున్నాను"—

యిటువంటి అనేక వర్ణనలలో లీలాశుకుడు జన్మను సార్థక పరచుకున్నాడు.

తమిళసాహిత్యంలో ఆళ్వారుల సాహిత్యం చాలా వరకు వాత్సల్య రస పోషణకే కేటాయించబడింది. ముఖ్యంగా పెరియాళ్వారు రచనలలో శ్రీకృష్ణుని

అవతార విశేష వర్ణనము మొదలు జోలపాటలు, స్నానము చేయించటం, పుష్పాలంకార వర్ణనం, సంధ్యారక్షవేయటం మొదలయిన వివిధ వర్ణనలు అత్యంత హృద్యంగా వున్నాయి. వీటన్నింటిలో చిన్ని కృష్ణుని వర్ణన వున్నప్పటికీ భగవదవతారమన్న స్పృహ ప్రతిపాశురంలోనూ స్పష్టంగా కనిపిస్తుంది

"కన్నుగళోడవియిల్ కట్టెఱుమ్బుపిడి తిట్టాల్
తిన్నిక్కెడు మాగిల్ వెణ్ణెయ్ తిరట్టి విళుఙ్గుమాగాణ్చాన్
నిన్న మరారురఙ్ఞాయ్ త్తాయ్ నీ పిఱన్ద తిరుచోణమ్
ఇన్ను నీ నీరాడవేణ్డు మెమ్బిరానోడా దేవారాయ్"—

దూడలు వుల్లాసంతో అటుయిటు చెంగు చెంగున పరిగెత్తుతూవుండటం చూస్తే యెంతో ముచ్చట వేస్తుంది. కానీ మనం చూడాలనుకున్న ఘడాన యిది సాధ్యమయ్యే విషయం కాదుగదా! చిలిపికృష్ణుని కళా చూడాలనిపించిన ఘడాన యేంచేసేవాడు? దూడలదెవులలో పెద్దచీమలను విడిచేవాడట. చీమలు చెవిలో పారాడుతుండగా విభ్రమచెంది దూడలు ఆటూ యిటూ చిందులు వేస్తూ వుంటే అది చూచి ఆనందించటం యితరులకు కోపకారణమయినా యశోదకు అది తన తనయుని బాల్యక్రీడ! అట్టి కృష్ణుడు వెన్నముద్దలను కడు ప్రీతితో ఆరగించటాన్ని తల్లి యెంతో ముచ్చటగా మురిపెంగా చూస్తుంది. బాణమును గుఱిపెట్టి బాణ ప్రయోగముచే అతి పెద్దవయిన సప్తపాల వృక్షములను కూల్చివేసిన వాడవయిన నీవు ఈ శ్రవణ నక్షత్రవేళలో తిరుమంజనానికి రమ్మనిపిలుస్తున్నది ఆ తల్లి. చిలిపి కృష్ణుని బాల్యక్రీడా వర్ణన సమయంలో శ్రీరాముడుగా సప్తసాల వృక్షములను పడగొట్టిన వైనం గుర్తుకు రావటం యిక్కడి విశేషం.

"ఎణ్ణెయ్ క్కుడ త్తెయురుట్టియిళమ్బిళ్ళైకిళ్ళియెఱుప్పి
కణ్ణెప్పురట్టివిళిత్తుక్కళగణ్డు శెయ్యుమ్బిరానే
ఉణ్ణక్కనిగళ్ తరువనొవికడ లోదవిర్పోలే
వణ్ణవుళగియనమ్బిమఙ్ఞన మాదనీ వారాయ్"—

ఆల్లరికృష్ణుడు గొల్లల యిండ్లకుపోయి అక్కడున్న నూనె భాండములను దొర్లించాడట! అంతటితో వూరుకోక - వూయలలో పడుకొని వున్న వారి పిల్లడిని చూచేందుకై వచ్చినవాడిలా దగ్గరికి వెళ్ళి - గిల్లి లేపాడట! అంతేనా! కంటిరెప్పను పైకి మడిచి చూపి భయపెట్టాడట కూడాను. యిటువంటి సహింప

రాని పనులను చేస్తే ఆయింటి వారికే కాదు, యెవరికయినా కోపం రాకమానదు. కానీ యశోద మాత్రం యిలాంటి పనులను బాల్యచేష్టలంటూ తలచుకొని మురిసి పోతుంటుంది. "యెవ్వరికీ లొంగని గుణంగల ఓ నా చిన్నికృష్ణా! యిప్పటికి దయచేసి నీవు నేను చెప్పినట్టు చేయాలి సుమా! నీకత్యంత ప్రియమైన నేతిపెడు పండ్లను నీకై దాచి వుంచాను. అలలతో ఘోషించే వుత్తుంగ తరంగ సాగర నీల జలము వంటి మేనుగల ఓ చిన్నికృష్ణా! నీ శరీరములోని మురికి పోయేలా స్నానం చేయిస్తాను రా"

కృష్ణునికి తలదువ్విన తరువాత పుష్పాలంకారము చేయబోతున్న యశోదను దూడలను మేపేందుకై కట్టి కావలెనని అడిగాడట! ఆమెకు కట్టి నివ్వటం యిష్టంలేక పోవడంతో కృష్ణుడు యేడువ నారంభించాడు. కుమారుణ్ణి బూరడించేందుకై తల్లి 'కట్టితీసుకురండ'ని అప్పటికి పురమాయిస్తూ కుర్రవాని యేడుపు మాపేందుకై సుందరసుగంధ పూరములయిన రకరకాల పువ్వులను కొప్పులో ముడుస్తాను రమ్మని పిలిచే "పూచ్చూడల్"- అనే రచనలో స్వామికి యిష్టమైన వివిధ జాతి పుష్పములనూ వుదహరించటం వుంది! ఇందరిని యిన్ని విధాలుగా ఆలరించే గోపబాలునికి ఆపదల నెదిరించటం వెన్నతో నేర్చిన విద్య. శకటాసుర వధ, పూతనవధ యిత్యాది సంఘటన లిందుకు వుదాహరణలు. సామాన్య మానవుల కతీతమయిన మహిమలను యెన్నింటినో నిత్యమూ చూపుతున్నా తల్లి యశోద దృష్టిలో మాత్రం అతడు అమాయకుడైన బాలపాపడే. సంధ్యాకాలం క్షుద్ర శక్తులకు ఆటవిడుపయిన సమయం. అటువంటి సమయంలో ఆటుయిటూ తిరుగక సంధ్యరక్ష కట్టించుకుంచుకు రావయ్యా! అని బ్రతిమాలుతూ పిలిచే యశోదలో పరిపూర్ణ మాతృహృదయం మనకు కనిపిస్తుంది.

ఒడియా సాహిత్యంలోనూ కృష్ణలీలావర్ణనల ద్వారా వాత్సల్య రసపోషణ జరిగింది. 'జగన్నాథదాసు' అన్న కవియూ రీతిగా సుప్రసిద్ధుడు. 'బృందావతిదాసి' అన్న కవయిత్రి 'పూర్ణతమచంద్రోదయం' అన్నకావ్యంలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలను అత్యంత మనోహరంగా వర్ణించింది. 'దీనసుందరి' అన్న మరో కవయిత్రి కూడా యీ వర్ణనలో సుప్రసిద్ధురాలే.

యిక తెలుగు సాహిత్యంలో శ్రీమద్భాగవత రచనాకారుడు పోతనామాత్యుడు వాత్సల్య రసపోషణలో దిట్ట. చిన్నికృష్ణుడు మన్ను తిన్న సందర్భంలో

"మన్నేటికి భక్షించెదు
మన్నియమములేల నీవు మన్నింపవు నీ

యన్నయు సఖులును జెప్పెద
రన్నా ! మన్నెల మఱి పదార్థము లేదే ?''—

ఆని యశోద ముందు తల్లిగా దండిస్తుంది. కానీ తాను మన్ను తినలేదనీ, కావాలంటే చూచుకొమ్మని కృష్ణుడు నోరు తెరవగా ఆనోటిలో ముల్లోకములూ దర్శనమిచ్చాయి. ఆ క్షణాన ఆశ్చర్యచకితురాలైన ఆ తల్లి - ఒక్కక్షణం బిత్తర పోయిందట ! 'కలయో వైష్ణవమాయయో'- ఆని నిరుత్తరురాలైన ఆ క్షణంలో భగవదవతార రహస్యం ఆమెకు బోధపడింది. వెనువెంటనే మాయామోహితురాలై చిన్నిపాపడినోట్లో ముల్లోకాలూ కనబడటమేమిటి ! యిదేదో దుష్టశక్తి చేష్ట-' ఆని హడావిడి పడిపోయి బాలునికి దిష్టితీసివేస్తు దట !

''పట్టిన పట్టువడని నిను
పట్టెదమని చలము కొనిన బట్టుట బెట్టే
పట్టుపడవండ్రు పట్టీ
పట్టుకొనన్ నాకుగాక పరులకు వశమే ?''

యిలా తన వాత్సల్యానురాగాలతో భగవత్ స్వరూపుడయిన చిన్నికృష్ణుని బంధింప జూచిన యశోదతో అతడు ఆడిన దాగుడుమూతలు యెన్నో యెన్నెన్నో !

నందగోకులంలోని ప్రతి యిల్లూ బాలకృష్ణుని క్రీడామందిరమే ఆయింది. అందులో అతడు చేయని అల్లరి లేదు. ప్రతి గోపబాలకుడూ బాలకృష్ణుని స్నేహసౌహార్దాలను అత డందించిన పాలువెన్నలతో సమానంగా బ్రుక్రుకొన్న వాడే! గోప భామినులంతా యశోదావల్లభుని వల్ల మాలిన దుడుకు చేష్టలను యెప్పటి కప్పుడామెకు ఫిర్యాదు చేస్తున్నా తల్లికి మాత్రం అతడు పొరుగిండ్ల శ్రోవ యెరుగని పసిబాలుడే ! పోనీ అతని చేష్టల నన్నా 'బాల్యక్రీడల'ని పదిలివేద్దామా అంటే ఆదీలేదు !

కం. ఆడంజని మీగడ పెరుగోడక
నీ సుతుడు త్రావి యొక యించుక తా
గోడలి మూతిం జరిమిన
గోడలు త్రుచ్చనుచు న తగొప్పె లతాంగీ !

క. వేలుపులచె నాకంచెను
వేలుపు మఱి యెవ్వడనుచు వికవిక నగి మా
వేలుపుల గోడపై నో
హేలావతి నీ తనూజు డెంగిలి చేసెన్ ।

ఆ. నమ్మి నిదురపోవ నా పట్టిచుంచు మా
లేగతోక తోడ లీలగట్టి
పీఠులందు దోలె వెలది । నీకొమరుండు
రాచబిడ్డడయిన అవ్వ మేలె ।

క. నాపట్టి పొట్టనిండగ
బైవడి నీ పట్టి వెన్న బానెండిడినా
డూపిరి వదలదు వానిం
జూపెద నేమైన నీవ నుమ్మ లతాంగీ!

యిలాంటి వయసుకు మించిన పనులతోపాటు పిన్నలు పెద్దలూ సైతం చేయలేని అనేకమైన సాహసోపేత కృత్యాలను తలపెట్టుకుంటే-యితడు సామాన్య బాలకుడు కాదుసుమా ! అనిపింపజేస్తాయి. పూతనా సంహారం, శకటాసురధమనం, తృణావర్త మరణం వంటి సంఘటనలు యెప్పటికప్పుడు శ్రీకృష్ణుని అవతార రహస్యాన్ని కొంతవరకూ వెల్లడిస్తున్నా ఆ సంఘటనలు జరిగిన వెంటనే ఆవరించే విష్ణుమాయ వారిని మభ్యపెడుతూంది. నలకూబర మణిగ్రీవుల విమోచనానంతరం చిన్ని కృష్ణుడు చూపిన చాకచక్యమెటుపంటిదో చూడండి !

శా. పాడున్ మందుని భంగి గోపవనితల్ పాణిధ్వనుల్ సేయగా
నాడున్ జంత్రముకైవడిన్ బరవళుండై హస్తముల్ ద్రిప్పుచున్
జూడన్ నేరని వాని భంగి జనులన్ జూచున్ నగున్ బాలురన్
గూడున్ బెద్దల పంపు సేయ జను డాగున్ తూగు జిట్టాడుచున్.

క. భిక్షులు వచ్చెద రేడ్చిన
భిక్షాపాత్రమున వేసి బెగడించి నినున్
శిక్షించెదరని చెప్పిన
భిక్షంగని తల్లి నొదిగి భీతిల్లు నృపా ।

యింకా యిలాంటి అనేకానేక వర్ణనలలో అత్యద్భుతంగా వాత్సల్య రసావిష్కరణం గావించిన పోతన రచనాసామర్థ్యం అభినందనీయం.

కన్నడ సాహిత్యంలోనూ వాత్సల్య రసపోషణ పుష్కలంగానే వుంది. సుప్రసిద్ధ పద సంకీర్తనాచార్యుడు. పురందరదాసుని రచనలలో బాలకృష్ణుని వర్ణన అత్యంత కమనీయం. వివిధ సందర్భాలలో ఆ లీలామానుష వేషధారుని పలురీతుల వర్ణించి చదువరుల నానంద పులకితులను చేశా డాయన.

"జగదోద్ధారణ ఆడిశిదళెళోదె"
జగదోద్ధారన మగనెందు తిళియుత
సుగుణాంతరంగన ఆడిసిదళెళోదె"

ఈ కృతిలో జగద్రక్షకుడైన బాలకృష్ణుని యశోద ఆడించిందంటూ జగత్కర్త అయిన కృష్ణపరమాత్ముని పాపడిగా పొందిన ఆ యశోద పూర్వజన్మ సుకృతాన్ని కొనియాడుతున్నా డన్నమాట !

పు॥ 'పిళ్ళంగోవియ చెల్వకృష్ణన ఎల్లినోడిదిరీ రింగన ఎల్లినోడిదిరీ'

ఆను॥ 'ఎల్లినోడిద రల్లి తానిల్ల బిల్లవెందు బల్ల దాణరు'

పిల్లనగ్రోవి చేతబట్టిన చిన్నికృష్ణుని మీరెక్కడయినా చూచారా అన్న ప్రశ్నతో మొదలిడి నందగోపకుల మందిరాలలో గోపబాలుర బృందంలో సుందరీ బృందంలో నయినా అతని ఆచూకి వుండవచ్చునని చెబుతూ భాగవతులు పాడే భక్తిగాన పారవశ్యతలోనూ అతడు కనిపించవచ్చునంటున్నారు! దివరికి భక్తాగ్రేసరుడయిన పురందరదాసుని లోచనాగ్రములు కృష్ణుని నెలవులే కాబట్టి ఆక్కడయినా ఆతణ్ణి చూచారా అని ముగిస్తాడు. నిజమే! సమస్త జగత్తూ భగవంతుని ఆవాస స్థానమే అయినా అంతకన్నా సుఖకరమయినా ఆతనికి ప్రాణప్రదమయినదీ విజభక్త హృదయ కుహరమేగదా ! యిలాంటి వర్ణనలతోగూడిన కృతులు పురందరుని రచనలలో కోకొల్లలు.

ఈవిధంగా వివిధ భాషాభక్తి సాహిత్యాలన్నింటా వాత్సల్య రసపోషణ సమర్థవంతంగా చేయబడింది.

సూరదాసు-అన్నమయ్య - సాహిత్యంలో వారి స్థానం

'సూర సూర తులసి శశి' అన్న నానుడి హిందీ సాహిత్యంలో సుప్రసిద్ధం. హిందీ సాహిత్యాకాశంలో సూరదాస్‌ను సూర్యునితో పోల్చారు. అంటే హిందీ సాహిత్యాన్నంతటినీ తన సాహితీ తేజస్సుతో ప్రభాభాసమొసరించిన కవి అన్న మాట! సూర్య భగవానుడు సకల చరాచర ప్రపంచానికీ వెలుగును ప్రసాదించేలా సూరదాస్ తన కవితా ప్రతిభతో హిందీ సాహిత్యక్షేత్రాన్ని ప్రతిభావంతమొనరించటమేకాదు. సుభిక్షితం చేశాడు. వల్లభ సంప్రదాయ సిద్ధాంతానుబద్ధుడైన సూరదాసు గురువుగారి సందేశానుసారం పూనుకొని రచించిన కృష్ణావతార గ్రంథం. సూరసాగర్, నిజంగా మహాగంభీర సాగరం వంటిది. అందులో మనకు లభ్యమయ్యే రతనాలు లెక్కపెట్టలేనివి. దానికి దగ్గట్టు మునక వేయగలిగే సామర్థ్యం మనకుండాలి అంతే. సూరదాసుని సాహిత్య ప్రభావితులై రచనలు చేసిన తరువాతి కవులలో చాలామంది అతని పలుకుబళ్ళను పదవిన్యాసాన్నీ యితోధికంగా దొంగిలించినవాళ్ళే.

పరపరిపాలనలో ప్రమగ్నులు, తమను యీ చెరసాల నుంచి తప్పించే వాళే లేరన్న బాధతో క్రుంగి కృశించే ప్రజలకు అప్పుడప్పుడే ప్రారంభమయిన భక్తి సాహిత్య స్రోతస్విని అమృతోపమానంగా తోచింది. వారి కన్నీళ్ళను తుడిచి, కష్టాలకడగండ్లను అంతమొనరించే భగవంతుని అస్తిత్వాన్ని బలపరుస్తూ దీనజన రక్షకుడైన ఆకరుణామయుడు 'యోగక్షేమం వహామ్యహం' అన్న తన పలుకులను సమర్థించుకోగలడనీ యీ కంటకమయయైన పరాధీనత నుంచి ప్రజలను తప్పక తప్పిస్తాడన్న ఆశ్వాసన నందించింది. నిర్గుణ నిరాకార రూపంలో భగవదనుభూతిని పొందటం కంటే భక్తజన మనోవిహారి అయిన ఆ జగద్రక్షకుని కీర్తిగానం వివిధ అవతార విశేషాలతో చేయటం, దుష్టశిక్షకుడు, శిష్టరక్షకుడుగా కీర్తించి అటువంటివానిని తమనీ ఆపదలనుంచి రక్షించమని వేడుకోవటం వారికి యిష్టంగా తోచింది. అలా ప్రార్థించటంలోనే ఒకవిధమైన మానసిక శాంతి వారికి అనుభూతమైంది. ఇలా అవతారమూర్తిగా జగత్ప్రభువును ప్రార్థించటంలోనూ ఒకవిధమైన వైవిధ్యం అవసరమైంది.

రావణ సంహారి శ్రీరామచంద్రుని గంభీరమూర్తిగా, మర్యాదా పురుషోత్తమునిగా సింహాసన స్థితుని చేసి పూజించిన తులసీదాసుని గంభీర భక్తి కంటే గోపబాలునిగా, చిలిపి కృష్ణునిగా బాల్యం నుంచే అతి భయంకరులైన అనేకమంది

అసురులను తుదముట్టించిన సాహసబాలునిగా, శ్రీకృష్ణుని వర్ణిస్తూ, ప్రజల మనసులను వశం చేసుకున్న సూరదాసుని స్నేహభక్తిసుగంధం ప్రజలను సమ్మోహితులను చేసింది. వినయాసుసంధానంతో స్వామి సేవకబంధంతో భగవత్ సామీప్యాన్ని అభిలషించటం కంటే స్నేహభావంతో అతని సామిప్య సుఖాన్ని కోరటం వారికి అనన్యమైన ఆనందాన్ని అందించింది. అందుకే కృష్ణభక్తి సాహిత్యం అతి త్వరితంగా వ్యాప్తి చెందింది.

కృష్ణభక్తి సాహిత్యం ప్రచారానికి ముఖ్యకారకుడు 'సూరదాస్' అని చెప్పవచ్చు. అంటే అతనికి పూర్వం కృష్ణగాథను కథాంశంగా స్వీకరించిన భక్తకవుల రచనలు లేవా? అన్న సందేహం రావచ్చు. కానీ వారందరికంటే అతిసమర్థవంతంగా అత్యంత సహజ సుందర రీతిలో కృష్ణావతార ఘట్టాలను అనేకానేకాలంకారాలను పొదిగి రచించి సాహిత్య సరస్వతికి కలికితురాయిని అందించిన సూరదాసుని రచనా సామర్థ్యం అంతగా హిందీ సాహిత్యాన్ని ప్రభావితం చేసిందన్నమాట! ఆయన ప్రతిభా పాటవాలముందు, తక్కిన కవులందరూ అనన్యసామాన్యమైన సూర్యతేజస్సుముందు పేలవమైపోయే నక్షత్రకాంతిలా నిలిచిపోయారు. సూరదాసును అందునిగా చరిత్రకారులు చెబుతున్నా అతని మనోనేత్రం అతి తీక్ష్ణమైనది. ఆతని దృష్టికి అందని భావం లేదు. అతని బుద్ధికి తోచని వైవిధ్యం లేదు. ఆతడందుకొనని శైలీమాలలు లేవు. మరి ఆత డెలా అందుదవుతాడు? బాల్య యవ్వన కౌమారావస్థలకు సంబంధించిన అన్ని ముచ్చటలనూ అన్ని వర్ణవిచిత్రాను భవాలనూ తాననుభవించినట్లే వర్ణించా డాయన. స్త్రీ మనోభావచిత్రణలో అతని కతడే సాటి! అందుకే ఆధునిక విమర్శకులందరి మన్ననలనూ పొందా డాయన. సుప్రసిద్ధ రచయిత రామచంద్రశుక్లా-సూరదాస్ కవిత్వం గురించి వ్రాస్తూ-'ఈ అంధకవి వాత్సల్య శృంగార రస వర్ణనలోని ప్రతి మలుపులోనూ మెరుపులను చూపించాడు' అన్నారు.

పిల్లలు భగవదస్తిత్వానికి ప్రతీకలు. వారి కన్నులలో సృష్టిసౌందర్యాలన్నీ దర్శనమిస్తాయి. వారి మాటలలో దేవ రహస్యం వెల్లడౌతుంది. వారి సామీప్య సుఖాన్ని మనసారా తనివితీరా అనుభవించేవారు భగవదనుభూతిని పొందగలరు. సూరదాస్ విషయంలో భగవంతుడయిన శ్రీకృష్ణుడే ఆతని మనసు నాక్రమించాడు, ఇక ఆతని వర్ణనలు సామాన్యమెలా అవుతాయి?

ముఖ్యంగా సూరదాసునిది మాతృహృదయం. నిస్వార్థభావనతో సంతానానికి సేవ చేసేది తల్లి. అందుకే సూరదాసు యశోద పాత్రచిత్రణ సార్వజనీనంగా సాగించి, కేవలం యశోదా నందుల వాత్సల్యవర్ణనేకాక వారి పరివారజనులు కృష్ణుని పట్ల కురిపించే ప్రేమానురాగాలను కూడా వర్ణించటం వల్ల సూరదాసుని వాత్సల్య రసవర్ణన అంతులేని విస్తృతిని పొందింది. అంతేకాక బాల్యదశలోని పిల్లల మనోభావాలు యెప్పుడు యెలావుంటాయో అద్దంవేసి వెదికినట్టుగా పట్టుకొని వారి ప్రతి చర్యనెనకా వున్న సూక్ష్మాతిసూక్ష్మ భేదాలను అతి చాకచక్యంగా మన ముందుంచాడాయన. ఈ విధంగా మనోవైజ్ఞానిక దృష్టితో బాల ప్రవృత్తులను వర్ణిస్తూ రసదశ వరకూ తీసుకుని వెళ్ళటం, సామాన్యకవులకు దుస్సాధ్యం. అందుకే సూరదాస్ హిందీ సాహిత్యంలోనేకాదు, మొత్తం విశ్వసాహిత్యంలోనే కవికులతిలకుడని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఇక అన్నమయ్యను గురించి. అన్నమయ్యను చదవనివారికి తెలుగేరాదన్న వేటూరి ప్రభాకరశాస్త్రిగారి మాటలను యీ సందర్భంగా మననం చేసుకోవటం అవసరం.

హిందీ సాహిత్యంలో సూరదాసునిలాగే తెలుగు సాహిత్యరంగాన్ని సకల విధాలా ప్రభావితం చేసి అన్నమయ్య లేనిదే తెలుగు కవిత్వం లేనేలేదన్నంత కీర్తి ప్రతిష్ఠలను సంపాదించుకొన్న కవి వేరొకరులేరనటం సాహసం కాదేమో! తెలుగు పలుకుబళ్లు, సుడికారాలు, సామెతలు, లోకోక్తులు, జాతీయాలను కుప్ప తెప్పలుగావాడి తెలుగుభాషా సర్వస్వంగా నిలిచిన ఆ మహనీయుని రచనలు కేవలం భాషాపరంగానేకాక రచనా పరంగానూ అంతటి ఔన్నత్యాన్ని కలిగివున్నాయి.

తనకు పూర్వమున్న ప్రాచీన పదకవితాపద్ధతులు క్లిష్టంగా వుండి, అనుసరించ వీలులేని పరిస్థితుల్లో అలనాటి వైష్ణవ కన్నడ భక్తులు అనుసరించిన పద రచనా శైలిని అనుసరించి రచనలుచేసి అందులో తన నైపుణ్యాన్ని అతి నేర్పుగా ప్రదర్శించాడాయన. ముఖ్యంగా వైష్ణవ సంబంధమైన ఆళ్వారుల రచనలు ప్రజలకు అతి సన్నిహితంగా వుండటం గమనించి తనదైన తెనుగు భాషలో అలాంటి రచనలే చేయ సంకల్పించి కృతకృత్యుడైనాడు. ఫలితం-అన్నమయ్య పదం ఒక్కటయినా రాని తెలుగువాడు తెలుగునాట లేడీనాడు. జాజరులు, చందమామ పదాలు, తుమ్మెద పదాలు, మేలుకొల్పులు, మంగళాచరణాలు, ఆల్లోనేరెక్కు, ఏలపదాలు, జోలపాటలు, తరునోజలు-యిలాంటి యెన్నో ప్రయోగాలను తన పదాలలో

వుపయోగించి అన్నిటా తానై మెలిగిన అన్నమయ్య రచనా సామర్థ్యానికి ఆశ్చర్య వొందని వారుండరు. 'సంగీత సాహిత్య కళానిధి'గా అన్నమయ్య చేపట్టని ప్రక్రియ లేదు.

మోక్షసాధనకు యెన్నో మార్గాలున్నా వాత్సల్య, శాంత, దాస్య, సఖ్య, మధుర భావాలకు అత్యంత ప్రాధాన్యత నిచ్చి పదాలను రచించాడాయన ఆయన రచనలకు మూలం తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి. ఆ స్వామిని ఆధారంగా వుంచుకొని, ఆయన అల్లిన 24వేల పదాలలో ఒకదానికంటే మరోటి విపరీతమయిన వైవిధ్యంతో దర్శనమిస్తుంది కేవలం ఆరడుగుల విగ్రహం-ఆగాధ సముద్రమంతటి భావ విస్తరణకు మూలభూతమవటం మనల్ని ఆశ్చర్య చకితులను చేస్తుంది. తాను సర్వస్వంగా భావించిన వేంకటేశునితో తన ఆరాటాలను, ఆవేదనలను, ఆవేశాలను విప్పి చెప్పుకునేటప్పుడు ఒక మారు పరమ భక్తాగ్రేసర చక్రవర్తిగా విన్నపాలు చేసుకున్నారు; మరోమారు ప్రాణప్రదమయిన ప్రియురాలిగా ప్రక్కన చేరాడు; ఇంకోమారు భక్తి భావ తత్పరతతో భగవద్దర్శనం కోసం వేచి వేచి వేసారిన హృదయక్షోభను ఘాటైన మాటలలో వివరిస్తూ వేంకటేశునికై ఆలిగి ఆయనను తూలనాడాడు; మరోమారు తన తప్పుకు తానే సిగ్గిల్లుతూ క్షమించమని పాదాలపై పడి వేడుకుంటాడు. మానవ సహజమైన మనో వికారాలను దూరం చేసి తనను బంధవిముక్తున్ని చేయమని వైరాగ్య భావాన్ని వ్యక్తం చేస్తాడు. ఇన్ని రీతుల హృదయాన్ని కదిలించి, కవ్వించి, మైమరపింప చేయగల ఆయన ఆత్మాశయ కవిత్వం మనల్ని సమ్మోహితుల్ని చేస్తుంది. ఆయన హృదయం విప్పి పాడిన ఆ పాటలే తెలుగువారికి జాతి సొత్తుగా లభించిన రసగుళికలు. ఆయన భక్తి శృంగార ఆధ్యాత్మిక సంకీర్తనలు - తెలుగు సాహితీమతల్లికి రమ్యనీరాజనాలు.

ఆందుకే అటు హిందీ సాహిత్యాకాశంలో సూర్యతేజో సమానుడయిన సూరదాసు. తెలుగు సాహితీ క్షేత్రాన్ని సకల విధాలా సుసంపన్నంచేసి తెలుగే తానుగా మెలిగిన అన్నమయ్య-పీరిరువురూ చేసిన వాత్సల్య రసపోషణను గురించి తెలుసుకోవడం ప్రస్తుతాంశం.

సూరదాస్ వాత్సల్య రసపోషణ

అవతార పురుషుల జనన సమయాన్ని గురించి రెండు భిన్నాభిప్రాయాలున్నాయి. ఒకటి-వారి జన్మదినాలు శుభప్రదమైన లగ్నాలూ ఘడియలూ చూసు

కుని మరీ వస్తాయన్నది. ఆశ్రిత జనవత్సలుడూ మర్యాదాపురుషోత్తముడూ ఐన శ్రీరామచంద్రమూర్తి జననం చైత్ర శుద్ధనవమి రోజున శుభనక్షత్రయుక్త లగ్నంలో జరిగింది. శ్రీమహావిష్ణువులో సాక్షాత్తు అర్ధభాగం శ్రీరామచంద్రునిగా అవతారం దాల్చినదన్నమాట! అలాగే మిగిలిన విష్ణ్వంశావతారాలైన లక్ష్మణ భరత శత్రుఘ్నులూ-శుభనక్షత్రయుత లగ్నాలలో జన్మించారు. అలాంటివారి ఆవతార ఘట్టాన్ని శ్రీమద్రామాయణంలో మహాకవి వాల్మీకి అతి హృద్యంగా వర్ణించాడు.

గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతమ్
కౌసల్యాఽజనయద్రామం సర్వలక్షణ సంయుతమ్
విష్ణోరర్ధం మహాభాగం పుత్రమైక్ష్వాక వర్ధనమ్
కౌసల్యా శుశుభే తేన పుత్రేణామిత తేజసా
యథావరేణ దేవానా మదితిర్వజ్రపాణినా
భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః
సాక్షాద్విష్ణో శ్చతుర్భాగః సర్వైసముదితో గుణైః
అథ లక్ష్మణ శత్రుఘ్నౌ సుమిత్రాజనయత్ సుతౌ
వీరౌ సర్వాస్త్ర కుశలౌ విష్ణోరర్ధ సమన్వితౌ
పుష్యేజాతస్తు భరతో మీన లగ్నే ప్రసన్నధీః
సార్పే జాతౌతు సౌమిత్రీ కులీరేభ్యుదితే రవౌ

శుభ లగ్న శుభకరణ శుభయోగంలో జన్మించటమేకాక, వారి జననవార్తను విన్న పురజనుల సంతోషాతిరేకాలను అతి వాస్తవికంగా వర్ణించాడు వాల్మీకి.

ఆలాగే కుమారసంభవంలో మహాకవి కాళిదాసు కూడా పార్వతీదేవి జన్మ సమయాన్ని అత్యద్భుతంగా వర్ణించాడు.

ఇది యిలా వుండగా మహనీయుల ఆవతారవర్ణనను గురించిన మరో అభిప్రాయం యిందుకు పూర్తిగా భిన్నం. వారి జన్మసమయాల్లో అనేక వైపరీత్యాలు తోడు గూడి వస్తాయట! కుమారస్వామి తేజస్సును గర్భంలో మోయలేని అశక్తురాలై పార్వతీదేవి మొర పెట్టుకుంటే అగ్ని ఆ తేజోమయ పిండాన్ని

ధరించాడట! అంతేనా! అతని ఆలన పాలనా-కన్న తల్లి ఒడిలో గారాలపోతూ కాక-షణ్మాతృకల పోషణలో జరిగింది. ఆలాగే కృష్ణావతార ఘట్టం కూడా. భాద్రపద కృష్ణపక్ష అష్టమి కన్నుపొడుచుకున్నా కానరాని భీకర కాళరాత్రి, వురుముల మెరుపులతో కుండపోతగా వర్షం మరోవైపు, తల్లిదండ్రుల భయం శోకనల మధ్య భూమిపై కాలిడిన ఆశిశువుకు ఆప్పటికప్పుడే మృత్యుభయం.

కన్నకొడుకు ప్రథమ రోదనం వినగానే ఆ తల్లిదండ్రులు రోమాంచితులయ్యారు అది తమ కడుపుపంట పండిన సంతోషంతో కాదు. ఈ పసివాని యేడుపు యే కాపలాదారుని చెవిని బడినా మరునిముషంలో ఆ పాపడి మరణం ఖాయమేనన్న నగ్నసత్యం వారికా ఆనందాన్ని దూరం చేసింది. కడుపున పుట్టిన చిన్నారి తండ్రిని కనులారా చూచుకుని మురిసిపోవలసిన తరుణంలో కన్నతండ్రే తల్లిపొత్తిళ్లనుండి బిడ్డను వేరు చేయవలసిన దుస్థితి యేర్పడింది. నులివెచ్చని తల్లి కౌగిలిలోని మాతృహృదయ స్పర్శను పూర్తిగా ఆనుభవించక ముందే పుడమిపై కాలిడిన మరుక్షణంలో మూడోకంట పడకుండా నిజ ప్రాణరక్షణకై మరో యింట అడుగిడవలసివచ్చిందా పసిగుడ్డుకు! అంతేనా! యశోదానందనునిగా గోకులంలో మారుమూల కుగ్రామంలో పెరుగుతున్నా ఆపదలు ఆతణ్ణి వెన్నంటే వున్నామన్నాయ్! యెన్ని ఆవాంతరాలు! ఎన్నెన్ని గండాలు! దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షులా పెరిగాడు కృష్ణుడు. రోజుకోవిధంగా దానవ సంహారం చేస్తూ-యెప్పటికప్పుడు తాను సాధారణ బాలుణ్ణి కానన్నరహస్యాన్ని వెల్లడిస్తూనే-మరునిముషంలో ఆ గొల్ల వారిపై విష్ణుమాయను చల్లి అందరి కుర్రాళ్లలాగే అల్లరి పనులు చేసి వారిని మురిపించే ఆ లీలామానుష వేషధారుని బాల్యజీవితమే ఒక రసవత్కావ్యం. మన్నుతినే చిన్నితనయునిగా యశోద కోపకారకుడవుతూనే ఆమెకు-అవతారరహస్యాన్ని తెలియబరచిన ఆ మాయాస్వరూపుని లీలలు యెన్నని చెప్పగలం? సూరదాసుని రచనా చాతుర్యం చిన్నికృష్ణునిపట్ల దేవకీ వసుదేవులు మొదలు ఆబాలగోపాలమూ ప్రదర్శించిన అపార ప్రేమాతిశయాలను అత్యద్భుతంగా వర్ణించటంలో అతనికి సాటి మరొకరు లేరన్నంతగా సూరసాగర్ మహత్కావ్యంలో విజృంభించింది.

కన్నులయినా తెరవని పసికందుని పొత్తిళ్ళనుంచి వేరుచేసి భర్తకందించిన దేవకీదేవి మాతృహృదయం యెంతటి సంక్షోభానికి గురైవుంటుందో ఒక్కమారు ఆలోచించి చూస్తే గుండె తరుక్కుపోతుంది. సామాన్య మానవులకు దుర్లభమైన

ఆ వరాన్ని అనేక జన్మల పుణ్యఫలంగా పొందినా-కారణాంతరాలవల్ల ఆదిపురుషుడయిన పరమాత్ముని కన్నతల్లిగా ఆ భాగ్యాన్ని పూర్తిగా అనుభవింపలేక పోతున్నందుకు ఆమె మనసు యెంతగా తల్లడిల్లి వుంటుంది? కానీ విధి లేదు. నవమాసాలూ మోసి- రక్తంలో రక్తంగా పెరిగిన ప్రతి బిడ్డా తన కళ్ళముందే చిత్రవధకులోనై అసువులు కోల్పోతూవుంటే కనీసం యీ బిడ్డడి క్షేమాన్నయినా కాంక్షించి 'యెక్కడో ఒకచోట సవ్యంగా బ్రతికితే చాలు'నన్న తృప్తే మహద్భాగ్యంగా భావిస్తుంది దేవకీదేవి. కంసుని కరవాలం నుంచి బిడ్డడిని రక్షించే మార్గం మరోటిలేదని భర్త వసుదేవుడు చెప్పగానే ఆ తల్లి కంటనీరు వెల్లువై వురికింది.

వెసొకా సమరధ్ త్రిభువన్‌మే - జోయహ్ బాలక్ నేక్ వుబారై
ఖడ్గ్ ధరై ఆవై, తువదేఖత్, అపనై కరభిన్ మాహైపఛారై
యహ సునతహి అకులాయి గిరీధర్, వైన్ నీర్ భరిభరిదోవుఢారై

ఆటువంటి తరుణంలో విష్ణుమాయా మోహితులై కాపలాదారు లెక్కడి వాళ్ళక్కడే నిద్రానిమగ్నులయ్యారు? దేవకీ వసుదేవులకు భగవంతుని దివ్య మంగళ విగ్రహాన్ని కనులారా చూసే అవకాశం! ఎన్నో సంవత్సరాల తపఃఫలితంగా పరమాత్ముని గర్భంలో ధరించిన అదృష్టాన్ని పొందికూడా అంతలోనే ఆ మహదవకాశాన్ని దూరం చేసుకుంటున్న దేవకీవసుదేవులకు కొంతలో కొంత తృప్తి!

ఆపై యిక అప్పటి వాతావరణం వాత్సల్య రస వర్ణనకు అనుకూలంగా లేదు. కృష్ణుని గోకులంలో నందునియింట చేర్చేంతవరకు సూరదాసుని కలం వూరుకోక తప్పలేదు. ఇక యిప్పుడు యశోదానందనుడైన చిన్నికృష్ణుని రస వత్తరమైన బాల్యక్రీడల వర్ణనలో సూరదాసుని కలానికి యేమాత్రం తీరిక లేనంత పని కల్పించబడింది. కృష్ణావతార రహస్యం యేమాత్రమూ యెరుగని ఆమాయక నందగోపవోరుల మధ్య ఆతని లీలావిశేషాలకు అంతులేదు.

ఒక తల్లి కడుపున పుట్టిన బిడ్డ మరోయింట దీపమై వెలసింది. దేవకి నోములపంట యశోదయింట వెన్నెల వెలుగులను విరజిమ్మింది. కన్నతల్లి వాత్సల్యానురాగాలకు దూరమైనా అంతకంటే మించిన ఆప్యాయతానుబంధాలు గోకులంలో ప్రాప్తించాయి. పొత్తిళ్ళలో ఒదిగిన పాపాయిని పక్కలో చూడగానే, యశోద మాతృహృదయం ఆనంద సాగరమే అయింది. హర్షపులకాంకితయైన ఆమె గొంతెత్తి నందుణ్ణి పిలిచిందట!

జోగీ మహరి పుత్రముఖ్ దేఖ్యో పులక్ అంగ్ ఫుర్ మే న సమాయి
గద్‌గద్‌కంఠ్ బోలనహి ఆవై హర్షవంత్ హై వద్ బులాయి-

యశోద యింటి పుత్రజనన వార్త విన్నతోడనే గోపులంలో అంతులేని సంచలనం. వందిమాగధులు ప్రస్తుతి గీతాలు పాడారు. బ్రాహ్మణ బృందాలు ఋషి సమూహాలు ఆశీర్వాదాలు వినిపించారు. నందుని గృహప్రాంగణమంతా వర్ణవర్ణ పుష్పాలలో అలంకరింపబడుతూ వుంది! పూరా వాడా అంతా ఏకమైవుంది. ఆలాంటి సమయంలో అక్కడికో అపరిచితుడైన ముదుసలి వచ్చాడు. నందుని యింటినుంచి రకరకాల కానుకలతో వెళుతున్న యాచక బృందాలను చూచాడు. అక్కడికి చేరుకున్నాడు. కానీ అతడు సామాన్య యాచకునిలా లేడట! యశోదానందనుని బాల్యక్రీడలను కనులారా తిలకించి జన్మ పునీతంచేసుకోవాలని ఆ గ్రామానికి వచ్చాడట అతడు! అంతవరకూ ఆదేచోట వుంటానంటాడు. యింతకూ అతడెవరు?

హాఁ తౌ తేరే ఘర్‌కౌ ధౌఢీ సూరదాస్ మోహినావూఁ-

ఈ మహత్కావ్య రచయిత సూరదాసే, ఆ ముదుసలి రూపంలో, నంద గోకులంలో ఆడుగు పెట్టాడన్నమాట. యింకేం, చిన్నికృష్ణుని బాల్యక్రీడలను కన్నులారా చూసే మహద్భాగ్యమేకాదు. ఆ క్రీడలనన్నింటినీ యథాతథంగా వర్ణించి సాహిత్యాకాశంలో శాశ్వత కీర్తి ప్రభలను నిలుపుకొన్న ఆ పుణ్యపురుషుని పూర్వజన్మ సుకృతాన్ని ఎలావర్ణించగలం! ఏమని ప్రస్తుతింపగలం?

ఇక గోకులంలో కృష్ణజనన వార్త అంచలంచెలుగా పాకిపోయింది. చిన్ని బాలుని చూడాలన్న ఆతృతతో గోపికలందరూ నందుని యింటికి వెళ్ళేందుకు తమనుతాము విధవిధాలుగా అలంకరించుకుంటున్నారట! ఒకరిని మించి మరొకరు. తమను తాము అలంకరించుకోవటమేకాదు. తమతమ యిళ్ళనూ వీథులనూ కూడా నయానానందకరంగా తీర్చిదిద్దారు. అందుకే గోకుల వీథులన్నీ వర్ణవర్ణ కాంతులతో రంగురంగుల హరివిల్లుల్లా ముచ్చట గొలిపాయట!

"సోభా సింధు న అంత్ రహీరే
నందభవన్ భరిపూరి వుమంగ్ చవి
బ్రజ్‌కీ పీథిన్ ఫిరతి బిహారీ"-

ఈ సుందర దృశ్యాన్ని చూచి జన్మ చరితార్థమయ్యేందు కన్నట్లు స్వర్గ వాసులైన దేవతలు కూడా తండోపతండాలుగా యీ ఉత్సాహ సముద్రాన్ని వీక్షిస్తున్నారట! ఆనందాతిరేకంలో గోమాతల - క్షీరధారలు వెల్లువలై పారుతున్నాయి! యమునా నదీ తరంగాలు పువ్వెత్తున ఎగసి పడుతున్నాయి. యెప్పుడెప్పుడు చిన్నారి కృష్ణుని పదస్పర్శ చేసుకుందామా అని! యింత కోలాహలాన్నీ కళ్ళకు కట్టినట్లు వర్ణించిన సూరదాసుని మనోనేత్రం ఎంత సునిశితమైనదో ననిపిస్తుంది. ఒకవిధంగా యిలాంటి వర్ణనలలో భారతదేశ సంస్కృతికి అద్దం పట్టిన వైనం అపూర్వమనవచ్చు.

ఇక బాలకృష్ణుని లీలలలో వేసే పండుగను సూరదాస్ యెలా వర్ణించాడో చూద్దాం. పసిబాలుడైన ఆ పాపడు పూతలలో చేరిన నాటినుంచే అతని అవతార విశేషాలు బయటపడటం మొదలు పెట్టాయి. ఒక వంక తల్లి యశోదను బాల్య చేష్టలతో ఆలరిస్తూనే - మరోవైపు దుష్టదానవ సంహారంచేసిన ఆ విష్ణ్వంశ సంభూతుని లీలలు మనలను ఆశ్చర్య చకితులను చేస్తాయి. అంతకు మించి ఆయా సంఘటనలను అతి సమర్థవంతంగా వర్ణించి చదువరులను ఆయా అనుభూతులను పొందేంతగా విజృంభించటంలో సూరదాస్ సిద్ధహస్తుడు.

యశోద చిన్ని కృష్ణుని లీలలలో పరుండబెట్టి జోకొడుతోంది-వూరికే కాదు. లాలిపాటలు పాడుతూ ఆమె పాటలో వాత్సల్య రసం ఓతప్రోతంగా తొణికిసలాడుతూంది. మరి తల్లి పాటను ఆలకిస్తూ పడుకుని వున్న కన్నయ్య ఏంచేస్తున్నాడు. ఒక్కొమారు కన్నులు మూసుకుంటాడు. మరోసారి పెదవులు కదిలిస్తాడు. యింకోసారి తల్లి వైపు చేతులు చాస్తాడు. యీ చేష్టలను చూస్తున్న తల్లి మనసు ఆనంద సంద్రమే ఆయింది. సరిగ్గా యిదే సమయంలో పూతన ప్రవేశం... ఎంతసేపయినా నిద్రపోక ఆటపట్టిస్తున్న కృష్ణుణ్ణి-తాను నిద్ర పుచ్చుతానంటూ ఆప్యాయత నటించి గోప వనితావేషంలో వున్న పూతన ఒడిలోకి తీసుకుంది. ఆమె ఆంతర్యాన్ని గమనించని అమాయక యశోద యేమీ అనలేకపోయింది, కానీ సర్వజ్ఞుడయిన బాలుడు పూతనకు తగినశాస్తి చేశాడు.

యీ దృశ్యాన్ని కినుకారా చూచిన యశోదకు ఆ బాలుడు కేవలం పసిబిడ్డడుగా తోస్తాడే గానీ-ఆతనిలో అలౌకికత కనిపించనే లేదు.

'జసోదా ఖికర్ థయీ ఖిన్ కలనా
లేహు వుఠాయి హూలేనా వుల్తే-
మేరో సుథగ్ సాఁవరో కలనా'-

ఈ సంఘటన తరువాత బకాసురవధ. అప్పుడు కూడా యశోద సత్యాన్ని గుర్తించలేక పోయింది. ఒకరోజు పూయలలో పడుకుని వున్న బాల కృష్ణుడు తన కాలి బొటనవేలిని నోటపట్టి కాళ్లు చేతులూ అటూ యిటూ తాడిస్తూ-కేరింతలు కొడుతున్నాడు. యింకేముంది సమస్తలోకాలనూ చిన్నారి కడుపులో పొదువుకున్న ఆ లోకాధినేత యీ చేష్టలో-సృష్టి, ప్రకావికలైంది. "ఉథరత్ సింధు ధరావత్ కాంపత్"-సముద్రాలు ఎగసెగసి పడుతున్నాయి, ధరణి కంపిస్తూంది. తన కుమారుని ఆలాంటి ముద్రలో చూసిన తల్లిమనసు ఆనందంతో తలమునక లయిందేకాని - సృష్టిలోని యీ కలకలాన్ని గమనించ లేకపోయింది. యింతలో శకటాసుర ఆగమనం. బాలకృష్ణుని పదఘట్టనంలో అసుర దమనం. యిదంతా చూస్తున్నా యశోద కృష్ణుని అవతార పురుషునిగా గుర్తించలేక పోయింది. "ఉన్ బ్రజ్ వాసిని బాత్ నజానీ"-గుర్తిస్తే యిక వాత్సల్య రసపోషణకు తావెక్కడిది! భక్త మార్కండేయునికి యీ ముద్రలోనే దర్శన మిచ్చినప్పటి ప్రళయ సంకేతం, యీ సందర్భంలో గుర్తుకు వస్తుంది.

శిశువు ప్రతి చేష్టా తల్లిదండ్రులకి ఆనందదాయకంగానే వుంటుంది. ఆ ఆనందాన్ని పరస్పరం పంచుకుంటే తప్ప-వారికి తృప్తిగా వుండదు. మొట్ట మొదటిసారి కృష్ణుడు బోరగిల పడినపుడు యశోదానందుల ఆనందాభివ్యక్తి ఎలా వుందో గమనించండి.

యశోద తనయుణ్ణి నిద్రపుచ్చి యిటి పనులలో మునిగివుంది. సరిగ్గా అప్పుడే కృష్ణుడు బోరగిల పడటం నందుని కంటబడింది. యింకేముంది! అంతు లేని ఆనందంతో యశోదను గట్టిగా పిలిచాడు. తనయుణ్ణి ఆ ముద్రలో చూచిన తల్లిమనసూ సంతోష సంభ్రమే అయింది,

'మహరి మడిత్ ఉలటాయిక్తె ముఖ్ చూమన్ లాగీ
చిర్ జీవొ మేలొ లాడితొ, మై భయొ న భాగీ'-

మాటి మాటికీ పిల్లవాణ్ణి ముద్దు పెట్టుకుంటుందట! తన యీ భాగ్యానికీ మురిసిపోతూ బిడ్డడిని చిరంజీవివి కమ్మని ఆశీర్వదిస్తుందట! చిన్నికృష్ణుడు బోరగిలపడిన వార్త క్షణాల మీద వ్రజభూమిలో వ్యాపించి పోయింది. యింకేముంది! గోపవనితలందరూ నందుని యింట గుమిగూడారు. ఎవరినోట విన్నా యిదే మాట! బాలకృష్ణునిలోని యే ఆయస్కాంత శక్తో వారందరినీ అతని పట్ల ప్రేమవిభోరులయ్యేలా చేసిందనటంలో సందేహం లేదు.

తల్లి అయిన ప్రతిస్త్రీకి నిరంతరమూ తన సంతానం గురించిన ధ్యాసే వుంటుందంటారు. తన పాపడు ఎంత త్వరగా నడక నేరిస్తే తల్లికి అంత ఆనందం. ఎంత త్వరగా తనని అమ్మా అని పిలిస్తే తల్లికి అంతకన్నా మరో భోగ భాగ్యాలు అవసరం వుండదు. ఈ రీతిగా ఆహార్నిశలూ వారి అభివృద్ధినే కాంక్షించే తల్లి మనసును యశోద హృదయ భావ వర్ణ ద్వారా వాస్తవరూపాన్నివ్వటంలో సూరదాస్ సఫలీకృతుడయ్యాడు.

'కబ్ మేరోలాల్ ఘుట రువన్ రేంగై
కబ్ ధరన్ పగ్ ద్వైక్ ధరై
కబ్ ద్వై దంత్ దూధ్ కే దేఖొ
కబ్ తతరే ముఖ్ బైన్ భరై'-

"ఎప్పుడెప్పుడు తన కుమారుణ్ణి దినదినప్రవర్ధమానుడవుతూ వుండగా చూడగలనో-అని తల్లి మనసు - తహతహ లాడుతుంది. తనకు సాధ్యమైతే యిప్పుడే! యీ క్షణంలోనే ఆతగాణ్ణి పెద్దవాణ్ణి చెయ్యాలన్న ఆతురత తల్లి మనసులో వుండటం సహజం. ఈ స్వభావసిద్ధమైన మాతృ హృదయాన్ని సూరదాస్ తన రచనలో అత్యంత సమర్థవంతంగా చిత్రించాడు.

ఇతలో తృణావర్త సంహారం. యశోద నోముల పంటను అంత మొందించాలన్న దురాలోచనతో కృష్ణుని సుడిగాలి రూపంలో కబళించబోయిన ఆ దానవునికి తగిన గుణపాఠం చెప్పాడు ఆ నందనందనుడు. యశోదకు యీ సంగతి తెలిసింది. ఇంత చిన్నపాపడు అంతటి రాక్షసుణ్ణి యెలా పట్టుపెట్ట గలిగాడన్న ఆలోచనే ఆ తల్లికి రాదు. ఇతనిలోని యే అలౌకికశక్తి యీ పనులను చేయిస్తోందోనన్న అనుమానం రాదా అమాయక గోపనికరు. కేవలం యే పురాకృత పుణ్యవిశేషమో తన తనయుణ్ణి యీ గండంలోనుంచి బయట పడ వేస్తిందన్న విషయం మాత్రమే ఆమె హృదయానికి అందిన సత్యం. అలాగే మరికొంతసేపు యీ సంఘటన ఆలోచించి వుండే కృష్ణుని అసాధారణత ఆమెకు విదితమై వుండేదేమో! కానీ అలాగే జరిగితే యిక వాత్సల్య రసవర్ణనకు తావెక్కడిది! ఒకసారి అతనిలోని పారమార్థిక తత్వాన్ని గమనిస్తే...యిక ఆ తల్లి మనను భక్తిభావంతో ఓక ప్రోతమై పోతుందే తప్ప - వాత్సల్య రస పుష్టికి యిక చోటెక్కడుంటుంది? అందుకే యశోదకు అలాంటి అవకాశమీ కల్పించలేదు కవి కుమారుని పురాకృత పుణ్యం గురించి ప్రజవనితలతో ముచ్చటిస్తూ లోలోపలి ఆలోచనలతో అక్కున చేర్చుకున్న తల్లిని తన బోసి నవ్వులతో మాయామోహితురాలను చేశాడు ఆ జగన్నాటక సూత్రధారి. యింకే ముంది! సగం తెరిచిన ఆ బోసినోటిలోని రెండు పాలపళ్ళు యశోదకంటబడ్డాయి. ఆ తల్లి హృదయం అసలు విషయం మరచి, కనయుని పాలపళ్ళను గుర్తించి మురిసిపో నారంభించింది.

'హరషిత్ దేఖ్ దూధ్‌కీ దంతియా
ప్రేమ్ మగన్ తన్‌కీ సుధి భూలీ'-

ఆ ఆనందంలో తన్ను తాను మరచి మళ్ళీ మామూలు తల్లిగా కుమారుణ్ణి ముద్దు లాడటంలో మునిగిపోయిందట!

నామకరణ మహోత్సవాన్ని మనోజ్ఞంగా వర్ణించటం జరిగింది జ్యోతిష విధానం ప్రకారం - శ్రీకృష్ణుని తల్లిగా యశోద చేసుకున్న పుణ్యవిశేషాన్ని వేనోళ్ళ కొనియాడినా- ఆ తల్లి మనసు- తన కుమారునిలోని అలౌకికత్వాన్ని

గడునించలేక పోయింది. అన్నప్రాశన సమయంలో యశోద అనేక విధాలుగా ఆలోచించిందట ! అసలే అందగాడు అల్లరి వాడూ అయిన తన చిన్ని కృష్ణుడు-అందరినీ యిట్టే ఆకర్షిస్తాడనటంలో సందేహం లేదు. అందునా ప్రత్యేకించి అన్నప్రాశన శుభఘడియలో-గోకుల వాసులందరూ వచ్చారాయె ! అలాంటపుడు యిదరి దృష్టి తన చిన్నారి తనయునిపై పడితే-యింకేమన్నా వుందా ! అందుకే ముందుగానే జాగ్రత్తపడి, దిష్టిచుక్క పెట్టిందట !

రోజులు గడిచే కొద్దీ చిన్ని కృష్ణుని అందం యిరుమడిస్తూంది. అతని లోని యీ సౌందర్య వైభవాన్ని గుర్తిస్తూన్న యశోద మాతృ హృదయం-యేదో ఒక విధంగా వర్ణించకుండా వుండలేక పోతోంది.

'లాలన్ హౌవారీ తేరే ముఖ్‌పర్
కుటిల్ అలక్, మోహని మన్ విహాసని,
భ్రుకుటివికట్ లలిత్ నైననిపర్
దమకతిదూఁ దంతులియాఁ విహాసత్
మను సీపఢ్ ఘర్ కియో వారిఢ్ పర్'-

రింగులు తిరిగిన జుట్టు, మోహనాకర్షకంగా కన్నులపై పడుతుండగా, మిలమిలమెరిసే పాలపళ్ళతో కీకిలానవ్వే బాలకృష్ణుని రూపం మనసులో నిండి పోయిందట ! నిజమే ! దినదిన ప్రవర్ధమాన మవుతున్న కృష్ణ సౌందర్యాన్ని అంక సన్నిహితంగా పీఠింపగలిగే యశోదకు ఆతని ప్రతి కదలికా - అపు రూపంగా కనిపించటంలోని వాస్తవాన్ని - కన్నులకు కట్టినట్టు వర్ణింపగలిగిన సూరదాసు ఆయా వర్ణనల తాలూకు అనుభూతి సుఖాన్ని స్వయంగా అనుభ వించే ప్రాసి వుంటాడు.

దినదిన ప్రవర్ధమానుడవుతూ చిన్ని కృష్ణుడు రోజుకొక్కొత్త విన్యాసు నేరుస్తున్నాడు. ప్రస్తుతం చిన్ని చిన్ని అడుగులు వేయటానికి ప్రయత్నిస్తూ వున్నపుడు-కాళ్ళ గజ్జెలు, మొలత్రాడు మొ వాటి ఝంకారనినాదాలతో యశోద ముంగిలి మారుమ్రోగిపోతూవుంది. బుడి బుడి నడకలలో అప్పుడప్పుడు తడ

బాటుతో కింద పడటంకూడా కద్దు. ఆపలే శ్యామవర్ణుడైన చిన్ని కృష్ణుని శరీర కాంతి - రజోరంజితమై యిప్పుడు ఘరిత ప్రకాశోందట! తన చిన్నారి కన్నయ్య-అలా తప్పటడుగులు వేస్తుండగా చూస్తున్న యశోద మనసు - వుద్వేగంతో యెగసిపడే సంద్రమే అయింది. ఆ నీలమేఘశ్యాముని కాలి గజ్జెల చిరు మ్రోతలతో తమ గృహం సంగీత భరితం కావటమేకాక - అతని కేరింతలు కిలకిలా రావాలతో నందనవనమే తమ యింట వెలసినంత సందడిగా వుంది. ఒక చేత వెన్నముద్దను ధరించి తడబడే అడుగులు వేస్తున్నాడు చిన్ని కన్నయ్య. మధ్యమధ్య చేతనున్న నవనీతాన్ని ఆప్యాయంగా ఆరగిస్తున్నాడు. అలా అలా అక్కడక్కడ అంటిన వెన్న మరకలతో మనోజ్ఞంగా కనిపించే ఆ శ్యామసుందరుని సుందర ముఖారవిందాన్ని ఎన్నిమార్లు చూసినా తనివి తీరటం లేదట యశోదకు!

'శోభిత్ కరౌ నవనీత్‌లియే
ఘుటురుని చలత్ రేణు తనుమండిత్
ముఖ్ దధి లేపకియే'-

నల్లని విశాలమైన కళ్లు, గోరోచన తిలకంతో అలకల్లల్లాడుతుండగా ముడి ముడి నడకలు వేస్తున్న తన చిన్నారి తనయుని ఎంత చూస్తున్నా తనివి తీరటం లేదట! యిదేస్థితిలో ఒకమారు కృష్ణునికి తన సీద కనిపించిందట! యింతేముంది! పట్టుకోవటానికి వెంటపడ్డాడు. జగత్ కర్తను బాలకృష్ణునిగా వర్ణించటంలో సూరదాసు తీసుకున్న జాగ్రత్తలు అన్నీయిన్నీకావు. బాల సహజమైన అనేక చేష్టలను, వర్ణించడంలో ఆతని పరిశీలనాదృక్కులనుండి యే చిన్ని విషయమూ తప్పించుకుని పోలేదు.

'కలకల్ కాన్హ ఘుటరువని ఆవత్
మనిమయ కనక్ నంద్ కీ ఆంగన్
ముఖ ప్రతిబింబ పకరిబే ధావత్
కబహూ నిఖరి ఆప్ ఛాహ్‌కో
పకరన్‌కో చిత్ చాహత్'-

తన సీడను తానే పట్టుకోవటం ఎటూసాధ్యం కాదు కాబట్టి తనకు-అందని సీడను పట్టుకోవటం ఒక ఆటగా మారించి కన్నయ్యకు. ఛాయాగ్రహణ క్రీడలో కిలకిలానవ్వే కన్నయ్య బోసి నోటిలో పళ్ళు తళుక్కుమంటూ మెరుస్తున్నాయ్! ఆతని పదస్పర్శతో హర్ష పులకాంకితురాలయిన వసుధ, ఆతనికి పూలదారులే వేసిందట! ఈ దృశ్యాన్ని చూస్తున్న యశోద ఆనందం పట్ట శక్యం కాకుండావుంది. తానేకాదు. ఈ అపురూప సంఘటనను చూస్తూ తాను పొందే ఆనందాన్ని భర్తతో పంచుకుందామన్న ఆతృత పెరిగిపోతూవుంది అందుకే మాటిమాటికి - నందుని పిలుస్తుందట! తమసంతానం రోజురోజుకూ యెన్ని కొత్తవిద్యలు నేరుస్తున్నదీ - ఒకరికొకరు చెప్పుకుంటే గాని తృప్తి వుండదు దంపతులకి. ఈ సహజాతిసహజమైన లక్షణాన్ని యెంతో హృద్యంగా తన రచనలలో చొప్పించ గలిగాడు సూరదాస్.

'సిఖవత్ చలన్ యశోదామైయ్యా
అరబరాయికర్ పరని గహావత్,
దగ్ మగాయి ధరనీ ధరైపైయ్యా'-

అల్లనల్లన అడుగులువేస్తూ, మద్దు మద్దుగా ముడిపిస్తున్న తన ముద్దుల తనయునికి నడక నేర్పిస్తున్న యశోద యెప్పటికప్పుడు తన కుమారుని సుందర ముఖారవిందాన్ని చూస్తూ ఆనంద విభోరా లవుతుందట! బలరామకృష్ణుల్ని-తమ ప్రాంగణంలోనే ఆడుకొమ్మని హెచ్చరిస్తుందట మరోమారు! తమ యీ సంతానాన్ని చిరంజీవులను చేయమని కులదేవతలని ప్రార్థిస్తుందట యింకోమారు!

కేవలం నడకేకాదు. తన చిన్నారి తనయునికి నాట్యం కూడా నేర్పిందా లన్న కోరిక వుంది యశోదకు. అందుకే అతనితో అడుగులు వేయిస్తూ, అందుకు అనుగుణంగా తానూ పాట పాడుతున్నది.

'అంగన్ క్యామ్ నచావహీ జసుమతి నందరానీ
తారీ దైదై గావహీ మధురీ మృదుబానీ'-

ఈ నాట్యాభ్యాసానికి చెందిన వర్ణనలు అనేకం చేయబడ్డాయి. వీటిలో ముఖ్యంగా గమనించదగ్గ విషయం ఏమిటంటే యే ఒక్కదానిలోనూ కృత్రి

మత గానీ, ఆడంబరం కానీ కనిపించదు. వీటన్నింటికీ చదువుతూ వుండే- సంసార తాప త్రయాలకు దూరమైన సూరదాసు, ఆ మహత్తైన యీ కవి - యిన్ని అనుపమాన దృశ్యాల నెలా చిత్రీకరించగలిగాడా అన్న ఆశ్చర్యం కలుగక మానదు. సూరదాసుని కల్పనా శక్తికి జోహార్లు అర్పించక మానదు.

ఎన్నో దినాల యశోదకోరిక తీరింది. కృష్ణుడు-మాటలాడటం మొదలు పెట్టాడు. తన సంతానంచేత అమ్మా అని పిలిపించుకోవటంలోని ఆనందం ఒక్క మాతృ హృదయానికే తెలుస్తుంది.

'కహన లగే మోహన్ మైయ్యా మైయ్యా
పితానంద్ సో బాబా బాబా అరు హలధర్ సో భైయ్యా'-

యశోదను 'అమ్మా' అని-నందుని 'బాబా' అన్న బలరాముని "అన్నా" అని పిలవటం నేర్చాడు. యిలాంటి చిన్ని చిన్ని మాటల స్థాయినుంచీ యెదిగి, తల్లిదండ్రులతో చిట్టిపొట్టి సంభాషణలు జరిపే స్థాయికి చేరుకున్నాడు. ఒక రోజు వెన్నకుండలో నుంచి వెన్న తీసుకోబోతుండగా తన నీడ కనిపించింది. వెన్న దొంగిలించటానికి యెవరో వచ్చారన్న అనుమానం కలిగింది. వెంటనే తండ్రి దగ్గరకు వెళ్ళి ఫిర్యాదు చేశాడు. నందుడు యేదో పనిలో వుండి యీతని మాటలను పట్టించుకోకపోయేసరికి, బ్రహ్మాండమైన కోపం వచ్చేసింది. బుంగ మూతితో తల్లి పక్కన చేరాడు. మళ్ళీ అదే ఫిర్యాదు. ఆతల్లి మనసులోనే నవ్వుకుని నచ్చజెప్పబోయింది. కానీ తల్లి యిలా తన మాటని నిర్లక్ష్యం చేయటం గొప్ప అనాదరణగా తోచింది. ఫలితం కళ్ళలో నీళ్లు. మాట మరిపించేందుకు యశోద వెన్న యిస్తానని ఆశ చూపించింది. ఆయివ్వటంలో క్షణం ఆలస్యం అయింది. యిహనేం... నేలపైపడి దొర్లుతూ, ఒకటే యేడుపు. తారస్థాయిలో సాగుతున్న యీ శోకసంగీతాన్ని ఆపేందుకు ఆతల్లి యెన్ని తిప్పలు పడ్డదో!

ఇలా యెన్నో వర్ణించలవికాని దృశ్యాలకు సైతం సూరదాసు తన కల్పనాచాతురితో ప్రాణప్రతిష్ఠ చేసి, చదువరులను ఆవాతావరణంలోకి తీసుకుని వెళ్ళగలదన్న వాస్తవాన్ని యీ రచనలలో చూడగలం.

పిల్లలకు తాము చాలా త్వరగా పెరిగి పెద్దవాళ్ళు కావాలని వుంటుంది. అందుకే కృష్ణుడు కూడా తల్లితో అంటున్నాడు.

'మైయ్యా మోహి బడీ కరి దైరీ
దూధ్ దహీ ఘృత్ మాఖన్ జో మాంగిసో దైరీ'-

తనను చాలా త్వరగా పెద్దవాణ్ణి చేయమని యశోదను అడుగుతున్నాడు. ఎలా! తాను అడిగినప్పుడల్లా పెరుగు, వెన్నలు యివ్వాలిట! అలా చేస్తే తాను త్వరగా పొడుగవుతాడట! చిన్నపిల్లలకు సాధారణంగా తిండి వస్తువులపై ధ్యాస యెక్కువగా వుంటుంది. తమకు యిష్టమైన పదార్థాలపట్ల మరీ మక్కువ. బాల కృష్ణునికి పాలు పెరుగు వెన్నలు అత్యంత ప్రీతికరమైన పదార్థాలు కాబట్టి వాటినే పదేపదే యిమ్మంటున్నాడు.

అలా పెరిగి పెద్దయ్యాడు బాలకృష్ణుడు. తనంతట తానే ఆడిగి లేదా దొంగిలించి పాలుపెరుగులు తినేస్థాయి నుంచి ఎదిగి పాలుపెరుగు లంటే తనకి యిష్టం లేదనే స్థితికి వచ్చాడు ఎలా?

'మైయ్యా కబహి బఢైగీ చోటీ
కితీబార్ మోహి దూధ్ పిబత్ భయి
యహ అజహూ హై చోటీ'-

"పాలుమీగడలు తింటే త్వరగా పెద్దవాడినై పోతానని మభ్యపెట్టి నాచేత బలవంతంగా త్రాగించావు. కాని ఏమీ- ఏమీలాభం కనిపించటంలేదు. చూడు నా తలవెంట్రుకలు అసలు పెరగనే లేదు. దీనికి కారణం ఏమిటి?- అని తల్లిని నిలదీస్తున్నాడు. ఇంతేనా! ఒకరోజు తనను పూరకే బాధిస్తూన్న కృష్ణుని ఆల్లరి మాన్పడానికై ఆకాశంలోని చందమామని చూపి మరిపించాలని చూసిందాతల్లి. ఇంకేముంది ఆ చందమామనే తనకు ఆటవస్తువుగా తెచ్చివ్వాలని కూర్చున్నాడు. ఇది అసలే సాధ్యం కాని పనికదా! పాపమా తల్లికి దిక్కుతోచలేదు. చివరికి పెళ్ళికూతురిని తెచ్చి యిస్తానని మాట మరిపించించి, వుహూ కథ మళ్ళీ మొద

టికి వచ్చింది చందమామని నీట చూపించి, తృప్తి పరచాలని ప్రయత్నించింది. అదెలా కుదురుతుంది? చేతిలోకి రావాలంటాడట! చేసేదిలేక ఆ తల్లి మరో మార్గం ఆలోచించింది. అదుగో! నీకోసం చందమామను తీసుకురావటానికి- ఆ పక్షిని పంపుతున్నాను. యిక కాస్సేపట్లో మిందినున్న దేరాజు నీచేత వుంటా డని హామీ యిచ్చింది. ఆమాటలు వి టూ మగత నిద్రలోకి జారుకున్నాడు కన్నయ్య. కాస్త వూపిరి పీల్చుకుంది యశోద. కానీ యేం లాభం! ఆ సంతోషం యెక్కువ సేపు నిలువలేదు. మళ్ళీ కొంచెం సేపటికే కృష్ణునికి మెలుకువ వచ్చే సింది. యిప్పుడిక ఆ తల్లి కథాకథనం ప్రారంభించింది. తన బిడ్డని నిద్ర పుచ్చేందుకు... ఆకథ యెవరిది? "ఏక్ రామ్ థే" రామాయణ గాథన్నమాట! ఎంత చక్కటి కూర్పు! నిజమే. ద్వాపరయుగకాలం నాటికి త్రేతాయుగ పురు షుని గాథ కథలు కథలుగా ప్రచారమయ్యేవుంటుంది. మరి పైగా కృష్ణునికి అతి సన్నిహితమైన రామకథేనాయె! యిదీ సూరదాసు కథా సంవిధానంలోని నేర్పరి తనం.

ఒకానొకనాడు కృష్ణుడు యేడుస్తూ యింటిలోకి ప్రవేశించాడు. బుగ్గలపై కారుతున్న కన్నీటిధారలు తల్లిమనసును ద్రవింప జేశాయి. అక్కున చేర్చుకుని కన్నీటికి కారణమడిగి ది సమాధానం యిదిగో!

'మైయ్యా మోహి దావూ బహుత్ రిఝాయో
మోసోకహత్ మోల్‌కోరీన్హో-తూ జసుమతి కచ్ జాయో'-

అమ్మా! అన్నయ్యా వాళ్లు నన్ను ఆటపట్టిస్తున్నారు చూడవే! పిల్లలంతా తెగ ఏడిపిస్తున్నారు. అన్నయ్య మీ సొంత కొడుకట! అందుకే తెల్లగా వున్నా డట! నన్నేమో యెక్కడినుంచో కొనుక్కుని తెచ్చారట గదా! నేను మీ కుమా రుణ్ణి కాకపోవటం వల్లే యిలా నల్లగావున్నానట! అన్నయ్య కూడా వాళ్ళతో చేరి ఒకటే నవ్వు! నాకెంత ఏడుపు వచ్చిందో! కానీ అమ్మా! నీవేమో యెప్పుడూ నన్నే దండిస్తావు కానీ అన్నయ్యని అస్సలు యేమీ అనవు. దీన్ని బట్టి చూస్తే నీకు నాపై ప్రేమ లేదేమో ననిపిస్తూంది. అందుకే నేనిక యీ

యింట్లో వుండదలచుకోలేదు. నాకంబడీ ఆవే యిచ్చేయ్. నేనిప్పుడే వెళ్ళిపోతాను' బుంగ మూతితో అంటున్న కుమారుణ్ణి చూస్తే యే తల్లికి ముచ్చట వేయదు? చటుక్కున కృష్ణుని దగ్గరకు తీసుకుంది. అంతలోనే తన చిన్న కన్నయ్య నిలా యేడిపించిన వారిపై కోపం వచ్చింది. ముందు యెలాగో కృష్ణుణ్ణి సముదాయించాలి గదా! అందుకే ఆ తల్లి ఒట్టువేసి మరీ చెపుతూంది. ఏమని "బాబూ! అన్నయ్య వాళ్ళు చేప్పేది అక్షరాలా తప్పే. నీవు అచ్చంగా మా కన్న బిడ్డవే, కావాలంటే మన గోసంపద మీద ఒట్టు వేసి మరీ చెబుతున్నా" అన్నది. ఆ గోపకుల కాంతకు తమ వద్దనున్న గోసంపదే తరగని ఆస్తి అందుకే యశోద ఆ గోవులనే సాక్ష్యంగా తీసుకున్నదన్నమాట! యిలాంటి సందర్భాలలోనే సహజ సుందర వాతావరణాన్ని అడుగడుగునా ప్రతిబింబింప జేయటానికి సూరదాస్ తీసుకున్న జాగ్రత్తలు పాఠకులను ముగ్ధులను చేస్తాయి.

ఇలాంటి వుదాహరణలు యింకా యెన్నెన్నో సూరదాసుని సాహిత్యంలో కనబడతాయి. ఆతని వాత్సల్య చిత్రణ అతి మౌలికమైనది. కొన్నిచోట్ల భావాల పునరుక్తి వున్నట్టనిపించినా, అలౌకికత్వం గోచరించినా ఆది వాత్సల్య రస పరిధిని దాటిపోలేదు. భక్తి రస ప్రోద్బలం చేసే సూరదాసుని వాత్సల్య రసపోషణ అద్వితీయంగా వుందనటంలో సందేహం ఏమాత్రమూ లేదు.

అన్నమయ్య వాత్సల్య రసపోషణ

అన్నమయ్య పద కవితాపితామహుడుగా పేరొందిన మహనీయుడు. ఆయన రచించిన అసంఖ్యాకమైన పదకవితలలో నవరసపోషణ అత్యంత సమర్థవంతంగా జరిగిందని ఘంటాపథంగా చెప్పవచ్చు. సూరదాస్‌లా విష్ణుగాథను కృష్ణకథారూపకంగా మహాకావ్యరూపంలో మలచలేదు. కానీ - ముక్తకాలుగా వున్న యీ పదాలు వేటికవే ప్రత్యేకమైన కావ్యరూపాలను పొందాయి. ఆయన పదాలలో ముఖ్యంగా భక్తి, శృంగార, కరుణ, వైరాగ్య, వాత్సల్యభక్తి పుష్కలంగా పోషించబడింది. అంతేకాదు లెక్కలేనన్ని పదాలను రచించినా వాటిలో భావపునరుక్తి యెక్కడా కనిపించదు. ఒకదానికంటె మరొకటి వైవిధ్యంతో

కూడుకుని రసపుష్టిని కలిగి వుండటంతో - భక్తి భావపరవశతను కలుగ జేస్తాయి.

అన్నమయ్య పదాలలోని వాత్సల్యరసపోషణ విషయానికివస్తే- అనేక రచనలలో శ్రీకృష్ణుని బాల్య క్రీడలను కన్నులకు గట్టినట్టుగా చిత్రించినట్టు తెలుస్తుంది. అంతేకాదు. బాలకు తగినట్లు భాషను మలచుకోవటంలో ఆయనకు ఆయనే సాటి. అసలు అన్నమయ్య పదాలలోని తెలుగుభాష, ఒక విధంగా, భాషాశాస్త్రజ్ఞులకొక విలవైన నిఘంటువులాంటి దనవచ్చు. అందులో తెలుగు కళామతల్లికి విలవైన ఎనిమిది ఆభరణాలవంటి సాహిత్యాలంకారాలకాక ప్రకృతి సౌందర్యాలైన సుందర పుష్పాలంకారాలను పోలిక పలుకులను - సామెతలు వంటి ఆభరణాలను కూడా సవరించాడు. యిప్పుడు అన్నమయ్య చేసిన వాత్సల్య వర్ణనను గురించి తెలుసుకుందాం.

శ్రీకృష్ణుని జనన వార్తను విన్న గోపికాబృందాల హర్షోల్లాసాలు, ఆతని అలౌకిక బాల్యక్రీడలను అతి అమాయికంగా వర్ణించే వారి ఆశ్చర్యాతిరేకాలు, చిలిపి కృష్ణుని తుంటరి పనులకు విసుగణించి - యశోదమ్మ విచారిస్తూ కూడా, ఆతని ఆకర్షణను తృణీకరించలేని గోప భామినుల ప్రేమవిహ్వలత, యివన్నీ చూడముచ్చటగా వర్ణింపబడ్డాయి. కానీ యీ పదాలన్నింటిలోని ప్రత్యేకతా - శ్రీకృష్ణుని భగవదవతార రూపంగా ప్రస్తుతించటం.

శ్రావణ బహుళాష్టమి నవరేత్రి కాదను
శ్రీ విభుడయించె చెలరార వినరే।
అసురుల శిక్షించి సమముల రక్షించ
వసుధ భారమెల్లా నివారింపా
వసుదేవునికిని దేవకిదేవికిని
ఆపదృశమగు కృష్ణుడవతారమందెను ॥శ్రావణ॥

గోపికల మన్నించ గొల్లెలనెల్లా గావగ
దాపై మునులనెల్ల దయలు నేయగను
దీపించ నందునికి దేవియైన యశోదకు
యేపున సుతుడై కృష్ణుడిన్నిటా బెరిగెను ॥శ్రావణ॥

ఈ రచనలో శ్రీకృష్ణుని అవతార ఘట్టాన్ని వర్ణించటం పల్లవిలోని ముఖ్యోద్దేశ్యం. ఆ అవతార కారణాన్ని వివరించడం మొదటి చరణంలోని ప్రత్యేకత. తరువాతి చరణంలో, శ్రీకృష్ణుని జన్మస్థానంగా గోకులంలోని ప్రజల పూర్వజన్మ సుకృతమైన భగవత్సాన్నిధ్య ఫలాన్ని అభివర్ణించి, యశోదా నందుల కడుపు పంటగా నందగోపబాలుని పరిచయం చేయటం జరిగింది. తరువాత పాండవులను రక్షించటం, పదారువేల మంది భామలను వరించటంతో పాటు అలమేల్మంగా సమేతుడైతిరుమలలో నెలకొనిన వేంకటాచలపతి రూపంలో శ్రీకృష్ణుని ధ్యానించటంతో పాట పూర్తవుతుంది. యిలా ప్రతిపదంలోనూ, పల్లవిలో ముఖ్యోద్దేశ్యాన్ని సూచించి - చరణాలలో ఆ ముఖ్యోద్దేశ్యాన్ని బల పరచడం అన్నమయ్య రచనా విధానం.

భగవదవతారమూర్తి శ్రీకృష్ణుని కన్నబిడ్డడిగా పొందిన దేవకీదేవి పుణ్యమే పుణ్యం. "సువ్వీసువ్వి సువ్వాలమ్మ-నవ్వుచు దేవకి నందని గనియె"- అన్న రచనలో యిలపై శ్రీకృష్ణావతరణం ఎందరికి యెన్నెన్ని రూపుల ఆనుభూతమైందో వర్ణిస్తాడు అన్నమయ్య. కానీ పుట్టిన కొద్ది నిమిషాలకే కన్న తల్లిదండ్రులనుండి-దూరమై-పరుల యింట తలదాచుకొనవలసి వచ్చిన ఆ చిన్నారి పాపనికి- కన్నప్రేమకంటే మించిన ఆదరాభిమానాలు లభించాయి రేపల్లెలోని నందుని యింట కాలిడిన మరునిముషం నుంచే ఆతనిదళ మారిపోయింది. ఆ బిడ్డడు 'వూఁ అన్నా' 'ఆఁ అన్నా' మురిసి మైమరచే యశోదానందులు, తానాడించే ఆట-పాడించే పాటగా మెలిగే గోకులవాసులు, ఆతని ఆల్లరిచేష్టలకు విసుగు చెందినా ఆ ప్రేమస్వరూపుని సామీప్య సుఖాన్ని కాంక్షించే అమాయక గొల్ల భామలు, వీరందరి అమలిన ప్రేమలూ, అన్నమాచార్యుని పదాలలో వాస్తవికతను మించి అందచందాలను సంతరించుకుని వెలిశాయి.

వివిధ సందర్భాలకు చెందిన ఈ పాటలలో ఆల్లరి కృష్ణుని ఆటపాటలను సమర్థవంతంగా చిత్రీకరించడంతో పాటు, ఆతనిలోని భగవదంశను ప్రత్యేకంగా గుర్తుంచుకోవటం అన్నమయ్య అలవాటు.

ఉగ్గు వెట్టరే వోయమ్మా, చె
య్యొగ్గినిదె శిశువోయమ్మా ॥ఉగ్గు॥

కడుపులోన లోకమ్ములు గడిలీ
నొడలూచకురే ఓయమ్మా
తొడికెకు సరగున దొలగదోయరే
వుడికెడి పాలివి ఓయమ్మా ॥ఉగ్గు॥

చవులు వట్టుక నన్నపుడాలని
నువ్వుర మెత్తకు రోయమ్మా
అప్పుడె సకలము నది మీ నోరనె
నొప్పదు తియ్యరె వోయమ్మా ॥

నెలల శిశువులకు వుగ్గుపెట్టడం మన సంప్రదాయం. పసిబిడ్డలలో జీర్ణ శక్తిని కలుగజేసే యీ ఉగ్గు, వారి ఆరోగ్యానికి చాలా మంచిదని పెద్దలు చెబుతారు. అన్నట్టు ఉగ్గు అంటే తగుపాళ్ళలో జాజికాయ, కరక్కాయ, వాము, వెల్లుల్లి వీటి రస మిశ్రమానికి నాలుగైదు చుక్కలు ఆముదం కలిపి తల్లిపాలలో రంగరించి పిల్లలకి పట్టిస్తారు. ఈ ఉగ్గు పసిపిల్లలలో జీర్ణశక్తిని పెంచుతుందని శాస్త్రం చెబుతుంది.

సాధారణంగా యీ వుగ్గుపాలను తాగేందుకు మొండితనం చేస్తారు పిల్లలు. కారణం. ఉగ్గుగిన్నెతో యీ రసాన్ని త్రాగించేందుకు - పెద్దవాళ్ళ వాళ్ళని రెండు కాళ్ళపై పడుకోబెట్టుకుని, కాళ్ళ చేతులు అటూ ఇటూ త్రిప్పి- ఉగ్గుగిన్నెను త్రోసివేయకుండా వుండేందుకు తగిన జాగ్రత్త తీసుకుంటారు. ఈ ప్రక్రియ మొదలవగానే పసిపిల్లలు పసిగట్టేస్తారు..... తమకేదో చేయ బోతున్నారని హాయిగా కాళ్లూ చేతులూ ఆడిస్తూ, బోసినవ్వులు విరియబోస్తూ కేరింతలాడే తమని యిలా బంధిస్తున్నారేమిటని - యీ చర్యని ప్రతిఘటించ బోతారు. అందుకే పెద్దవాళ్ళు యీ జాగ్రత్త తీసుకుంటారు. ఇక ఉగ్గుపాలు త్రాగించిన తరువాత ఆ రసమిశ్రమం పూర్తీ కడుపులో చేరుకునేందుకై పిల్లల్ని భుజంమీద వేసుకుని కాసేపు తడతుంది తల్లి. సహజంగా పిల్లలకి యేడుపే- ఆయుధం కాబట్టి యీ ప్రక్రియలో ఆరున్నొక్కరాగం ఆలపిస్తున్న పిల్లడిని

లాలించే బాధ్యతా తల్లిదే. ఆ బాలుడు మన చిన్ని కృష్ణుడే అయితేనా ! గారాము మరీ యెక్కువ. అలా వుగ్గుపెట్టిన తరువాత కృష్ణుణి యిండ్లుడు, చంద్రుణ్ణి పొగుడుతున్నది తల్లి యశోద. ఆ పాట ఎలావుంటో అన్నమయ్య మాటల్లో చూడండి.

ముద్దుగారే యశోద ముంగిట ముత్యము వీడు
దిద్దరాని మహిమల దేవకీ సుతుడు
అంతనింక గొల్లెతల అరచేతి మాణికము
పంతమాడే కంసుని పాలి వజ్రము
కాంతుల మూడులోకాలు గరుడ పచ్చబూన
చెంతల మాలోనున్న చిన్ని కృష్ణుడు ॥ముద్దుగారే॥

బాలకృష్ణుడు పేరుకు దేవకీ సుతుడైనా - యశోదా నందనుడుగా అతడనుభవించని సుఖసౌఖ్యాలు లేవు. నంద యశోదలకేకాదు. మొత్తం గోకులానికే కంటి పాపగా మెలిగిన ఆ చిన్నారి బాలుడు - నిజంగా బాలుడు కాదు. బాలునివలె తిరిగే యోగీశ్వరుడు, అటువంటి అగణిత గుణధాముడైన శ్రీకృష్ణునిలో నవరత్న గుణవిశేషాలన్నింటినీ గుర్తించిన అన్నమయ్య రచనా చాతుర్యం అప్రతిమానమైనది.

అన్నమయ్య భావవైశాల్యానికి ఉదాహరణగా మరో రచన.

ఘుమ్మని యెడి శ్రుతిఁ గూడగను
కమ్మని నేతులు కాగఁగఁజెలఁగె
నీలవర్ణుడని - నీరజాక్షుడని
బాలుని నతివలు పాడేరో
పాలు పిదుకుచును - బానల కాగుల
పోలి పెరుగు - ప్రచ్చుచుఁ జెలరేగి ॥ఘుమ్మని॥

వేదనిలయ డైన వేంకటపతి - గోకులంలో వెలసినాడు. యిందింటా ఆ బాలుని గూర్చిన మాటలే. కూర్చున్నా-లేచినా-పనిలో మునిగినా - బాలకృష్ణుని తలవనిదే క్షణం గడవదు వారికి. వారి మాటలే పాటలై గోకులమంతా ఆ పాటల తాలూకు సౌరభం వ్యాపించింది. మరి సౌరభాన్ని-నాదానికి ఒక దేశ్యతి అట! శ్రీకృష్ణ ధ్యానమే ధ్యేయంగా వుంచుకున్న గోపికల మాట ఆటుంచి దేహమే వేంకటపతి ధ్యానకేంద్రంగా మలచుకున్న అన్నమాచార్యుని మానసిక స్థితే-యీ పాటరూపంగా వెలసిందని చెప్పవచ్చు.

ఆలాంటి బాలకృష్ణునికి జోలపాట పాడుతున్న గోపవనితలు ఏమంటున్నారో వినండి. వాళ్ళు యీ పాట పాడుతూ చిన్ని కన్నయ్యను నిద్దుర పుచ్చే దృశ్యం మదిలో మెదిలింది అన్నమయ్య హృదయం ఆనంద పరవశమయ్యింది. పదిమంది గోపవనితలు ఆనంద గోపాలుని ఊయలలో పరుండబెట్టి ఆల్లనల్లన వూచుతూ కమ్మనైన కంఠాలతో తన్మయీభావపూరితులై పాడుతున్న ఆ దృశ్యం మరొక్కమారు, కన్నులముందు నిలుపగానే మదిలో పల్లవి తారట్లాడింది. అది గుండెల్లోంచి పెదవులపై చేరేసరికి పల్లవి అనుబంధాలైన చరణాలు వాటంతటవే రూపుదిద్దుకున్నాయి.

వుయ్యాలా బాలునూచెదరు కడు
నొయ్య నొయ్య నొయ్యనుచునూ ॥వుయ్యాలా॥

బాల యవ్వనులు షసిడి వుయ్యాల
బాలుని పద్ద పాడేరు
లాలి లాలి లాలి లాలెమ్మ
లాలి లాలి లాలి లాలనుచూ ॥వుయ్యాల॥

తమ్మిరేకు గను దమ్ముల నవ్వుల
జూపుల బాడేరు
కొమ్మలు మల్లెలు గునుకుల నడుపుల
థిమ్మి థిమ్మి థిమ్మి థిమ్మనుచూ ॥వుయ్యాలా॥

"చల్ల జూపుల జవరాండ్రు రే
పల్లె బాలుని బాడేరు
బల్లిదు వేంకటపతి జేరి యందెలు
ఘల్లు ఘల్లు ఘల్లు ఘల్లనుచూ" ॥పుయ్యాలా॥

యిలా మట్టెల ధిమిధిమిధ్వనులూ, అందెల ఘలంఘలలలోని లయలకు చిలిపి గజ్జెల గలగలలను జోడిస్తూ- వారి పాటలలోని సంగీతామృతాన్ని గ్రోలుతూ పెరిగి పెద్దవాడైన గోపబాలుడు. తన అల్లరి పనులతో వారిని ఆంతకంతకూ వేధించే చిలిపి కృష్ణుడైనాడు. ఆతని ఆగడాలు యింతింతని వర్ణించనలవి కాదట! ఒక గోపవనిత తన స్నేహితురాలికి యీతని లీలావిశేషాలను యెలా వర్ణించి చెబుతోందో మీరూ చూడండి.

ఎవ్వడో పీదేల తంగివచ్చి
నవ్వీ నవ్వీ నాతోనె

"పచ్చి పాలే పచ్చి పాలే
పచ్చిపాలే తోడంటుబాలే
వచ్చి వచ్చి వాడవాడల
జొచ్చి యారగించె జూడరే"

"పెంటపెరుగే పెంటపెరుగే
పెంటమంద పెనుబంట పెరుగే
అంటకంటకు మనగానే వాడు
వొంటి యారగించేనో యమ్మా"

బొంకుగోరో బొంకుగోరో
బొంకు గోరోకోరో బొలతులు
వేంకటేశుడు వేసాలరాయడు
అంకెలా నన్ను నలరించెనే" ॥ఎవ్వడో॥

మా యింట పచ్చి పాలు, పెరుగులను కాచేవాడని తనతో చెబుతున్న స్నేహితురాలిని చూస్తే జాలేసింది యీవిడకి?

''మీ యింట పాలు పెరుగులతో పోనిస్తున్నాను. వాని యిటువంటి అల్లరులతనికి యేపాటి? ఆ మహానుభావుని లీలా విశేషాలు నీవింకా వినలేదో యేమిటో! చెబుతున్నాను విను'' అంటూ పాట అందుకుంది.

ఎటువంటి విద్దడె యితడు
యిటువంటి వయసుననె యిట్లు జేసేవి

''నదుక కెటు నీటిలోననె యీదులాడేవి
తడవి పట్టెదమనిన దాగిపోయేవి
తడబడక నేల గుంతలు వోవదవ్వేవి
కడపమీదనె వుండి కదంతెపుదు''

''కలిమి లేమెరుగండిదె కలవెల్ల, నడిపేవి
చలమ రెవ్వరినైన జావమోడేవి
ఆలయ కడపుల వెంట నాటంకు దిరిగేవి
తొలగకిటు గిరులెక్కి దుముకులాడేవి''

''విచ్చనివిడినె తడుపు విడిచి పారెడివి
రచ్చలనె యింత గుర్రమువంటి కొరుకు
దిచ్చరిదై యిట్లు దిరువేంకటేశ్వరుఁడు
నిచ్చనిచ్చలు మగడు బెచ్చు విరిగేవి''

వీరిలా మాట్లాడుకుంటూ వుండగనే- దూరం నుంచి ఓ గోపవనిత తన పిల్లాణ్ణి నిద్రబుచ్చుతూ పాడే పాట వినిపించింది. శ్రావ్యమైన కంఠంతో కమ్మగా వున్న ఆ పాటలోని సాహిత్యం యింకా యెంత కమ్మగా వుంటుందో నన్న వుత్కంఠతో జాగ్రత్తగా విన్నారు. చెవులు రిక్కించి మరీ విన్నారు.

జో అచ్యుతానంద - జోజో ముకుంద
రావె పరమానంద - రామగోవింద ॥జో॥

నందునింటను జేరి - నయము మీఱగ
చంద్రవదనలు నీకు - సేవ చేయంగ
నందముగ వారిండ్ల - నాడుచుండంగ
మందలకు దొంగ - మా ముద్దురంగ ॥జో॥

పాలవారాశిలో - పవళించినావు
బాలుగా మునుల కభయ మిచ్చినావు
మేలుగా వసుదేవు తుదయించినావు
బాలుడై యుండి గో పాలుడైనావు ॥జో॥

ఆట్టు గట్టిన మీగ - డట్టె తిన్నాడే
వట్టి కోడలు మాతి - పై రాసినాడే
అట్టె తినెనని యత్త - యడుగవిన్నాడే
గట్టిగా విది దొంగ కొట్టుమన్నాడే ॥జో॥

గొల్లవారిండ్లకును - గొబ్బునకు బోయి
కొల్లలాగా క్రావి - కుండలను నేయి
చెల్లునా మగనాంద్ర - జెలిగి యీ కాయా
చిల్లతనములు నేయ - జెల్లనటవోయి ॥జో॥

గోకులంలోని వనితలకు కూర్చున్నా లేచినా కృష్ణ ధ్యానమే అయింది. పదిమంది జేరి కబుర్లు చెప్పుకున్నా అది కృష్ణుని గురించే. యింటిలో పని చేసుకుంటున్నా కృష్ణ లీలా స్మరణలే. మాటలైనా పాటలైనా కృష్ణుడే. మరి తన

కుమారుడికి జోలపాట పాడుతున్న యీ తల్లి మనసులో తారట్లాడే భావనలే-ఆమె పాటలోనూ ప్రతిబింబించాయి. కృష్ణుని దుడుకు చేష్టలకు పైపైన కోపగించుకుంటున్నా - అంతరంగంలో ఆ అల్లరి చేష్టలకు మురిసిపోయే యీ తల్లి తన బిడ్డడిలోనూ కృష్ణుని ప్రతిరూపాన్ని చూసుకుంటూంది. మరి ఆ పిల్లడు తల్లి గాన మాధుర్యపు మత్తుమందుకే, లొంగిపోయాడో లేదూ ఆ పాటలోని భావం అర్థమై మైమరచిపోయాడోగానీ- పాట మధ్యలోనే పిల్లని యేడుపు ఆగిపోయింది. అదీ అన్నమయ్య రచనా చాతుర్యం.

ఇలాంటి పాటలు కోకొల్లలు. వయోసహజంగా కృష్ణుడు చేసే తుంటరి పనులతోపాటు-ఆతడు చేసే అసుర సంహార నన్నివేళలు కూడా సమానంగా వున్నాయి. వీటన్నింటి వల్లా వాడవాడలా ఆతనికీర్తి ప్రతిష్ఠలు పరిపరి విధాల వ్యాపించాయి. ఒకనాడు తోటిపిల్లలతో వీథిలో వెళ్తున్న కృష్ణుడు కొంతమంది గొల్లభామల కంటబడ్డాడు. కేవలం ఆతని కీర్తిగానం మాత్రమే వినివున్న ఒక పొరుగూరి వనితకు యీ నీలమేఘశ్యాముని చూడగానే - ఆతగాడే యితగాడా అని సందేహం వచ్చింది. నల్లని కళ్ళలో నగవు చూపులతో, ఆకర్షిస్తున్న యీ కుర్రవాడేనా ఆ అల్లరివాడని తన పక్కనున్న గోపవనితను అడుగుతున్నది.

గోలెత్తుకుని గోపాలులను దాను
యీ లీల సోదించె యీతడే కదవే ॥

జన్నె వట్టి వుట్టి చక్కగ బెట్టిన
వెన్న దిన్నవాడు వీడె గదవె
పన్నారు దొంతులు పాలు పెరుగులు
యిన్ని నారగించె యీతడె గదవె ॥

మెఱసి గుట్టుగ మీది చక్కిలాలు
వెలి గైకొనె వీడె కదవె

కుమి కుమి నమలు గంపల నురుగు
యెఱిగి దొంగిలి యీతడే గదవే ॥

ఇన్ని అల్లరిపనులూ చేసే ఆ యశోదానందను డితడేనా అన్న పొరుగూరి మహిళా ప్రశ్నలకు తలవూచటం తప్ప మరి యేం సమాధానం వచ్చివుంటుంది? పాటలోని పై రెండు చరణాలూ ఆ అమాయక వనితకు వచ్చిన సందేహాలకు సంబంధించినవి. మరి యీ చివరి చరణం గమనించండి.

శ్రీ వేంకటాద్రి దాచిన తేనెలెల్లా
వేవేగ సాధించె వీడె గదవే
కావించల మేలు మంగపతయి మమ్మేలె
యే వంక చూచినా యీకడే కదవే ॥

ఈ చివరి చరణం మాత్రం అచ్చం అన్నమయ్య భావనకు సంబంధించినది. వేంకటాద్రి మొదలు సప్త పర్వతాలలోనూ దాగిన తేనెలెల్లా వేవేగ సాధించి ఆలమేల్మంగ పతిగా వెలసిన వేంకటేశ్వరుని నిరంతరమూ ధ్యానించటమే అన్నమయ్య జీవిత లక్ష్యమైనప్పుడు - నలువంకలా ఆతడే కనిపించటంలో ఆశ్చర్యం యేమున్నది?

బాలకృష్ణుని స్వైర విహారం గోకులమంతా వ్యాపించింది. అందరికీ ఆస్వాదయోగ్యమైన నవనీతాన్ని యిక్కడో ఉట్లపై దాచటం భావ్యం కాదనుకున్న భగవత్ స్వరూపుడు, ఆ నవనీతామృతాన్ని పదిమందికీ పంచిపెట్టాడు. ఈ పనికి కృష్ణుడు పూనుకున్న క్షణం నుంచి ప్రేపల్లెలో యిందింటా ప్రతికోజూ వుట్ల పండుగే.

పలుమరు వుట్ల పండుగను
చిలుకు చిదుక్కని చిందగను ॥

ఱాళ్ళవీధుల - వుట్లు కృష్ణుడు
తాళ్లదెగిపడ - దన్నుచును
పెళ్లు కతిల్లు - పెతిల్లని
పెళ్లున క్రోనె - పెనురవము ॥

బంగరు బిందెల - బాలు పెరుగులు
ముంగిట నెగయుచు - మోదగను
కంగు కళింగు - కతిగు ఱణి.గని
రంగు మీరు పెను - రవమునై ॥

ఈ అమృత రహస్యాన్ని భేదించటమీ కాదు. ఆమూ రహస్యస్థాలో తానూ మానసికంగా పాలుపంచుకుని శ్రీకృష్ణుడందించిన నవనీతామృతాన్ని తనివితీరా ఆస్వాదించటమేకాక-మనందరికీ గానామృతంగా పంచిపెట్టిన అన్నమయ్య ఋణం తీర్చుకోలేనిది.

ఇంత జరుగుతున్నా - మాయామోహితులైన గోపవాసులకు-శ్రీకృష్ణుని తార రహస్యం అవగతం కాలేదు. అలా కాకపోవటంలోనే అసలు రహస్యం దాగివుంది. భగవంతుడే స్వయంగా తమ యింట తిరుగుతూ, సామాన్యమానవులకు సాధ్యంకాని అనేక మహత్కార్యాలను చేస్తున్నాడు. అది వారి దృష్టి నాకర్షిస్తోంది కానీ వారిని మరిపించేందుకై, ఆతడు చేసే అల్లరిచేష్టలపై మాత్రమే వారి దృష్టి కేంద్రీకృతమవటం వారి అమాయకతకు ఆద్యం పడుతుంది. ఒకమారు చిన్ని కృష్ణుని తుంటరి చేష్టలకు విసిగి వేసారిన గోపికాబృందం యశోద యింట గుమిగూడింది.

చూడవమ్మ కృష్ణుడు నీ సుతుడోయమ్మ
ఆడీవీధుల వెంట యశోదమ్మా ॥

కోంయి జూచి వుట్లు గొట్టగా బాలుపెరుగు
కాలువలు గట్టి పారెగదమ్మా
మేలముబాడి వద్దంచె మిక్కిలి గొల్లెతంతో
ఆలకించి వినవమ్మ యశోదా ॥

చక్కిలాల తుండలెల్లా చలాన దొండ్లు వాడిచ్చి
చిక్కున దోటికోంయి దీసెనమ్మా
చక్కని తేనె బాదె చివ్వన రాత వేసితే
అక్కడ జోహున గారె యశోదమ్మా ॥

ఆల్లంత నుండి తన కందదావి తెంకాయలు
పల్లె తాళ్లు వేసి వంచినమ్మా
బల్లిదు డలమేల్మంగ పతి శ్రీవేంకటేశుడు
అల్లి బిల్లె యున్నాడమ్మ యశోదమ్మా ॥

అన్నమయ్య పాటలలోని మరొక విశిష్టత- తమ ప్రాంతానికి చెందిన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబింప జేయటం. ఆంధ్రదేశంలో ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాలలో సంక్రాంతికి సంబంధించిన పాటలు కోకొల్లలుగా వివ వస్తాయి. కడప జిల్లాలోని తాళ్లపాక గ్రామం, అన్నమయ్య స్వస్థలం. అందువల్ల సంక్రాంతి రోజులలో పల్లెపడుచుల కంఠమాధుర్యపు మేలుకొలుపులతో నిద్దుర లేచే గ్రామవాసులకు చిరపరిచితమైనవి గొబ్బిపాటలు. ఒకరిచేతులు మరొకరు పుచ్చుకొని లయబద్ధంగా అడుగులు వేస్తూ చప్పట్లు తడుతూ గొబ్బి తడుతున్న కన్నెపిల్లల పాటల్లోని ఆనందాన్ని చూచి తీరాల్సిందే. సామాన్య మానవులకే యీ దృశ్యం కడు రమ్యంగా కనిపిస్తే యిక అన్నమయ్య వంటి సంగీత సాహిత్య విద్యాపారంగతుని కంటబడిన యీ దృశ్యం రమ్యాతిరమ్య రీతిలో పదరూపం ధరించక పోతుందా! అందుకే ఆ క్షణంలోనే అన్నమయ్య కలం కూడా పద విన్యాసం చేసింది. ఎలా? యిలా-

కొంని దోపరికి గొబ్బిల్లో
యదుకుల స్వామికిని గొబ్బిళ్ళో ॥

కొండ గొడుగుగా - గోవుల గాచిన
కొందొక శిఖువుకు గొబ్బిళ్ళో
దుండగపు దైత్యుల కెల్లను తల
గుండు గండనికి గొబ్బిళ్ళో ॥కొంని॥

పాపవిధుల శిఖపాలుని తిట్ల
కోప గానికిని గొబ్బిళ్ళో
యేపున గంసుని యిడుమల బెట్టిన
గోపబాలునికి గొబ్బిల్లో ॥కొంని॥

దండి వైరులను తటిమిన దనుజుల
గుండె దిగులునకు గొబ్బిళ్ళో
వెండి బైడియగు వేంకటగిరిపై
కొండలయ్యకును గొబ్బిళ్ళో ॥కొంని॥

అన్నమయ్య పదాలలోని మరొక విశేషం. విషయం యెక్కడా పునరావృత్తం కాకపోవటం. కావ్యరూపకంగా కాక కేవలం పదాలరూపంలోనే ఒక మనో కావ్యానికి వలసినంత భావవిన్యాసాన్ని కనబరచిన వేంకొట్టి పదాలలోని విషయ వైవిధ్యం మనల్ని ముగ్ధులని చేస్తుంది. పాలు పెరుగులను దొంగిలిస్తూనే - తన అవతారోద్దేశాన్ని కూడా నెరవేరుస్తున్న బాలునిగా శ్రీకృష్ణుడు అన్నమయ్య భావనా ప్రపంచంలో వివిధ రూపాలలో సాక్షాత్కరిస్తాడు.

మనమింతకు ముందు చూసిన లాలిపాట కన్నా పూర్తిగా భిన్నమైన యీ పాట లోని సాహిత్యాన్ని పరికించండి.

బండి విరిచి పిన్నపాపలతో నాడి
దుండగీడు వచ్చె దో బూచి

"పెరుగు వెన్నలు ప్రియమున వే
మరు ముచ్చిలించు మాయకాడు
వెరవున్నా దన విధము దాచుకొని
దొరదొంగ వచ్చె దో బూచి"

"గొల్లపల్లెలో యిల్లిల్లూ చొచ్చి
కొల్లలాడిన కోడెకాడు
యెల్లయినా వేంకటేశుడు యిదె
తొల్లిటి దొంగవచ్చె దో బూచి"

ఎంతకూ మాట వినని పాపాయిని నయానా భయానా నిదురపుచ్చటం తల్లి అభీష్టం. దానికి యే బూచివాడినో కవ్వించి, ఆతని భీకరాకృతిని వర్ణించి చెప్పి- "నీవు నిదురపోకుంటే- ఆతగాడు నిన్నెత్తుకు పోతాడులే"- అని బెదిరించి- భయపెట్టి- పాపడిని నిద్రపోయేలా చేయటం చాలా మంది తల్లులకు అలవాటే. గోపవనితలకు వినిపించిందీ- అలాంటి ఓ తల్లి పాటే. కానీ యిక్కడ తమాషా యేమిటంటే- అల్లరి కృష్ణయ్యనే బూచివానిగా ఓవైపు చిత్రీకరిస్తూ, ఆతడు చేసిన చిలిపి పనులను వర్ణించి చెప్పటం. సామాన్య బాలబాలికల మాట అటుంచి- పెద్దవారికే సాధ్యమవని పనులను ఎంతో సునాయాసంగా చేయగలిగే సామర్థ్యం వల్ల 'అవతారపురుషునిగా పల్లవి'లో గుర్తించిన చరణాల వద్దకొచ్చే సరికి- ఆతని చిలిపి పనులకే ప్రాధాన్యత నివ్వటం అమాయకులైన జానపదుల సహజ స్వభావాన్ని తెలుపుతూం దీ పాట! ఇలాంటి సహజ సుందరాలైన వర్ణనలు అన్నమయ్యలో కోకొల్లలు. ఉదాహరణకు యీ రచన గమనించండి.

ఇట్టి ముద్దులాడి బాలుడేడవాడు వాని
బట్టతెచ్చి పొట్టనింద పాలువోయరే"

"గామిడై పారుదెంచి కాగేటి వెన్నెలలోన
చేమపూవు కడియాల చేయివెట్టి
చీమ కుట్టెనని తన చెక్కిట కన్నీరు జార
వేమరు పోయేవాని వెడ్డువెట్టరే"

"ముచ్చువలె వచ్చి తన ముంగైమురువుల చేయి
తచ్చేటి పెరుగులోన దగవెట్టి
నొచ్చెదనని చెయ్యిదీసి నోరు నెల్ల జొల్లుగార
నొచ్చెలి వాపోవు వాని నూరడించరే"

గోప వనితలు పాడుతున్న యీ పాటలో చిలిపికృష్ణుని అల్లరి చేష్టలను వర్ణించటం ముఖ్యోద్దేశం. ఒకానొక గొల్లయింటిలోనికి దొంగతనంగా ప్రవేశించి, వెన్న దొంగిలించబోయాడు. కుండలో చేయి పెట్టిన వెంటనే చీమ చటుక్కున కుట్టింది. చేయి చురుక్కుమంది. కంటిలో నీరు గిర్రున తిరిగింది బాధ్యోర్వలేక గొంతెత్తి ఆరున్నొక్క రాగమూ ఆలపించటంతో గుట్టుకాస్తా రట్టయి పోయింది. యిది విని వంటయింటిలోకి పరుగుపరుగున వచ్చిన గొల్లభామకు నీలాల కన్నుల్లో నీళ్లూరుతుండగా- వెక్కివెక్కి యేడుస్తున్న నీలమేఘశ్యాముడు కంట బడ్డాడు. చేతికంటిన వెన్నమరకలు ఓవైపు నోరూరిస్తున్నా చీమకుట్టిన బాధ దానిముందు విపరీతంగా వుంది. పాలబుగ్గలపై జాలువారే కన్నీటిని ఓ చేత్తో తుడుచుకుంటూ నిలబడ్డ చిన్నికృష్ణుణ్ణి చూడగానే ఆ యిల్లాలి గుండె తరుక్కు పోయింది. అలాంటి బాలమురళి కృష్ణుని పూరడించటం యిలా! ఏముంది? చిన్ని బొజ్జ నిండా పాలుపట్టి లాలించటం ఒక్కటే మార్గం.

ఇదిలా వుండా! యీ గోపాలబాలుని దూకుడును భరించలేని మరికొందరు స్త్రీలు యశోదమ్మ దగ్గరికి యీ విషయమై ఫిర్యాదు చేయటానికి వెళ్లారు. అక్కడ వాళ్లు యీతని ఆకతాయి తనాన్ని వర్ణించిన వైనం కడు రమ్యం.

చూడవమ్మ యశోదమ్మ
వాడవాడల వరద లివిగో

"పొంచి పులివాలు చెరుగు
మించు మించు మీగడలు
వంచి వారలు పట్టిన
కంచపుటుట్ల కాగు లివిగో"

"పేరీ బేరని నేతులు
చూరల వెన్నెల జున్నులును
ఆరగించి యట సగభాక్లు
పారవేసిన బాన లివిగో"

"తెల్లని కనుదీగెల పోగల
చల్లలమ్మేటి జవ్వనుల
చెల్లినట్లనే శ్రీ వేంకటపతి
కొల్లలాడిన గురుతు లివిగో"

ఈ సమయంలో కృష్ణుడు యిటిలోనే వున్నాడు. తనపై తల్లికి ఫిర్యాదు చేస్తున్న వారిని చూస్తుంటే చాలా కోపంగా వుందతనికి. వూరుకుంటున్న కొద్దీ వాళ్ల వర్ణనలు యెక్కువవుతున్నాయ్. అతనిలో వుడుకుమోతు తనం ప్రవేశించింది. చూసి చూసి ఒక్కమారుగా వాళ్లతో తగవులోకి దిగాడు.

కృష్ణ : వెక్కమటే యీ మాట నిజమనేవు.
గో : నిక్కముగాక బొంకనేర్తుమా బాలుడా.
కృ : కంటివటే వెన్న దియ్యగా గొల్లెతా.
గో : విన్నంటిమా వెన్నవోయె నంటిమిగాక.
కృ : యింటికి నేవచ్చితినటే గొల్లెతా!
గో : మా యింటికి నీకు రానేలనయ్యా బాలుడా!
కృ : ఏలే మాకు పాలు లేవటే గొల్లెతా!
గో : నీకు నేల లేవు? మమ్ము విచ్చి యేచేవుగాక.
కృ : పాలనే బడుండుట దలంపవే గొల్లెతా.

గో : ఆ పాలు నీకు నేల మాపాలేగాక బాలుదా.

కృ : కల్లలాడ దొరకొంటిగా గొల్లెతా.

గో : నీకు పల్లదాలు వేంకటాద్రిపై బాలుదా.

కృ : చల్లబో ననొల్లవబే చిన్ని గొల్లెతా.

గో : నీక జెల్లు నిట్టె యేయైన జేయవయ్య బాలుదా ॥

పై పాటలో ఒక విశేషం గమనించ దగ్గది. సామాన్యార్థంలో యీ పాట లోని తాత్పర్యం కేవలం జానపదులైన గొల్లవారలదు స్వభావ వర్ణన వుంది. సాధారణంగా గొల్లవారిళ్ళలో పాలు పెరుగులకు యే లాంటి కొదువా వుండదు. యిక గోకులంలో గొల్లపెద్ద అయిన నందుని యింట చప్పనివసరమే లేదు. అనందుని ముద్దుల తనయుడైన తనకు పాలు పెరుగులతోసం మొగం వానినట్టు యిరుగు పొరుగు యిండ్లలో దొంగతనం చేయవలసిన అవసరం లేదని కృష్ణుడు దగాయిస్తుంటే - అతని వాగ్ధాటికి తట్టుకోలేని గోప వనితలు యిమ్ము పలకలేక - ప్రతి మాటకూ నిజము నిజమని పలుకుతున్నారట! యిక నిశేషార్థంలో పాలకడలిలో పవ్వళించే తనకి గొల్లయిండ్లలో పాలు పెరుగులను దొంగిలించనవసరం వుందా! అని కృష్ణుడు ప్రశ్నిస్తుంటే. 'నిజమే ఆ అవసరం నీవంటి మహనీయునికి లేదంటూ నీవంటి అవతార పురుషుడు మా యింట కాలుమోపే అదృష్టం మాకు కలుగుతుందా! అసలు నీవంటి మహానుభావునికి మాలాంటి సామాన్యులతో యే అవసరం రాగల'దని ఆ గొల్లవనితల వినయానుసంధానం. 'పాలకడలిలో తేలియాడే ప్రభువు నీవయితే- నేలను నిలబడి నిను ప్రస్తుతించే వారము' మేమన్న ఆర్థం గోచరిస్తూంది. మరో అర్థంలో ప్రతి యింటిలోనూ పాలుమీగడలను దొంగిలిస్తూ పాలవెల్లువలో తేలియాడేలా అల్లరిచేసే నీకు నీ అల్లరి క్రీడలా వుండే- ఆ పాలు పెరుగులను అమ్ముకుని బ్రతికే మావంటి వారికి మన్నేగతి'- అని తమ జన్మ సహజమైన అజ్ఞానాన్ని ప్రకటించుకుంటున్నారని కూడా విదిత మవుతుంది.

ఉపసంహారం :- ఈ విధంగా వర్ణించుకువెళ్తే అన్నమయ్య-సూరదాసుల వాత్సల్యరస వర్ణనలు అత్యంత సహజంగా- అత్యాకర్షణపంతంగా అత్యంత ఆదరణీయాలుగా కనిపిస్తాయి.

ఇప్పుడు సూరదాసు. వాత్సల్య రచనలలోని ప్రత్యేకతలను విడమరచి చెప్పకుండాం అతి సులభమైన రీతిలో, సుఘటిత శైలిలో సఫలవంతమైన తీరులో శ్రీకృష్ణుని బాల్య క్రీడలను వర్ణించటం ఒక్క సూరదాసునికే చెల్లింది. బాల్యావస్థను సంబంధించిన యేచిన్న సంఘటనా ఆతని సునిశిత దృష్టిని దాటి వెళ్లలేకపోయింది అన్నకడక్కడ వర్ణనలలో అలౌకికత్వం కనబడినా అది- వాత్సల్యరస ప్రవాహానికి అడ్డుకాలేదు. రసపరంగా వాత్సల్యరసానుభూతికి యే విధమైన ఆటంకమూ కలుగలేదని నిరాఘాటంగా చెప్పవచ్చును. భక్తిభావ ప్రాధాన్యత నణుగరించి కొన్నిచోట్ల అద్భుత రసావిష్కరణ కూడా జరిగింది. కృష్ణావతార విశేషంగా- భక్తిపరమైన వాత్సల్యరస విస్తారానికి దోహదం చేసి ఆ మూర్ఛంలో పఠితలను ఆనందపరుస్తుంది. మొత్తంమీద సూరదాసుని రచనా శైలిపుడి- బాలకృష్ణుని క్రీడావర్ణనంలో అప్రతిమాన ప్రతిభా సంపత్తులను ప్రదర్శించి అనితర సాధ్యమనిపించేలా ఆనందామృతాన్ని పంచిపెట్టింది. యిక- ఆ అమృతాన్ని ఆస్వాదించగలిగే రసహృదయమే పాఠకులలో తరువాయి.

అన్నమయ్య పదరచనలలో వాత్సల్య రసపోషణ విషయానికి వస్తే- ఆయన రచనా పాటవం నవనవోన్మేషం సూరదాసునిలా కృష్ణగాథను మహత్కావ్యరూపంలో మలచకపోయినా - అన్నమయ్య పతిపదమూ దేనికది ప్రత్యేకతను కలిగినదే. దేనికది- మరపురాని మధుర రసానుభూతిని పాఠకునకు అందివ్వగలిగినదే. పదము పదములోనూ పరవశింపజేసే భావస్పందనతో పాటూ- ముచ్చటైన సన్నివేశమొకటి మన హృదయ ఫలకాలపై నిలుస్తుంది. పాలు వెన్నలదొంగగా ప్రసిద్ధిచెందిన చిలిపికృష్ణుణ్ణి కేవలం అలాగే వర్ణించటం అన్నమయ్య కిష్టంలేదు. ఓవైపు అతని బాల్య క్రీడలను సహజాతి సహజంగా వర్ణిస్తూనే మరోవైపు - భగవదవతారంగా ప్రస్తుతించటం అన్నమయ్య అనుసరించిన విధానం. ఇందువల్ల పాఠకులకు మధురానుభూతితోపాటు భగవదనుభూతి కూడా కలగటం అన్నమయ్యరచనలోని విశేషం. యిలా ఆతని రచనలువేటికవే-కావ్యానుభూతిని కలిగించిన తరుణంలో- యీతని సువర్ణాక్షరాలతో మహత్కావ్యాన్ని చవిచూడలేకపోయామే! అన్న తపన పాఠకునిలో మిగిలిపోవటం సహజం.

ఏవిఏమైనా వివిధ భక్తిసాహిత్యాలలోని వాత్సల్య రసవర్ణనలను పరిశీలిస్తే- సూరదాస్ అన్నమయ్యలలోని రచనా వైవిధ్యం పాఠకులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఈ యిరువురు భక్తకవులలోనూ వాగ్దేవి తన ప్రతిబింబాన్ని చూసుకుందనటంలో సందేహం లేదు.

త్యాగరాజులో సాహిత్య శిల్పం

లలిత కళలన్నింటిలోకీ సంగీతానికి వున్న ప్రతిభ- సర్వవిదితం. సకల జీవకోటినీ ఆనందసాగరం అంచులు ముట్టేలా- తన్మయుల్ని చేయగలిగే సామర్థ్యం సంగీతానికి వుంది. సంగీతం సమ్మోహన విద్యలాంటిది. సంగీతం ద్వారా మనసులను కైవసం చేసుకుని శాసించవచ్చు. అనుకూలంగా మలచుకోవచ్చు. అంతేకాదు. సంగీతం ద్వారా కొన్ని అనారోగ్యాలను కూడా నయం చేయవచ్చునని ఆధునిక విజ్ఞాన ప్రయోగాలు చెబుతున్నాయి. సంగీతాన్ని శ్రోతగా వినడం- విద్యార్థిగా అభ్యసించడం వంటి దశలను దాటి సంగీతాన్నే పరమాత్మ స్వరూపంగా ఆరాధించి, యోగంగా అభ్యసించి పరమోత్కృష్ట సమాధి స్థితిని పొందిన మహానుభావులూ వున్నారు. అటుపంటి మహనీయులలో త్యాగరాజు ఒకరు.

18వ శతాబ్దంలో తెలుగు కుటుంబంలో తమిళనాడు గడ్డపై వుదయించిన యీ తేజోమయతార- సంగీత విశేలాకాశంలో దివ్యకాంతులను విరజిమ్మగలదని అనతికాలంలోనే విదితమైంది. అటు మాతామహులు, ఇటు పితామహులు, యిరువురూ - సంగీత సాహిత్యాలతో గాఢసంపర్కం కలిగినవారవటంచేత త్యాగరాజుకు బాల్యం నుంచే ఆ విద్య అబ్బింది. పూవుకు తావి అబ్బినట్లు, సువర్ణానికి సుగంధమంటినట్లు- యీ బాలునికి అటు సంగీత విద్యాభ్యాసమూ- యిటు వేదశాస్త్రావలోకనమూ రెండూ ప్రాప్తించాయి. తంజావూరు మహారాజు గారి ఆస్థాన విద్వాంసుడూ- సంగీత కళాకోవిదుడూ అయిన శొంఠి వెంకట రమణయ్యగారు సంగీత విద్యాగురువులయితే- తండ్రిగారైన రామబ్రహ్మంగారు వేదశాస్త్రరీతుల నభ్యసింపజేసిన గురువు. ముద్దులొలికే బాల్యావస్థలోనే శ్రీరామ మంత్రోపదేశ పునీతుడైనాడు త్యాగరాజు. అంతేనా! సాక్షాత్తూ నారదమహర్షుల దర్శనాన్ని పొందగలగటమేకాక, ఆయన చేతులద్వారా స్వరార్ణవమనే సంగీత శాస్త్ర రహస్యనిధిని స్వీకరించిన ధన్యజీవి ఆ క్షణంలోనే సంగీతసేవద్వారా ఆధ్యాత్మిక మార్గంవైపు పయనించటమన్న ప్రథమోద్దేశ్యం ఆయన జీవితానికి లక్ష్యంగా నిర్దేశించబడింది. తరువాతి కాలంలో అతని జీవితంలో జరిగిన అనేక

సంఘటనలు- అతని భక్తి తత్పరతను పరీక్షించేవిగా వున్నాయనటంలో సందేహం లేదు. ఒక విగతజీవుని తన గానౌషధం ద్వారా బ్రతికించటం మొదలు సప్తగిరుల పై వెలసిన శ్రీ వేంకటేశునికి హృదయావేదనను గేయంద్వారా విన్నవించుకుని తెర తొలగింపజేసి ఆయన దివ్యమంగళ రూపసందర్శన భాగ్యాన్ని పొందినప్పటివరకూ త్యాగరాజు జీవిత సంఘటనలు భక్తిజీవన ప్రథమ సోపానం నుంచి ఆధ్యాత్మిక జీవిత పరాకాష్ఠవరకూ అతడు అనుభవించిన వివిధ దశలనూ ప్రతిబింబిస్తున్నాయి. సంగీత మార్గంలో ఆధ్యాత్మిక పథంవైపు పయనించిన త్యాగరాజు - ఆటు సంగీత ప్రియులకూ యిటు ఆస్తిక మార్గానుయాయులకూ అంతులేని సంగీత సాహిత్యనిధిని సమర్పించి వెళ్ళారు. ఆ నిధి కేవలం మానసికానుభవమే కానీ భౌతికమైన విలువలకు అందనిది.

త్యాగరాజు కీర్తనలలోని సాహిత్యాన్ని పరికిస్తే అందులో నిక్షిప్తం చేయబడిన యెన్నో విలువైన సందేశాలున్నాయనిపిస్తుంది. పరమ భక్తాగ్రేసరునిగా ఒక స్థానాన్ని సంపాదించిన త్యాగరాజు తన రచనలలోనూ అలాంటి ఉత్కృష్ట భావాలనే వ్యక్తపరచాడు. ఆయన కీర్తనలలో అఖండ విజ్ఞానం, అత్యుదారమైన కరుణ, అతి మధురమైన ప్రేమాదరణలు-వీటన్నింటితోపాటు మానవ జీవనానికి కరదీపికలుగా వెలుగొందే ఉపదేశ వాక్యాలు- ఉషనిద్ ప్రమాదాలు- యిలా అన్నీ వేదికవే పోటిపడి కనిపిస్తాయి. మరొక చెప్పుకోదగ్గ విశేషం, ప్రవాసాంధ్రులైనా మాతృభాష అయిన తెలుగుపట్ల త్యాగరాజు విశేష ఆదరాభిమానాలు. ఒక విధంగా చెప్పాలంటే సందర్భానుసారంగా చాలా చక్కగా అతికినట్లు విషయ వివరణకు సామెతలు- జాతీయాలు వంటి ఆభరణాలను చేర్చటం త్యాగరాజుకు వెన్నతోపెట్టిన విద్య. అంతేకాదు. ఆయన కీర్తనలలో సంగీత సాహిత్యాలు రెండూ చెట్టాపట్టాలు వేసుకుని వుండటం గమనించదగ్గ విషయం.

మానవ జీవనం అనేకానేక సంఘర్షణల మయం. నిరంతరమూ యేవో సమస్యలతో సమమతమయ్యే సందర్భాలలో వ్యవహరించవలసిన తీరును గురించి ఒక మనస్తత్వశాస్త్రవేత్తగా ఆయన సలహాల నిచ్చిన వైనం బహుధా ప్రశంసనీయం. వైనందిన జీవిత సమస్యలతో విసుగెత్తిపోయిన క్షణాన భగవదస్తిత్వాన్ని గురించిన సందేహమూ మానవునికి కలగటంలో విచిత్రంలేదు, అలాంటి హృదయ మథన సమయంలో యిదమిత్థమని తేల్చలేని నిస్సహాయ స్థితి యేర్పడు

తుంది. ఆటువంటప్పుడే మానవునికి సందేహ నివృత్తి చేసి - జీవితం పట్ల సదవగాహన యేర్పరచటంతోపాటు - తన జీవిత నౌకను నడిపించే చుక్కాని - ఫలానారూపంలో తనవెంటే వున్నాడన్న ధైర్యాన్ని కలిగించగలగాలి. కానీ ఒక్కటి మాత్రం నిజం భగవదస్తిత్వం పట్ల నమ్మకం వున్నవారికి వారి ఆవిశ్వాసమే కొండంత బలం. అలాకాక దైవశక్తి కన్నా మానవశక్తినే అధికంగా నమ్మేవారికి వారి ఆ దృఢ విశ్వాసమే శ్రీరామరక్ష. కానీ యిక్కడొక రహస్యం వుంది. దైవశక్తి మానవశక్తి యీ రెండింటిలో దేనిని నమ్మినా వారు ఆస్తికుల క్రిందే లెక్క. శక్తి యే రూపంలో వున్నా అది పూజనీయమే గదా! అందుకే యీ శక్తిపట్ల నమ్మకం వున్నవారికి మరి వేరే మాటలతో పనిలేదు. అందుకే భగవత్ స్వరూప నిర్ణయాన్ని చేయగలగటం వారివారి అనుభూతినిబట్టి వుంటుంది. అందుకే 'కద్దనువారికి కద్దు' అన్న తమ కృతిలో 'మతాలకు పునాది కేవలం విశ్వాసమే' - నన్న విషయాన్ని నొక్కి చెప్పారు.

'మనసు నిల్ప శక్తి లేకపోతే' - అన్న రచనలో బాహ్యాచారాల మీద కపటనటనలపట్ల తనకున్న అసహ్యాన్ని చక్కగా వ్యక్తపరచారు. జన సామాన్యంలోని బలహీనతలు, బాధలు, ఆకాంక్షలు, ఆవేదనలు, కోరికలు, ఆవశ్యాలను అర్థం చేసుకుని యెంతో వుదార చిత్తంతో వుపదేశాలనందివ్వగలరాయన.

'మనసు స్వాధీనమైన ఆ మునునికి మరి మంత్రతంత్రము లేల' - అన్న శంకరాభరణ రాగకృతిలో - భగవంతునిపట్ల చిత్తైకాగ్రతలోని విశేషతను నిరూపించారు. అంతేకానీ కఠిన నియమనిష్ఠలను ఆచరించటమే జీవిత పరమార్థంగా ఎందుకొని వాటిని నియమబద్ధంగా ఆచరింపలేక-వాటి నుంచి బయటపడే మానసిక ధైర్యస్థైర్యాలు లేని మూఢ విశ్వాసులను చూచి జాలి చెందుతారు. ఆలాంటి మూఢాచారాలవల్ల వుపయోగం లేదనీ సత్యపాలన, సదాచారం, సద్భక్తిని ఆలవరచుకోవటం వంటి సులభనియమాలే భగవత్సామీప్యసుఖాన్ని అంది వ్వగలవని నొక్కి వక్కాణించారు.

'ధురాశ దుఃఖమునకు చేటన్నట్లు ధనదాహంతో వివిధ మార్గాలద్వారా సంపాదించడానికి వుద్యుక్తులయే మూఢమానవులను చూస్తే త్యాగయ్యకు జాలి. కోట్లకు పడగలెత్తినా - నోటికి చేరేది చారెడు మెతుకులేనన్న నగ్న సత్యాన్ని విస్మరించి లక్షల నిరుపయోగమైన జన్మల స్థాయినుంచి యెదిగి సంపాదించుకున్న

అమూల్యమైన మానవజన్మను వ్యర్థపరచే అమాయకులకు జ్ఞానోపదేశం చేయటం యెలా అన్నదే వారి తపన. ఈషణాత్రయపు విలువలేని ఐహిక సుఖాల వ్యామోహంలో బడసిమానసంపద క్షవిరాసుమూతిని గుర్తించలేని మూఢమానవులకు నశ్వరమైన జీవిత సుఖాలను గురించిన కఠిన సత్యాలను తన రచనలలో పొందు పరచి యీ అజ్ఞానం నుంచి మేల్కొనమని పదేపదే హెచ్చరిస్తుంటారు.

రూకలు పదివేలున్న చేరెడు నూకలు గతిగాని మనసా :
కోకలు వెయ్యున్న గట్టుకొనుట కొకటిగాని ఓమనసా :
ఉరేలిన తాబందుట మూడుమూర తావుగాని ఓ మనసా :
నూరు భక్షణము లిచ్చిన యెంతో నోటికంతగాని :

జీవిత పరమార్థాన్ని గుర్తించి భగవద్భక్తినే ధ్యేయంగామలచుకునినిరంతర రామనామ స్మరణలో కాలంగడిపే యీ పరమ భక్తాగ్రేసరుణ్ణి యే శక్తులూ, యేమీ చెయ్యలేకపోయాయి అందుకే శరభోజీ మహారాజు ఆయనను రాజసభకు ఆహ్వానించినా మృదువుగా తిరస్కరించారు. ఆ సందర్భంలోనే లౌకిక సంపదల కన్నా పారమార్థిక సంపదలే మనిషికి ముఖ్యమన్న సత్యాన్ని గుర్తుచేస్తారాయన. ఆ సందర్భంలోని వారి యీ క్రింది రచన సుప్రసిద్ధం.

నిధి చాల సుఖమా
రాముని సన్నిధిసేవ సుఖమా-

ఒక మహత్తరమైన విషయాన్ని సామాన్య జనులకు చక్కగా అర్థమయ్యేలా యెలా చెప్పగలం? వారికి అందుబాటులో వున్న పదాలద్వారా వారు నిత్యమూ చూచే సంఘటనలను పురహరిస్తూ. భాషకు చక్కని నుడికారాలైన సామెతలను జాతీయాలను పొందు పరుస్తూ, పండితపామర రంజకంగా రచనలు చేయటం త్యాగరాజులవారికి వెన్నతో పెట్టిన విద్య.

జీవితం పట్ల యింత చక్కటి అవగాహన కలిగి వుండటంవల్లే తాను యేనాడూ ధన సముపార్జనకు ఆశపడలేదు. కేవలం 'ఉంఛవృత్తి'ని ఆధారం చేసుకొని పదిమంది దానం చేసిన దానితో దినాలు గడిపే త్యాగయ్య, ప్రాపంచిక సుఖాలను తృణప్రాయంగా చూచారు. నిజమే. సకలసృష్టికి మూలాధారమైన

భగవత్సాన్నిధ్యంలో అతని ధ్యానంలోనే జీవితం గడిచిపోతున్నప్పుడీ తుచ్ఛమైన ఆకర్షణలు ఆయన దృష్టిలో యెంతటివి? నిరంతర రామధ్యాన తత్పరుడైన ఆయనకు అంతకంటే కోటిరెట్లు అధికమైన ఆనందం అనుక్షణమూ లభిస్తుండగా యీ సామాన్య జీవనం వైపు దృష్టి సురల్చవలసిన అవసరం లేదు. కానీ ఒక్కటి. కేవలం తాను మాత్రమే యీ అమూల్యమైన సుఖాన్ని పొంది తృప్తి చెందే మనస్తత్వంకాదు ఆయనది. అందుకే తన చుట్టూ వున్న సమాజంలోనూ యిలాంటి పరిస్థితే నెలకొనాలని "లోకాస్సమస్తా స్సుఖినో భవన్తు" అన్నట్లు ప్రజలందరూ యీ పారలౌకిక సుఖానుభూతిని పొందాలన్నదే ఆయన తపన. అందుకే యెప్పటి కప్పుడు ప్రజలకు యీ విషయాలను తెలియజేయటం తన బాధ్యత అనుకున్నారు.

ఐహిక సుఖాల వేటలో అలసి సొలసే ప్రజలకు పూరట కలిగించేందుకు 'రానిది రాదు పోనిది పోదు సురాసురులకైన బ్రహ్మాదులకైన'- అన్న మణిరంగు రాగయుక్త రచనలో అన్నారు మానవజీవనం అస్థిరమైనది. ముద్దుద ప్రాయమైనది కనకనే యీ చిన్న జీవితాన్ని సార్థక పరచుకునే ప్రయత్నం చేయమని "సమయము తెలిసి పుణ్యము చార్జింపని తనువు వుడియేమి, పోయి యేమి"- అని చనువుగా సుందలించారు. భగవంతుని అవతార రహస్యం తెలియక కొట్టుమిట్టాడే ప్రజల అజ్ఞానాంధకారాన్ని దూరం చేసేందుకై ఆతడు సత్యాంత ర్యామి - అన్న సత్యాన్ని "చీమలో బ్రహ్మలో శివకేశవాదులలో" దూడా అతడున్నాడని చెబుతూ పేరుమార్గమొక్కటే భగవంతుని సమీపానికి చేర్చగలిగే స్థిరమైనమార్గమని నొక్కి చెప్పారు. ఈ కీర్తనలో శివకేశవులిద్దరిలోనూ పరమాత్మను గుర్తించగల్గడం త్యాగరాజు సమన్వయ దృష్టికి తార్కాణం. తిక్కనా మాత్యుడు ప్రతిపాదించిన హరిహరనా థతత్వనిరూపణ యీరచనలో కనిపిస్తుంది.

'ఉండేది రాముడొకడు' - అన్న కీర్తనలో శ్రీరామచంద్రుని సంపూర్ణ మానవునిగా చిత్రించారాయన. మానవుడు దైవత్వాన్ని సాధించగలడన్న నగ్న సత్యాన్ని రసవత్కావ్యంగా మనముందుంచిన మహామహుడు వాల్మీకి. అందుకే తన శ్రీమద్రామాయణంలో మానవావతారంలో పరిపూర్ణతను పొందగలిగినవానిగా తన రాముణ్ణి చిత్రీకరించాడాయన. నిరంతర రామాయణ పఠనాసక్తుడైన

త్యాగరాజులోనూ యిదే భావన స్పష్టంగా కనిపిస్తుంది. 'ఏమి చేసితే యేమి' అన్న కృతిలో అపరిమితమైన ఆవేదన. అత్యంత విలువైన జీవిత విలువలను మరచి లౌకిక సుఖాసక్తుడై మానవుడు తన లక్ష్యాన్ని మరచిపోతున్నాడన్న తపనా, కనిపిస్తాయి. 'యజ్ఞాదులు' అన్న రచనలో అహింసా మార్గాన్ని ప్రధానాంశంగా బోధించి పెద్ద ప్రబోధపు ధోరణి చదువరులకు గోచరిస్తుంది మత మౌఢ్యాలతో సతమతమయే వారికి చక్కని సందేశాన్నందిస్తుంది 'కోటి నదులు చనుషిక్కిటిలో నుండగ' అన్న కృతి అలాగే అజ్ఞానాంధకారంలో కొట్టుమిట్టాడుతూ, భగవదనుగ్రహానికి దూరమయే మూర్ఖుల కన్నుల కప్పుడిన అంధకారపు తెరను తొలగించుమని దేవదేవునికి మొరపెట్టుకున్న త్యాగరాజును సంఘసంస్కర్తగా గుర్తించటంలో అతిశయం యేమాత్రమూలేదు. అలాగే సాత్వికాహంకారంతో విర్రవీగేవారికి కనువిప్పు కలిగించేలా 'శాంతము లేక సౌఖ్యమూలేదు' అన్నకృతిలో నిజమైన సుఖశాంతులను నిర్వచించారు.

కేవలం సందేశ వాక్యాలతో సరిపెట్టుకోక సఫలుడైన సాహిత్యకారునిగా కూడా తనను తాను నిరూపించుకున్నారు త్యాగరాజు. 'అలకలల్ల లాడగ గని అన్న రచన ఆయన సుహృత్కల్పితమైన భావనా చాతుర్యానికి చక్కని తార్కాణం. భగవంతుని విశ్వరూపాన్ని అణువణువునా దర్శించగల్గటం ఒక మహదనుభూతి. ఆ విశ్వరూపం, కమనీయ రూపము, వీనుల విందయిన ప్రతాపము, అతి గంభీరమైన శరణాగతితో పాటు ముగ్ధమనోహర సల్లాపముతోడై దర్శనమిస్తే అలాంటి దివ్యమంగళ రూపాన్ని మహదానందంతో వర్ణించిన త్యాగరాజుని జీవితం ధన్యాతిధన్యం.

సంగీతం మహోన్నతమైనది. ఇంద్రధనుస్సులోని సప్తవర్ణాలూ యేకమై అద్భుత విశ్వప్రపంచాన్ని సృష్టించినట్లు సంగీతంలోని సప్తస్వరాలూ ఐక్యమై అపూర్వరాగ సమ్మేళనానికి నాంది పలుకుతాయి. అంతేకాదు. సంగీత రసానుభూతి, హృదయాంతరాలలో నవరసాలనూ పలికిస్తుంది. అలాంటి సంగీతం భగవన్నామమైతే, కాయజాది షడ్రిపులనూ జయింపగల మనోధైర్యాన్ని అందివ్వగలదంటారు త్యాగరాజు.

భారతీయ మహర్షులు సంగీత విద్యను వేద స్వరూపంగా భావించి పరమార్థ సాధనకై ఉపయోగించారు. నారద, కాశ్యప, మార్కండేయ, భార్గవాదులైన మహర్షులంతా యిలాంటివారే. యిక జయదేవులు, కబీర్, సూరదాస్, విద్యాపతి, నారాయణతీర్థులు మొదలైన భక్తాగ్రగణ్యులు చేసిన సంగీతం ద్వారా పరదేవతోపాసన చేసి సిద్ధిపొందిన మహనీయులే. కాలప్రవాహంలో ముంచుపడి విలువను కోల్పోయి, ప్రపంచిక సుఖాలలో ఒకటిగా మాత్రమే నిలిచిన సంగీత విద్యకు త్యాగరాజు పునర్జన్మనిచ్చారనే చెప్పవచ్చు. జగద్రక్షకుడైన శ్రీరామచంద్రుని పలుకీర్తుల ధ్యానించి, కీర్తించి, సన్నుతించి శ్రీరాముని చిత్రచరితానికి రాగతాళయుత సాహిత్య రూపంలో శాశ్వత రూపాన్నందించి, రామభక్తి సామ్రాజ్యాన్ని పొందగలిగిన త్యాగరాజు, నిజంగా ధన్యజీవి.

పురందరుని రచనా వైవిధ్యం

కన్నడ దేశంలో జైన బౌద్ధమతాల ప్రాబల్యం యెక్కువగా వుండే రోజులలో సాహిత్యంపై కూడా ఆ ప్రభావం పడిందని చెప్పక తప్పదు. మరోవైపు వీరశైవ మత స్థాపకుడైన బసవేశ్వరుని గంభీర శంఖారావం దశదిశలలోనూ మార్మ్రోగుతున్న సమయం. పోనుపోను శివకవుల తీవ్ర భోరణి పట్ల విముఖత పెరిగి సామాన్య సాహిత్య రీతులపై ప్రజాహృదయం మొగ్గుచూపనారంభించింది. అలాంటి తరుణంలోనే 'దాసకూటమి' పేర పలువురు హరిభక్తులు తమ మృదు మధుర సంకీర్తన సాహిత్యస్పర్శచే ప్రజల హృదయాంతరాళాలను పులకింపజేసిరి. శివకవుల నిర్వీకతకు, నిశ్చలతత్వానికి, కఠిన నియమాలకు అలవాటు పడలేని సామాన్యప్రజయే నియమనిబంధనలూ యేవీలేని భగవత్ సంకీర్తనలపై అంతులేనిది అభిమానాన్ని కురిపించింది. అతి గంభీరమైన శాస్త్రవిషయాలను సైతం సహజ సుందర శైలిలో వివరించగలిగే సంకీర్తనలంటే శ్రోతలు చెవులు కోసుకునేవారు.

అనాంది ఒక దాసకూటమికి నాయకత్వం వహిస్తూ అనేక భక్తి సంకీర్తనల రచనతోపాటు కర్ణాటక సంగీత ప్రాదుర్భావానికి మూలపురుషుడై నిలిచిన పురందరదాసు కన్నడ సాహిత్య వికాసానికి రాచబాటలు వేసిన మహానుభావుడు కూడా.

సుమారు నాలుగులక్షల దెబ్బైయెదు వేల కీర్తనలను అత్యంత భావవైవిధ్యంతో రచింపగల్గిన పురందరుని విస్తృత భావరీతులు చదువరులను ఆశ్చర్యచకితులను గావిస్తాయి. తనిష్ఠాగత దేహాభిమానము కూడా లేక, సర్వమానవ కల్యాణం కోసం అనవరతమూ కృషి చేసి అఖండ ప్రేమ సామ్రాజ్య స్థాపనకై తపించిపోయిన పురందరుని పూర్వజీవితం విలక్షణమైనది.

పురందరగడ అన్న బస్తిలోని కోటీశ్వరుడైన వరదప్పనాయకుని సంతానంగా జన్మించిన పురందరదాసు పూర్వనామం శ్రీనివాస నాయకుడు, తల్లిదండ్రులిరువురూ ధనగర్వం లేని సదాచార సంపన్నులు కావటం వల్ల శ్రీనివాసనాయకునికి వైదికాచార నియమ నిష్ఠలకుతోడు, కన్నడ సంస్కృత భాషలలో చక్కటి పాండిత్యమూ అబ్బింది. వంశానుగతంగా వస్తున్న వ్యాపార రహస్యాలను ఒంట

పట్టించుకోవటమేకాక సంగీత సాధన కూడా చేసేవాడట! పదునెనిమిదవయేట 'సరస్వతీబాయి' అనే కన్యతో వివాహం కూడా అయింది. భూతనయ, దైవభక్తి పరోపకారచింతన మొదలైన సద్గుణ శోభితురాలైన ఆ యిల్లాలికి బాల్యంనుంచే లోభగుణాన్ని అలవరచుకున్న శ్రీనివాసనాయకునికి అన్నింటా చుక్కెదురే. కానీ సౌశీల్యమే ఆభరణంగా కలిగిన ఆ సుగుణవతి భర్తమాటకు యెదురు చెప్పలేక స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను కోల్పోయి, అతని చిత్తచేతలలో మలగిపలసివచ్చేది. భక్తపరంధాముడు పాండురంగవిఠలుని పవిత్ర నామస్మరణలో యిహపరాలను మరచే సరస్వతీబాయికి కేవల ఆర్థదాసుడైన శ్రీనివాసనాయకునికి యెక్కడా పొత్తుకుదిరేది కాదు. కానీ అతడు భర్త. ఆమె బానిస. వారి బాంధవ్యం అంత కంటే ముందుకు సాగేదికాదు.

తనకుతానై తన భక్తులను కటాక్షించి ప్రోచే పరంధాముడైన పాండురంగ విఠలుడు శ్రీనివాసనాయకుని అజ్ఞానాంధకారాన్ని, ధనాపేక్షను తొలగింప జేసేందుకై స్వయంగా అతని చెంతకు వెళ్ళాడు. శుద్ధబ్రాహ్మణవేషం పూని, తన కుమారుని ఉపనయన సంస్కారానికై ధనం యాచించ వచ్చానని వేడుకున్నాడు. తాను వయసుడిగిన వృద్ధుడైన కారణంగా పూర్తిగా ఆశక్తుడనని యీ విషయంలో దయయుంచి సహాయం చేయవలసిందని కాళ్లావేళ్లా పడ్డాడు. అంతులేని ధనాపేక్ష వున్న శ్రీనివాసనాయకుడు ఆ వృద్ధుని మాటలను లెక్కపెట్టలేదు రోజులు వారాలైనాయి. వారాలు నెలలైనాయి. వృద్ధుడు పట్టిన పట్టు వదలకుండా శ్రీనివాస నాయకుని వద్దకు ధన సహాయార్థం వెళ్తునే వున్నా కఠిన శిలాసదృశమైన మనసు మాత్రం కరుగలేదు. మార్జాల కిశోరన్యాయరీతి భక్తపరంధాముడు యీ మూఢ ధనదాసుణ్ణి విడిచి పెట్టదలచలేదు. అచిరమైన నశ్వరమైన యీ ఐహిక సంపత్తి పట్ల మూఢ ప్రేమను పెంచుకున్న యీ పిచ్చివాడు శాశ్వత సుఖాన్నందించే దైవానుభూతిని పొందగలిగి నప్పుడుగాని తన తప్పును గుర్తించలేడన్న సత్యం పాండురంగనికి తెలుసు. అంతేకాదు. ఈ శ్రీనివాసనాయకునిలో భావిపద సంకీర్తనాచార్యుడు కనిపిస్తున్నాడాయె. అందుకే వృద్ధవేషధారి అయిన పాండురంగడు నేరుగా సరస్వతీబాయి దగ్గరికి వెళ్లాడు. తన దీనగాథను వినిపించాడు. కోమల హృదయిని సరస్వతీబాయికి కళ్ళ వెంబడి అశ్రువులు రాలాయి. అతని కెలాగైనా సహాయం చేయవలెనన్న దృఢసంకల్పం కలిగింది. కానీ భర్తకు యీ విషయం తెలిస్తే. పేరుకు తనయిల్లే అయినా యింటిలోని ఏవస్తువుపైనా తనకు అధికారం

చేదాయె. యిటువస్తువు అటు కదలినా శ్రీనివాసనాయకునికి సందేహం వస్తుంది. ఇంటిలోని పుల్ల బయటికి వెళ్ళినా అతని సునిశిత దృష్టి పసిగట్టివేస్తుంది. ఆసలే పేనుమీసిన బల్ల్యాలు వ్యాపారి! సరి యిప్పుడేం చేయాలి! సరస్వతీబాయికి మనసు అల్లకల్లోలమైపోయింది. ఆ నిస్సహాయస్థితిలో మిడుపులా ఆమెకొక ఆలోచన తట్టింది పుట్టింటివారు పెట్టిన ముక్కెరపై తనకు పూర్తిగా అధికారం వుంది. కారణం, అది కేవలం తనకోసం వారు రత్నాపడం చేయించి యిచ్చిన కానుక. దానిని అమ్మినందే యీ దీనవృద్ధుని పని నిర్విఘ్నంగా జరిగిపోతుంది. తన యీ ఆలోచనను వెంటనే అమలుపరిచింది. సువర్ణాన్ని మెరుగుపెట్టేందుకై మరిమరి వేడి చేసే విధంగా పొందురంగడు శ్రీనివాసనాయకునికి మరోపరీక్ష పెట్టాడు. సరస్వతీబాయి దానం చేసిన ముక్కెరను అమ్మేందుకు తిరిగి ఆతని వద్దకే పోయాను. రత్న పరీక్షలో పేరుపొందిన శ్రీనివాసనాయకుడు తన భార్య ముక్కెరను అతి సులభంగా గుర్తుపెట్టాడు. వేరం ఒక పట్టాన తేల్చనీయక వచ్చినతడని అక్కడే పుండమని చెప్పి తాను యింటికి బయలు దేరాడు. సరస్వతీ బాయిని ముక్కెర గురించి అడిగాడు. ఆమె తడతాటును గమనించాడు. తాను మడిలో వున్న కారణంగా ముక్కెరను తీసివుంచానని ఆమె చెప్పిన వివరణ నమ్మ బుద్ధికాలేదు. ఇప్పుడే తనకా ముక్కెర కావలెనని పట్టుపట్టాడు. సరస్వతీబాయి తనకిక మరణమే శరణ్యమని భావించి పూజామందిరంలోకి వెళ్ళి విషపూరిత హృతను పైకెత్తబోయేంతలో ఆప్తుల నుండి యేదో వస్తువు జారి పడినట్లుగా తోచింది. సరస్వతీబాయి ఆశ్చర్యంతో పరికించింది. క్రిందపడిన వస్తువు ఆ వృద్ధునికి తానే స్వయంగా అందించిన తన ముక్కుపుడక. ఆనందాతిరేకంలో తప్పిపోయిన ఆ యిల్లాలు యీ సంఘటనను భగవల్లీలగా గుర్తించింది. స్వయంగా పొందురంగ విఠలుడే తమనిలా పరీక్షించినట్లు తెలుసుకుంది. ఆతని కరుణా కటాక్ష వీక్షణాలు తమపై వున్నందుకు సంతసించింది. కర్తవ్యం గుర్తుకు వచ్చినట్లు ముక్కెరను తీసుకొని భర్త వద్దకు వెళ్ళింది దానిని చూడగానే శ్రీనివాస నాయకునికి అంతులేని ఆశ్చర్యం కలిగింది. ముక్కెరను తీసుకొని తన అంగడికి పరుగుతీశాడు అక్కడ వృద్ధుడు లేడు ముందు అతడాడు తనకు చూపించగా తాను అక్కడే భద్రపరచి వచ్చిన ముక్కెరా లేదు. శ్రీనివాసనాయకునికి యిదంతా అయోమయంగా తోచింది. యింటికి వెళ్ళి భార్యను విషయమేమిటో భయపడక విపులంగా వివరించవలసిందని అడిగాడు. ఆమె చెప్పిన కథతో అత నిలోని అజ్ఞానాంధకారం తొలగిపోయింది పూర్వజన్మ సంస్కారంవల్ల ఆతని

మనసులో జ్ఞాన జ్యోతి వెలిగింది. ఆశాశ్వతమైన ఐహిక సంపదపట్ల వీహ్యాభావం వీర్పడి శాశ్వతానందాన్ని అన్వేషించటానికై బయలుదేరాడు. తన సంపదనంతా ప్రజలకు పంచిపెట్టాడు. వ్యాసరాయస్వామి శరణుపొంది, శ్రీనివాసనాయకుడన్న పూర్వనామాన్ని త్యజించి పురందరదాసుడైనాడు. అది మొదలు తనలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి పునర్జన్మ నొసగిన పాండురంగని దర్శన భాగ్యం కోసం వేవేల పరితపించాడు. అతిదీన స్వరంతో, పరివేదనతో. అతడాలాపించిన భక్తి సంకీర్తనలు నిజమైన భక్త హృదయావేదనకు తార్కాణాలు.

ఈ విధమైన మానసిక పరిణామంతో పురందరదాసు గురువునుమించిన శిష్యునిగా యెదిగాడు శ్రీ వ్యాసరాయలవారు తన యీ శిష్యున్ని తలచుకొని యెంతగానో ఆనందించేవారట!

'మన్మనోభీష్ట దాతారం సర్వాభీష్టఫలప్రదం
పురందర గురుం వందే దాస శ్రేష్ఠం దయానిధిం'

అంటూ తన శిష్యుణ్ణే గురువుగా దర్శించి, దాసశ్రేష్ఠునిగా దయానిధిగా పొగడగలిగిన వ్యాసరాయలవారిని చూస్తే ఆశ్చర్యమవుతుంది. దీన్ని బట్టి పురందరుని అసాధారణ వ్యక్తిత్వం అర్థమవుతుంది కూడా.

పురందరదాసుని సంకీర్తనలలో వివిధ రకాలున్నాయి. తాను దర్శించిన తీర్థ మహిమలను వర్ణించే రచనలూ, గురు మహిమను వర్ణించేవీ, సర్వలోక వివరణలూ, పురాణ కథా శ్రవణాలూ, దేవతామూర్తుల మహిమా గానాలూ, సుళాదులు, ఉగా భోగాలూ మొదలైన 4 లక్షల డెబ్భైఐదు వేల పై చిలుకు రచనలో ఆయన భావనా వైశాల్యం మనల్ని ముగ్ధుల్ని చేసింది. ముఖ్యంగా సామాన్య మానవులకు జీవనలక్ష్యాన్ని గురించి సందేశం యివ్వటంలోనూ, అశాశ్వతమైన లౌకికానందంపట్ల వున్న మోహానురక్తి నుండి విముక్తిని పొందుమంటూ ఉద్బోధించిన తరుణంలోనూ, బాహ్యాడంబరాలన్న నిరుపయోగ మృగతృష్ణల వెంబడి పరుగులెత్తే మూఢజీవులకు యిది సదాచారమని ఖచ్చితంగా చెప్పే సందర్భాలలోనూ, ఆయన మహోన్నత వ్యక్తిత్వం మనలను ఆశ్చర్య చకితులను చేస్తుంది. కేవలం సంకీర్తనలరచన వరకే పురందరులు తమ పరిధిని సీమితం చేసుకోలేదు. పదుగురికీ అందుబాటులోలేని ధర్మవేదాంత తత్వ బోధ

నలను సంస్కృతంనుండి ప్రాంతీయ భాష అయిన కన్నడంలోకి యథాతథంగా ఆనువదించి గొప్పమేలు చేశాడు. 'సకల ధర్మ గ్రంథసారమన్న యీ ఉద్గ్రంథం దేశీయభాషల పట్ల ఆదరాభిమానాలు పెంపొందించేందుకు యెంతగానో ఉపకరించిందని చెప్పటంలో సందేహంలేదు. అంతేకాదు. నవవిధ భక్తులలో ఒకటిగా వెలసి ఎందరో మహనీయులకు భగవదనుభూతిని కరతలామలకంగా అందించిన సంగీత విద్య - కాలక్రమాన మునుపటి విలువను కోల్పోయి - కేవలం భోగలాల సతలోని ఒక భాగంగా మాత్రమే నిలిచివున్న తరుణంలో దానిని పునరుద్ధరించి మునుపటి కళాకాంతులను చేకూర్చిన ఘనత పురందరునికే దక్కింది. ఈ దృష్ట్యా భావితరాల వారిని శాశ్వత ఋణగ్రస్తులను చేశారాయన ఆ ఋణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.

పురందరదాసుని గురుదేవులు శ్రీపాదరాయల వారి యితర శిష్యులలో గోవిందభిక్షు, కనకదాసు, వాదిరాజు అన్న వారు కూడా ప్రముఖులు కన్నడ భక్తి సాహిత్యాన్ని బహుముఖాల పల్లవింపజేసిన యీ భక్త శిఖామణుల మూలంగా దాససాహిత్యం పట్ల అభిమానం మెండుగా అభివృద్ధి చెందింది.

దాసకూటమి ముఖ్యోద్దేశ్యాలు యిలా వున్నాయి. భోగలాలసతను వదలి కేవలం భిక్షుకవృత్తి నవలంబించటం, ప్రాప్తించిన ఆహారాన్ని ఆ రోజుకు మాత్రమే వినియోగించి తక్కినది దానం చేయటం, భగవత్కథా శ్రవణంలోనూ భగవల్లీలా వర్ణనంలోనూ కాలం వెళ్ళబుచ్చటం, విషయ వాంఛలను తృణీకరించటం. ఆగర్భశ్రీమంతుడుగా జన్మించి పరమభిక్షుగా పేరొందిన పురందరులు, ఒక్కమారుగా మానసిక పరిణామం చెంది, దాసానుదాసుడుగా పునర్జన్మ నెత్తి దాసకూటమి కఠిన నియమావళిని పవిత్రంగా అనుసరించటం ఎంతో విద్యూరమనిపిస్తుంది. ఇది కేవలం భగవల్లీలగా గోచరిస్తుందే తప్ప మరొకటి కాదు. తనవారైన భక్తులను భగవంతుడు వదిలిపెట్టడన్న సత్యానికి పురందరుల జీవితమే గొప్ప ఉదాహరణ పురందరుని అనుభవాన్ని విన్న శ్రీ పాదరాయలవారు, ఆతనిలోని అంతశ్శక్తిని "దైవశక్తి"గా కనుగొన్నారు. మహామహిమాన్వితులు, పాండిత్యఖని అయిన ఆయన పురందరుని మానసిక పరిణామాన్ని ఎంతో విలువైనదిగా గుర్తించి తన ప్రియశిష్యకోటిలో స్థానమిచ్చాడు. అంతేకాదు యీ శిష్య పరమాణువు రచించిన సంకీర్తనలను విని ముగ్ధులై 'పురందరోపనిషత్'అన్న పేరు పెట్టి ఉపనిషద్గౌరవాన్ని ప్రసాదించా

రంచే - ఆది సామాన్య గౌరవం కాదు. ఈ సందర్భంలో పురందరుని మాట ఆటు వుంచి, గురువునన్న అభిమానాన్ని త్యజించి, తన శిష్యుని రచనలను సైతం ప్రస్తుతించిన శ్రీ పాదరాయల వారి హృదయ నైర్మల్యాన్ని విశాలదృక్పథాన్ని తలచుకుంటే వినీత హృదయులము కాక తప్పదు.

ఇక పురందరదాసుని సంకీర్తనల విషయానికి వస్తే-భక్తిజ్ఞాన వైరాగ్య భరితాలైన ఆ రచనల్లో అనేక విశేషతలు కనిపిస్తాయి.

"మానవజన్మ దొడ్డదు యిద హాని మాడలు
బేడి హుచ్చప్ప గిర"

పుడమిపైని జీవులన్నింటిలోనూ ఉత్కృష్టమైన జీవి మానవుడు. ఈ మానవజన్మ ఎత్తేందుకు ముందు ఏకాణు జీవి మొదలుగాగల అనేక జన్మలను అనుభవించవలసి వుంటుంది. అంచెలంచెలుగా సాధింపగల్గిన యీ మానవ జన్మను, విషయ వాంఛలలో, అనవసర కాలయాపనలో వృధాగా గడిపివేసే లక్ష్య శూన్యులను హెచ్చరిస్తారాయన.

భగవదన్వేషణలో సంసారబంధాలను ఎక్కడికక్కడ త్యజించి, కొండ కోనలలో సర్వసంగ పరిత్యాగులుగా మెలగడం చాలా సులువైన పద్ధతి. అలాకాక, సంసార భారాన్ని మోస్తూనే తామరాకుపై నీటి బొట్టులా, కర్మ ఫలాన్ని ఆశించక కర్తవ్యాన్ని ఆచరించగల్గటం - కత్తిమీద సాములవంటిది. జనక మహారాజువలె రాజర్షిలా జీవితం గడపాలన్నదే ఆయన ఆకాంక్ష. కాకపోతే - అనవసర కాలక్షేపాలతో - అసంబద్ధ నియమనిష్ఠలతో, నిష్ప్రయోజనమైన విషయవాంఛలలో జీనితాన్ని వృథాపరచటం ఎంత మాత్రమూ గిట్టదాయనకు.

ఆనాడు శైవ వైష్ణవ భేద భావాలు ప్రజ్విల్లుతూవున్నాయి. మరోవైపు హిందూ ముస్లింల మధ్య ద్వేష భావాలు హెచ్చుపెరిగిపోతున్నాయి. వీటికి తోడు కుల మతాల ప్రసక్తి. దేశ సమైక్యతను దెబ్బతీసేలా వున్న పరిస్థితిలో సర్వ మానవ సౌభ్రాతృత్వ భావనను పెంపొందించే ప్రయత్నం చేసిన సంఘసంస్కర్త పురందరులు. 'మానవులంతా ఒక్కటే. అందరూ స్నేహ సుహృద్భావాలతో కలిసికట్టుగా మెలగా'లన్న సందేశాన్ని తన సంకీర్తనల ద్వారా వినిపించారాయన. ఆనాటి సామాజిక సంక్షోభానికి జవాబుగా మెదిలిన పురందరుని ప్రవచనాలు

కులాతీత మతాతీత సమాజస్థాపనకు పునాదిరాళ్ళుగా నిలిచాయనటం అతిశయోక్తి కానేకాదు.

నిమ్నకులాలన్నవి వారి జన్మ వల్ల నిర్ణయించేవి కావనీ, మనుజుల స్వభావాలను బట్టి కులనిర్ణయం జరుగుతుందని ఆయన వుద్దేశ్యం

హొలగేరి యవి హొవియె హొలతిల్ల
నతి వళనాగి జనకరిగె
అతి నిష్ఠురవ నుడివన హొలెయె॥
"సుతర వడెదు వార్ధక మదవేరి
పతి ద్వేషమాడు వవళే హొలతి॥
బడి యనన్నవ నుండు ఆవనకూడ
బడెదాడి రోషతాళ్వనె హొలెయ॥

పై రచనలో 'మాల' అన్న కులంలో జన్మించినవారు నిజంగా మాలలు కారనీ - భార్యా విధేయుడై తల్లిదండ్రులను సరిగా చూచుకోని పాపాత్ముడు, భర్తతో సంసారం చేసి సంతానాన్ని పొంది కూడా వార్ధక్యంలో అతనిని ద్వేషించే యిల్లాలు, తనను పెంచి పెద్ద చేసిన వారిని నిర్లక్ష్యం చేసేవాడు, దారిద్ర్యంలో భర్తను ఆడిపోసుకునే భార్య-యిలాంటి స్వభావముండేవారే నిజమైన 'మాల వారు' అని ఆయన అభిప్రాయం.

ఆచార వ్యవహారాలకు యెక్కువ ప్రాముఖ్యం కల్పించి, లక్ష్యమైన భగవద్భక్తిని వుపేక్షించే వారంటే ఆయనకు పడదు.

అందుకే

తనువు నీరొళగిద్ది ఫలలేను
మనదల్లి దృఢభక్తి యిల్లద మనజను'-

మనస్సులో దృఢభక్తి అన్నది లేకుండా స్నాన సంధ్యాధులను నిష్ఠతో ఆచరించినా ఫలితం శూన్యమంటారాయన. అందుకే ఆత్మశుద్ధి అన్నది బాహ్యాచారాలకంటే అవసరమైనది. సుప్రసిద్ధ కవి పండితులందరూ యీ ఆంతరంగ శుద్ధికే ప్రాధాన్యం ఇచ్చారు.

ఆచారమన్నది పురందరుని దృష్టిలో అనవసరమని దీని అర్థమా! కాదు. మనం ఆచరించే ఆచారాలలో కేవలానుసరణంగాక, ఆచరణ గూడా అవసరమంటారు. అంటే బాహ్యాచారవర్తనులైనవారు తామాచరించే ఆచారాల వెనుక నున్న పరమార్థాన్ని కనుగొని మెలగాలని ఆయన వుద్దేశ్యం. కఠిన నియమ నిష్ఠలను ఆచరిస్తూ లోలోపల యితరుల గురించి నీచంగా ఆలోచించే మనస్తత్వాలను సన్మార్గాన వెళ్ళమని బోధిస్తారు. ఇంట్లో పవిత్రంగా భగవత్పూజ చేసి వచ్చి బయట యిచ్చవచ్చినట్లు వాగేవారిని చూస్తే ఆయనకు బాధ. అందుకే

ఆచారవిల్లద నాలిగె, విన్న
నీచబుద్ధియ చితె నాలిగె
విచార విల్లదె పరర దూషిసువ సుక్కె-
బాచికొండిరువంధ నాలిగె-

అంటారు. పరదూషణలో కాలంగడిపేవారు యెంతటి ఆచార సంపన్నులైనా లాభమేమిటి?

పలుసదువులు నదివి పండితమానియై
తనదువిద్య నొరుల ఘనయళంబు
దూల పుచ్చునట్టి దుష్టాత్మకుని బ్రహ్మ
హత్యపొందు సందియంబులేదు-

అంటారు తిక్కన. ఎంతటి కర్మనిష్ఠులకైనా పూర్వజన్మఫలం అనుభవింపక తప్పదని పురందరుల దృఢ విశ్వాసం, ఎందుకంటారా!

ఆరేనుమాడువరు ఆరిందతే నహుదు
పూర్వజన్మద కర్మ విధి బిన్న బిడదు
పాపి దుశ్శాసన ద్రౌపదియ సీరియ నెళెదు
కోపదిం మాన భంగన మాడలు
శ్రీపతియె కాయెందు మొరెయిడువ సమయదలి
భూపరైవరు యిద్దుయేను మాడిదరు॥ ఆరేను॥

ధర్మరాజు సహధర్మచారిణి అయిన ద్రౌపదిని జూదంలో ఓడిపోయిన తరుణంలో ఆ పవిత్ర పతివ్రతను నిండుసభకు జుట్టుపట్టి యీడ్చుకు వచ్చాడు దుశ్శాసనుడు. అంతేకాదు, ఏకవస్త్ర ఆయిన ఆమెకు వస్త్రాపహరణం చేయమన్న దుర్యోధనుని ఆజ్ఞను మహానందంగా ఆచరిస్తున్న దుశ్శాసనుడూ, ఈ దృశ్యాన్ని కనులపండుగగా చూస్తూ కౌరవులందరూ పైశాచికానందాన్ని అనుభవిస్తున్న వేళ, ఆ సాధ్వీమణి ఎదుట దిగ్గజాలవంటి ఐదుగురు పతిదేవులున్నా యేమీ చేయలేక పోయారు. ఎక్కడోవున్న శ్రీకృష్ణుని శరణువేడక తప్పలేదు. మరి అంతటి పవిత్రురాలికి యీ గతి పట్టడానికి కారణం పూర్వజన్మ కర్మ ఫలితం కాక మరేమిటంటారు పురందరులు. అందుకే యే జన్మలోనూ యెవరినీ బాధింపక నిరంతర దైవ చింతనలో కాలం గడపాలన్నదే ఆయన సిద్ధాంతం.

పరధనము, పరనింద, పరసతి, పరహింస యివన్నీ పరమ పాతకమైన వట ! అందువల్ల వాటిని యెల్లపుడూ దూరంగా వుంచాలంటారు.

పరసతియు పరధనవు పరనిందె పరహింసె
పరమపాతకద కారణవెందు తెలిదు
ధరిగె దిశ పురందర విఠలన నెరె భజిసి
సుఖియాగి బాళిరో మనుజ ॥

నిరంతర హరికథా శ్రవణమే జన్మతారకం. మనస్ఫూర్తిగా భక్తుడొక్కసారి తన నామాన్ని స్మరిస్తే చాలు, అతని చెంతకు పరుగులిడుతూ వచ్చే ఆ కరుణామయుని శరణు వేడటంలోని ఆనందం - అందరికీ విదితమయ్యేలా రకరకాల రీతుల్లో గానం చేయటం ఆయనకు ప్రాణప్రదమైన పని.

"రామనామ పాయసక్కె-
కృష్ణ నామ సక్కరె
విఠలనామ తుప్ప చెరిసి
బాయి చప్పరిసిరో"

"జీవితం అంటే ఏమిటి ? అతి విలువైన యీ మానవజన్మను సార్థకం చేసుకోవటమెలా" - అని తెలియని పామరులకు అర్థమయ్యే రీతిలో ఆ భగవ

న్నామ మాధుర్యాన్ని-అందులోని ఆత్మానుభూతిని తెలిపేందుకు ప్రయత్నించారు.

"స్మరణె ఒందె సాలదె-గోవిందన
నామ ఒందె సాలదె
పరిపరి సాధన భ్రాంతియ బిడిసువ
పరమాత్మన పాద నెరెనంబిద వరిగె"

పై కీర్తనలో వివిధ జీవన మార్గాలలో పయనిస్తున్నా వివిధ సాధన రీతుల తాలూకు భ్రాంతిని వదలి - పరమాత్మ పాదారవిందాల శరణు వేడిన వారిని గూర్చి చెప్పటం జరిగింది. విజాతివాడైన ప్రహ్లాదుని, దుష్కర్మల నొనర్చిన అజామీళుని ఆదరించి ప్రోచిన భక్తపరంధాముని అసాధారణ కరుణా సంపత్తిని కొనియాడా రాయన.

అందుకే

"రామమంత్రవ జపిసో హే మనుజా"

అని మాటిమాటికీ గుర్తు చేస్తారు. అంతేకాదు

హరి కథాశ్రవణ మాడో పాడో
ధ్యాన భకుతి వైరాగ్యవీవ నిమ్మ
ఆనంద తీర్థర పాడో
పరమ పురుష శ్రీ పురందర విఠలను
చరణ కమల దలికూడో"

హరి కథాశ్రవణంలోనే రోజులు గడపుమని పురందరులు ప్రతివారికీ సందేశం యిస్తూనే వచ్చారు. ప్రతి నిముషమూ అతి ముఖ్యమైనదనీ, జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు నిరంతర కృషి - అప్రమత్తత అవసరమనీ ఆయన వుద్దేశ్యం. అందుకే "ఎచ్చరికె ఎచ్చరికె మనవె" - అన్న రచనలో క్షణికానందాలకు లొంగక సర్వోన్నతుడైన పరమాత్ముని సంకీర్తనలో జీవితాన్ని సార్థకం చేసుకొమ్మనీ, స్వార్థ చింతనను విధనాడి పరుల సుఖంలోనే పరమానందాన్ని

పొందమనీ హెచ్చరిస్తారు. అశాశ్వతమైన లౌకికానందం కంటే శాశ్వతానందం వైపు దృష్టి మళ్ళించటం మంచిదనీ అందుకే యీ శరీరంపై అపేక్షానురాగాలను త్యజించమని క్షణక్షణమూ గుర్తుచేయటం తన విధ్యుక్త ధర్మంగా భావిస్తారు.

మానవుని భగవన్ముఖునిగా చేయటమే తన జీవిత పరమార్థంగా యెంచుకున్న పురందరుని ఆధ్యాత్మిక జీవితం అమిత ఆసక్తికరంగా వుంది. స్వతహాగా నిరంతర భగవద్ధ్యానంలో మునిగే పరమ భక్తాగ్రేసరునిగా ఆయన, తన స్వామిని వేడుకుంటారు ఈ భవబంధాలనుంచి విముక్తుణ్ణి చేయమని కాళ్లావేళ్లాపడతారు. ఎంత వేడినా పలుకని స్వామిని తనపై దయ చూపించక పోవటానికి కారణమేమిటని నిలదీస్తారు నీ సామీప్య సుఖం కంటే నాకు మరో కోరిక లేదని చెంత చేరుతారు. నా హృదయమందిరం నీ కొరకే తెరచి వుంచాను, వచ్చి యీ సింహాసనాన్ని అలంకరించమని ఆహ్వానిస్తారు. తన పాండురంగ విఠలుని రాముడుగా, కృష్ణునిగా భావించి, వారి బాల్యక్రీడలను పరిపరి విధాల తలచుకుంటూ వారి ఆనాటి కొంచె చేష్టలను మురిసిపోతూ గానం చేస్తారు. అంతలోనే భక్త పరంధాముడుగా పేరొందిన హరి తనను కరుణించరాలేదేమిటా అన్న సంగతి గుర్తుకు వచ్చి ఈ బాధను భరించలేను యికనైనా నన్ను కరుణించవా ప్రభూ! అని మొర పెట్టుకుంటారు. యిలా రకరకాల మనోభావాలను తన రచనలలో పుష్కలంగా పండించిన పురందరుని రచనా సామర్థ్యానికి అవనతశిరస్కులవనివారు వుండరేమో!

తన ఈ రచనలను గానం చేస్తూ భక్తిభావపరవశులై పులకించి నృత్యం చేసేవారట ఆయన. ఆ తల్లీనత మనలను పులకాంకితులను చేస్తుంది.

నాలుగు లక్షల పైబ్బైవేలదాకా రచనలు చేసినా అన్నింటిలోని అంతులేని భావవైవిధ్యం గమనిస్తే ఆశ్చర్య పడతాం. ఆవిధంగా కన్నడ సాహిత్య రంగానికి ఒక సాహితీ నిఘంటువు నందించారంటే అతిశయోక్తి కానేరదు. అటు సంగీత రంగంలోనూ యిటు సారస్వత రంగంలోనూ ఆయన బహుముఖ ప్రజ్ఞ అనితర సాధ్యం. కేవలం కన్నడ భాషీయులేకాదు, మొత్తం భారత సాహిత్య క్షేత్రమే ఆయనకు ఋణపడివుంది ఆయన కీర్తనలు సాహితీమతల్లికి అపూర్వకానుకలు. ఆయన ఉపదేశాలు జాతి సమస్తానికి మణిదీపాలు.

894.813/09
NAG.
Acc. No. 30999
25-12-00

నాలుగంటే నాలుగే విషయాలెన్నుకుని, యీ నేల నాలుగు చెరగులనూ ముడివేస్తున్నట్టు ఉత్తర దక్షిణ భారతాల్నీ, తూర్పు పడమరల్నీ కూడగట్టుకొని, విస్తరిల్లిన కేంద్ర బిందువుగా ఆంధ్రపథాన్ని చిత్రిస్తున్నట్టు, యీ రచయిత్రి యిందులో చేసిన యత్నం మెచ్చుకోదగినది.

—డాక్టర్ వేటూరి ఆనందమూర్తి

విషయ వైవిధ్యమూ, రచనా వైశద్యములతో బాటు తులనాత్మక పరిశీలనాసక్తి ప్రతి వ్యాసంలోనూ చోటు చేసుకోవటం వల్ల యీ వ్యాస సంకలనం మామూలు సంకలనంగా కాక ఒక ప్రత్యేకత సంతరించుకొన్న సంకలనంగా కనిపిస్తున్నది.

—ఆచార్య చల్లా రాధాకృష్ణశర్మ

తెలుగు సాహిత్యం గురించే కాకుండా, యిరుగు పొరుగు భాషా సాహిత్యాలను గురించి, జాతీయ భాషా గతిమను గురించి తెలుసుకుని, వాటిని మన సాహిత్యంతో అన్వయించుకొనగలిగిన రచయిత్రి ప్రయత్నం ప్రశంసనీయం.

—డాక్టర్ భీమ్‌సేన్ 'నిర్మల్'

పద్యకవిత్వానికి వస్తే పద్యాలను వుదహరించటం అలవాటు. ఈ వ్యాస కవిత్వం చదువుతూ వుండే కొన్ని వ్యాస పంక్తులను కూడా ఉదహరించవలెనని అనిపించింది.

—ముదిగొండ వీరభద్రమూర్తి

శ్రీమతి. పుట్టపర్తి నాగపద్మినీ దేవి

ACC No: 30899

11
8-87

సంగీత సాహిత్య సమన్వయ

11/9/2002/895

263
ROY

894-8131
NAG